బుధవారం
9•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 195
• పేజీలు: 16 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

'ఈబీసీ' బిల్లుకు సవరణలు కోరండి

- ముస్లింలకు 12%, గిరిజనులకు 10% రిజర్వేషన్ పెంపును చేర్చేలా పట్టుబట్టాలి
- రాష్ట్ర డిమాండ్‌పై పార్లమెంట్‌లో పోరాడాలి
- ఎంపీలను ఆదేశించిన ముఖ్యమంత్రి కేసీఆర్



మన రిజర్వేషన్లు అడగండి



రాష్ట్రంలో ముస్లిం, గిరిజనులకు రిజర్వేషన్లు పెంచాలి: సీఎం కేసీఆర్

- తెలంగాణ తీర్మానాలను బిల్లులో చేర్చాలి
- రిజర్వేషన్ల కల్పన అధికారం రాష్ట్రాలకే ఇవ్వాలి
- ఢిల్లీలో ఎంపీ బీ వినోద్‌కుమార్ డిమాండ్

హైదరాబాద్,నమస్తే తెలంగాణ:

అగ్రవర్ణాల్లోని పేదలకు(ఈబీసీలకు) పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం ప్రతిపాదించిన బిల్లుకు సవరణలు కోరాలని టీఆర్‌ఎస్ ఎంపీలను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. రాష్ట్రంలో ముస్లింలలో వెనుకబడిన వారికి 12 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని, ఈ తీర్మానాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాల్సి ఉన్నదని చెప్పారు. ఇప్పుడు కేంద్రం రిజర్వేషన్ల పెంపు అంశాన్ని చేపట్టినందున, ఈ బిల్లులోనే తెలంగాణలో రిజర్వేషన్ల పెంపుపై చేసిన తీర్మానాన్ని చేర్చాలని కోరాలని ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. బిల్లులో సవరణలు తెచ్చి, తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌ను చేర్చేలా పట్టుబట్టాలని ఎంపీలను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. 2017లో ముస్లింలకు, గిరిజనులకు రిజర్వేషన్ పెంచాలని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేశారు. అప్పటి నుంచి ఈ అంశం కేంద్రం పరిధిలోనే ఉన్నది. సీఎం కేసీఆర్ అనేకసార్లు రిజర్వేషన్ల పెంపుపై కేంద్రాన్ని కోరినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు.

కేంద్రం స్పందించాలి: ఎంపీ బీ వినోద్

ఈబీసీ బిల్లులో సవరణలు చేయాలని, తెలంగాణలో ముస్లింలకు 12 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లను కేటాయిస్తూ చేసిన

మిగతా 2వ పేజీలో

ఈబీసీ బిల్లు పాస్

- అనుకూలంగా 323 ఓట్లు, వ్యతిరేకంగా 3 ఓట్లు
- నాలుగున్నర గంటల చర్చ అనంతరం ఓటింగ్
- సుప్రీంకోర్టులో సవాల్ చేస్తే బిల్లు భవితవ్యం ఏమిటని ప్రశ్నించిన విపక్షాలు
- ప్రతిపక్షాల సందేహాలు నిజం కాబోవన్న పాలకపక్షం
- అత్యున్నత న్యాయస్థానం కూడా బిల్లుకు మద్దతిస్తుందని ధీమా
- లోక్‌సభ నిరవధిక వాయిదా
- నేడు రాజ్యసభకు ఈబీసీ బిల్లు



న్యూఢిల్లీ, జనవరి 8:

ఇప్పటి వరకు రిజర్వేషన్ పరిధిలోకి రాని అగ్రకులాల్లోని ఆర్థికంగా వెనుకబడిన (ఈబీసీ) వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన చరిత్రాత్మక బిల్లుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. నాలుగున్నర గంటల సుదీర్ఘ చర్చ అనంతరం మూడింట రెండొంతులకు పైగా మెజారిటీతో బిల్లు ఆమోదం పొందింది. బిల్లుకు అనుకూలంగా 323 మంది సభ్యులు ఓటువేయగా, వ్యతిరేకంగా కేవలం ముగ్గురు సభ్యులు మాత్రమే ఓటు వేశారు. కాంగ్రెస్‌తో పాటు దాదాపు అన్ని పార్టీలు బిల్లుకు మద్దతు ప్రకటించాయి. బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభ నిరవధికంగా వాయిదాపడింది. ఈ బిల్లును బుధవారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. ఈబీసీలకు 10 శాతం

మిగతా 5వ పేజీలో

124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం


బిల్లు ఆమోదంతో కేంద్రమంత్రి గెహ్లాట్ విజయ సంకేతం


లోక్‌సభలో కోటా బిల్లుపై చర్చను వింటున్న ప్రధాని మోదీ

మా కోటాను అనుమతించండి



- రిజర్వేషన్లను రాష్ట్రాలే అమలుచేసుకోవాలి
- ఈబీసీ రిజర్వేషన్లకు టీఆర్‌ఎస్ మద్దతు
- ఆలస్యమైనా అగ్రవర్ణ పేదలకు న్యాయం
- లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్షనేత జితేందర్‌రెడ్డి

2

సీతారామకు గ్రీన్‌సిగ్నల్

పర్యావరణ అనుమతి ఇచ్చిన కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ

- ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌కు లేఖ
- ఫలించిన ముఖ్యమంత్రి కేసీఆర్ దౌత్యం
- ప్రాజెక్టు పూర్తితో 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు
- వచ్చే జూన్‌నాటికి పూర్తిచేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళిక


అశ్వాపురం మండలం బీజీకొత్తూరు వద్ద నిర్మాణ దశలో ఉన్న సీతారామ ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం ప్రధాన పంప్‌హౌస్

హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణం చేపడుతున్న ప్రాజెక్టుల్లో మరో ప్రాజెక్టుకు లైన్‌క్లియర్ అయింది. భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన సీతారామ ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతి లభించింది. అత్యంతకీలకమైన ఈ అనుమతిని మంజూరు చేస్తూ కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ డైరెక్టర్ డాక్టర్ ఎస్ కర్కెట్ట.. ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ సుధాకర్‌కు లేఖరాశారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇటీవల ఢిల్లీ పర్యటన

మిగతా 4వ పేజీలో


మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన మారెడ్డి

2

• సీబీఐ X సీబీఐ కేసు


అలోక్‌వర్మ

కేంద్రానికి ఎదురుదెబ్బ



- సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మను సెలవుపై పంపడాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు
- ఆయనను మళ్లీ డైరెక్టర్‌గా నియమిస్తూ ఆదేశాలు
- అత్యున్నత కమిటీ తేల్చేంతవరకు విధానపరమైన నిర్ణయాలు తీసుకోవద్దని ఆంక్షలు

5

తొలివిడుత పంచాయతీకి నేటితో నామినేషన్లు ముగింపు

- రేపట్నుంచి జోరుగా ప్రచారం
- 21న పోలింగ్.. అదే రోజు ఫలితాలు
- కొనసాగుతున్న ఏకగ్రీవాలు
- రెండ్రోజుల్లో సర్పంచ్ పదవికి 8524, వార్డు సభ్యులకు 20,902 నామినేషన్లు దాఖలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా జరుగుతున్న పంచాయతీ ఎన్నికల తొలి విడుతకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ బుధవారంతో ముగియనున్నది. బుధవారం సాయంత్రం ఐదు గంటలవరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. గురువారం ఉదయం నామినేషన్లను పరిశీలించి, బరిలో నిలిచే అభ్యర్థుల జాబితా విడుదల చేస్తారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత ఈ నెల 13న తుది

మిగతా 9వ పేజీలో

సీజేఐ నేతృత్వంలో.. ఐదుగురు సభ్యులతో

అయోధ్య ధర్మాసనం

4

గోదావరి మథనం

కొండపోచమ్మ టు ఉద్దండాపూర్..

గోదావరి జలాల తరలింపు క్రమంలో హైదరాబాద్ జంట జలాశయాలకు జలకళ

సర్వేకు ఆదేశించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

- రాష్ట్రానికి ట్రిబ్యునల్ కేటాయించిన జలాల గరిష్ఠ వినియోగానికి సమగ్ర అధ్యయనం
- మూడోదశ పూర్తితోనే దేవాదుల ఉపయోగం
- దేవాదుల ద్వారా అధిక వినియోగానికి పరిశీలన
- కాళేశ్వరంలో మూడో టీఎంసీ ఎత్తిపోతకు ఓకే
- ఎల్లంపల్లి నుంచి మేడారం వెట్‌రన్‌కు అనుమతి
- పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు ప్రత్యేకంగా ఎన్‌ఐఆర్‌ఎం టీం
- డిండికి ఏదుల నుంచి నీటి సేకరణ
- ఎస్సెల్బీసీ వేగానికి ప్రతిపాదనలపై పరిశీలన
- పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్స్‌పై అధ్యయనం
- ప్రాజెక్టులపై సీఎం సమీక్షలో కీలక నిర్ణయాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ట్రిబ్యునల్ కేటాయింపులకు లోబడి తెలంగాణలో గోదావరి జలాలను సాధ్యమైనంత మేర అత్యధికంగా వినియోగించుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వ అన్వేషణ ఇంకా కొనసాగుతూనే ఉన్నది. కాళేశ్వరం పథకంతో దాదాపు 360 టీఎంసీల జలాలను ఎత్తిపోసుకునేందుకు పుష్కలమైన అవకాశాలున్న నేపథ్యంలో ఆ మేరకు జలాల వినియోగంపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఇందుకుగాను కాళేశ్వరంలో భాగంగా నిర్మిస్తున్న కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఉద్దండాపూర్ రిజర్వాయర్‌కు గోదావరి జలాల తరలింపు సాధ్యాసాధ్యాలపై సర్వేచేయాల్సిందిగా అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై సీఎం కేసీఆర్ సోమవారం విశ్రాంత ఇంజినీర్లు, నీటిపారుదలశాఖ అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించిన విషయం తెలిసిందే. కృష్ణా, గోదావరి ప్రాజెక్టులపై లోతుగా చర్చచేసిన సీఎం.. అందులో భాగంగా కొండపోచమ్మ నుంచి ఉద్దండాపూర్‌కు గోదావరిజలాల తరలింపుపై పలు సూచనలు చేశారు. కొండపోచమ్మ రిజర్వాయర్ పూర్తిస్థాయి

మిగతా 2వ పేజీలో

భారత్ బంద్ పాక్షికం


మంగళవారం కార్మికుల సమ్మెతో బోసిపోయిన ఎంజీబీఎస్


లక్నోలో తాళం పడ్డ బ్యాంకు

- కేంద్ర వైఖరికి నిరసనగా కార్మికుల దేశవ్యాప్త సమ్మె
- పలు రాష్ట్రాల్లో స్తంభించిన ప్రజా రవాణా
- కర్ణాటకలో అంగన్‌వాడీ కార్యకర్త మృతి
- నేడూ కొనసాగనున్న సమ్మె

4

'సహకార' ఎన్నికలు వాయిదా

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం

3

బీడీఎల్‌కు మిసైల్స్ కాంట్రాక్టు

- రూ.760 కోట్ల విలువైన క్షిపణులను సైన్యానికి సరఫరా చేయనున్న సంస్థ
- సాంకేతిక సహకారం అందించనున్న రష్యా

2

సాయికృష్ణకు అండగా ఉంటాం

- కుటుంబసభ్యులు అమెరికా వెళ్లేందుకు ఆర్థికసహాయాన్ని తక్షణం అందజేయాలి
- సీఎంవో స్పెషల్ సెక్రటరీని కోరిన కేటీఆర్..
- అత్యవసర వీసాలను జారీచేయాలని అమెరికన్ కాన్సులేట్ జర్నల్‌కు ఫోన్
- కాల్పుల్లో గాయపడ్డ బాధితుడి తల్లిదండ్రులకు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా



మంగళవారం బేగంపేట క్యాంపు కార్యాలయంలో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావును కలిసిన అమెరికాలో దుండగుల కాల్పుల్లో గాయపడి చికిత్స పొందుతున్న మహబూబాబాద్‌కు చెందిన విద్యార్థి సాయికృష్ణ కుటుంబసభ్యులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అమెరికాలో దుండగుల కాల్పుల్లో గాయపడి చికిత్స పొందుతున్న మహబూబాబాద్‌కు చెందిన విద్యార్థి సాయికృష్ణకు అండగా ఉంటామని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు భరోసా ఇచ్చారు. సాయికృష్ణ కుటుంబసభ్యులు మంగళవారం బేగంపేట క్యాంపు కార్యాలయంలో కేటీఆర్‌ను కలిసి ప్రభుత్వ సహకారాన్ని కోరారు. ప్రస్తుతం సాయికృష్ణ ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డాడని, పలురకాల శస్త్రచికిత్సలు అవసరమని అక్కడున్న సాయికృష్ణ మిత్రులు తెలియజేశారని కేటీఆర్‌కు వివరించారు. అమెరికా వెళ్లేందుకు సహాయసహకారాలను అందిస్తామని సాయికృష్ణ తల్లిదండ్రులకు కేటీఆర్ హామీఇచ్చారు. మరింత సహకారం కోసం కేంద్ర విదేశీవ్యవహారాలశాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌తో మాట్లాడుతామని తెలిపారు. మహబూబాబాద్ ఎంపీ సీతారాం నాయక్ సోమవారమే సుష్మాస్వరాజ్‌ను కలిశారని గుర్తుచేశారు. సాయికృష్ణ కుటుంబసభ్యులు అమెరికా వెళ్లేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని తక్షణం అందజేయాలని సీఎంవో స్పెషల్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డిని కోరారు. సాయికృష్ణ కుటుంబసభ్యులు అమెరికా వెళ్లేందుకు అత్యవసర వీసాలను జారీచేయాలని హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జర్నల్ క్యాథరీన్‌హడ్డాతోనూ కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. కష్టకాలంలో అండగా నిలబడుతున్న ప్రభుత్వానికి సాయికృష్ణ కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



శాసనసభ ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌ను కలిసిన శాసనసభ వ్యవహారాల కార్యదర్శి నరసింహాచార్యులు తదితరులు

ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ నియామకం

- ఉత్తర్వులు జారీచేసిన గవర్నర్ నరసింహన్
- అహ్మద్‌ఖాన్‌ను కలిసిన శాసనసభ వ్యవహారాల కార్యదర్శి నరసింహాచార్యులు
- 17న సభ నిర్వహించడానికి రావాల్సిందిగా ఆహ్వానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాసనసభ ప్రొటెం స్పీకర్(తాత్కాలిక సభాపతి)గా ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌ను నియమిస్తూ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ మంగళవారం అధికారికంగా నోటిఫికేషన్ జారీచేశారు. ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌ను నియమించాలని ప్రభుత్వం గవర్నర్‌కు సిఫారసుచేసిన విషయంతెలిసిందే. శాసనసభ వ్యవహారాల కార్యదర్శి నరసింహాచార్యులు మంగళవారం ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. 17న సభను నిర్వహించడానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ప్రొటెం స్పీకర్ అధ్యక్షతన 17న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయి. ఆ వెంటనే కొత్త ఎమ్మెల్యేతో ప్రొటెంస్పీకర్ ప్రమాణం చేయిస్తారు.

గోదావరి మథనం

మొదటిపేజీ తరువాయి...

నీటిమట్టం (ఎఫ్‌ఆర్‌ఎల్) సుమారు 620 మీటర్లుండగా.. ఉద్దండాపూర్ రిజర్వాయర్ ఎఫ్‌ఆర్‌ఎల్ కూడా దాదాపుగా అంతేమేరలో (సుమారు 618 అడుగులు) ఉన్నందున జలాల తరలింపు సులువు అవుతుందని అన్నట్టు తెలిసింది. ఉద్దండాపూర్‌కు నీళ్లు తరలించే క్రమంలోనే హైదరాబాద్ శివారులో ఉన్న హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లను నింపుకునే అవకాశాలపై పరిశీలన జరుపాలని విశ్రాంత ఇంజినీర్లను సీఎం ఆదేశించారని సమాచారం. ఎగువనుంచి వరద వచ్చే అవకాశాలు లేనందున ఇలా నింపుకోవడం వల్ల మూసీ ప్రక్షాళన కూడా జరుగుతుందని సీఎం పేర్కొన్నారని తెలిసింది.

మూడో టీఎంసీ ఎత్తిపోతకు గ్రీన్‌సిగ్నల్

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా రోజుకు మూడు టీఎంసీలను లిఫ్ట్‌చేసేందుకు సివిల్ పనులు, రెండు టీఎంసీల ఎత్తిపోతకు ఎలక్ట్రో-మెకానికల్ పనులు కొనసాగుతున్నాయి. మూడో టీఎంసీని కూడా ఎత్తిపోసేందుకుగాను కావాల్సిన పంపులు, మోటర్లు, ఇతరత్రా పనులను (ఎలక్ట్రో-మెకానికల్) కూడా మొదలుపెట్టాలని సీఎం కేసీఆర్ నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. తద్వారా ఎస్సారెస్పీ వరదకాల్వ నుంచి ఒక టీఎంసీ నీటిని పునర్జీవ పథకం ద్వారా శ్రీరాంసాగర్‌కు, ఒక టీఎంసీ నీటిని మిడ్ మానేరు నుంచి మల్లన్నసాగర్ వైపు, మరో టీఎంసీని మిడ్ మానేరు నుంచి ఎల్‌ఎండీ దిగువనున్న ఎస్సారెస్పీ ఆయకట్టుకు అందించవచ్చని చెప్పారు. కాళేశ్వరంలోని ప్యాకేజీ-6 (మేడారం పంపుహౌస్)లో ఒక మోటరు వెట్‌రన్ (నీటిని లిఫ్టు చేయటం)కు అనుమతి ఇవ్వాలని ప్రాజెక్టు అధికారులు సీఎంను కోరారు. ప్రస్తుతం ఎల్లంపల్లిలో 17 టీఎంసీల పైచిలుకు నీటి నిల్వ ఉందని, వెట్‌రన్‌కు 0.22 టీఎంసీలు కావాలని చెప్పగా.. హైదరాబాద్ తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రక్రియ చేపట్టేందుకు సీఎం అనుమతి ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా హల్దీ వాగులోకి గోదావరిజలాలను పోసి.. ఆపై నిజాంసాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

మల్లన్నసాగర్ భూసేకరణ కూడా పూర్తయిందని, ఇక పనులు జోరుగా ముందుకు సాగుతాయని సీఎం ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

2021 జూన్ నాటికి ఎస్సెల్బీసీ..

నల్లగొండ జిల్లాకు కృష్ణాజలాలను అందించే శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ పథకం (ఎస్సెల్బీసీ) పనుల పురోగతిపైనా సీఎం సమీక్షించారు. ఇటీవల ఆ పనుల్ని పరిశీలించి వచ్చిన విశ్రాంత ఇంజినీర్లు తాజా పరిస్థితిని సీఎంకు వివరించారు. ప్రధాన సొరంగమార్గం 43.7 కిలోమీటర్లకుగాను సుమారు 34 కిలోమీటర్లకు పూర్తయిందని, ఎగ్జిట్ టన్నెల్ వైపు పనులు ప్రస్తుతం నిలిచిపోయాయని చెప్పారు. ఎగ్జిట్ టన్నెల్ వైపు ప్రతి నిమిషానికి 9600 లీటర్ల సీపేజ్ వస్తున్నదని, కానీ సుమారు ఆరు వేల లీటర్ల మేర మాత్రమే బయటికి పంపించే సామర్థ్యం అక్కడ ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో సామర్థ్యం పెంపునకు రూ.20 కోట్లు, ఇప్పటి వరకు పెండింగులో ఉన్న బిల్లులు రూ.25 కోట్లు, బ్యాంకు పూచీకత్తు కాకుండా మరో రూ.60 కోట్ల అడ్వాన్సు ఇస్తే పనుల వేగవంతానికి సంబంధిత ఏజెన్సీ సుముఖంగా ఉందనే విషయాన్ని విశ్రాంత ఇంజినీర్లు ముఖ్యమంత్రికి దృష్టికి తెచ్చారు. దీంతో ఈ అంశాన్ని పరిశీలిద్దామని సీఎం కేసీఆర్ అన్నట్టు సమాచారం.

డిండికి ఏదుల నీరు

డిండి ఎత్తిపోతల పథకానికి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న ఏదుల రిజర్వాయర్ నుంచే నీటిని సేకరించాలని సీఎం కేసీఆర్ స్పష్టంచేశారు. తద్వారా లిఫ్టు అవసరం ఉండదని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ప్రత్యేకంగా కేంద్రప్రభుత్వ సంస్థ అయిన ఎన్‌ఐఆర్‌ఎం (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్) బృందాన్ని కన్సల్టెన్సీగా నియమించుకోవాలని, ఈ మేరకు వెంటనే లేఖ రాయాలని సంబంధిత అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీచేశారు. గతంలోని ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ ప్రాజెక్టుల్లో కొనుగోలు చేసి, వినియోగించకుండా ఉన్న పంపులు, మోటర్లను ఇప్పటికే భక్త రామదాసు, తుమ్మిళ్లలో వినియోగించామని, ఇంకా మిగిలిన ఉన్న వాటిని ఇప్పటికే గట్టు ఎత్తిపోతలకు వినియోగించాలని నిర్ణయించినందున.. రాచకొండ లిఫ్టు స్కీం వంటివాటికి కూడా మిగిలిన వాటిని వినియోగిద్దామని సీఎం సమీక్షలో పేర్కొన్నారు.

బిల్లులు క్లియరెన్స్‌కు ఆదేశం

ప్రస్తుతం నీటిపారుదల శాఖలో పెండింగు బిల్లులపై ఆరా తీసిన సీఎం.. సుమారు రూ.6వేల కోట్ల పైచిలుకు ఉన్న వాటిని వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. రైతులకు సత్వర ప్రయోజనం అనే ప్రాతిపదికన ప్రాధాన్యక్రమాన్ని నిర్ధారించుకొని బిల్లులను క్లియర్‌చేయాలని చెప్పారు. ఈ ఏడాది, వచ్చే ఏడాది రూ.25వేల కోట్లు చొప్పున సాగునీటిరంగానికి వెచ్చిస్తే.. ఆపై వాటి ఫలాలను రాష్ట్ర రైతాంగం, ప్రజలు పొందాలని, ఎక్కడచూసినా జలకళ కనిపించాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. ఇదిలాఉంటే.. కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్ ఎన్ వెంకటేశ్వర్లు త్వరలో పదవీవిరమణ చేయాల్సి ఉంది. అయితే.. ఈ ప్రాజెక్టు పూర్తయ్యే వరకు బాధ్యతల్లో కొనసాగాలని సీఎం చెప్పారని తెలిసింది.

పోలవరం బ్యాక్‌వాటర్స్‌పై అధ్యయనం

పలు అంతర్రాష్ట్ర అంశాలపైనా చర్చించిన సీఎం కేసీఆర్.. పోలవరం ప్రాజెక్టులో గరిష్ఠ వరద నీటి ప్రవాహాన్ని 50వేల క్యూసెక్కులుగా పరిగణలోకి తీసుకుంటున్నందున.. బ్యాక్‌వాటర్స్‌పై అధ్యయనం చేయించాలని అధికారులను ఆదేశించారు. తుంగభద్ర డ్యాంలో పూడిక పెరిగిపోయిన దరిమిలా కర్ణాటక 40 టీఎంసీల రిజర్వాయర్ నిర్మాణానికి నిర్ణయించిందని, అయితే దీనిని గుడ్డిగా వ్యతిరేకించడం సమంజసంకాదని సీఎం అభిప్రాయపడినట్టు సమాచారం. దానివల్ల తెలంగాణకు ఏమేరకు ప్రయోజనం కలుగుతుందనే దానిని పరిశీలించాలని సూచించారని తెలిసింది. ఎలాగూ తెలంగాణ రాష్ట్రం టీబీ బోర్డులో ఉన్నందున.. రిజర్వాయర్ నిర్మాణానికిగాను మన వాటాగా ఎంత వ్యయం అవుతుందో చూడాలని, ఆ మేరకు చెల్లించి, తద్వారా ప్రయోజనం పొందుదామని సీఎం పేర్కొన్నట్టు సమాచారం.

రూ.15వేల కోట్లు వెచ్చిస్తే ఎంత ఫలితమొచ్చింది?

దేవాదుల ఎత్తిపోతల పథకంపైనా సీఎం కేసీఆర్ సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా రూ.15వేల కోట్లు వెచ్చిస్తే ఆ ప్రాజెక్టు ద్వారా రైతులు పొందిన ప్రయోజనమెంత? ఎంతనీటిని నిల్వచేయగలుగుతున్నాం? అని ప్రశ్నించినట్టు తెలిసింది. దేవాదుల మూడోదశను పూర్తిచేస్తే తప్ప పూర్తి ప్రయోజనం చేకూరదన్న సీఎం.. మొదటి, రెండోదశల్లోని చిన్నచిన్న పనులు ఎన్నిచేసినా ఫలితం ఉండదని అభిప్రాయపడినట్టు తెలిసింది. అందుకే మూడోదశ పూర్తికి సత్వర చర్యలతోపాటు దేవాదులద్వారా గోదావరిజలాల ఎక్కువ వినియోగానికి, వరంగల్, నల్లగొండ జిల్లాకు అధిక ప్రయోజనాలు చేకూర్చేందుకు ఏం చేయాలనే దానిపై సమగ్రంగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఎస్సారెస్పీ రెండోదశలో భాగంగా తుంగతుర్తి పరిధిలోని రుద్రమ చెరువును మూడు టీఎంసీల సామర్థ్యంతో బలోపేతం చేయాలని కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. అయితే గోదావరి నది నుంచి దేవాదుల ద్వారా ఎక్కువ నీటిని ఎత్తిపోసేందుకుగాను ఇన్‌టేక్ పాయింట్ వద్ద అదనపు పంపులకు సీఎం కేసీఆర్ సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది.

బీడీఎల్‌కు మిసైల్స్, లాంచర్ల తయారీ కాంట్రాక్టు

- రూ.760 కోట్ల విలువైన మిసైల్స్‌ను సైన్యానికి సరఫరా చేయనున్న సంస్థ
- సాంకేతిక సహకారాన్ని అందించనున్న రష్యా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారత సైన్యానికి యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్స్, లాంచర్లు సరఫరా చేసే రూ.760 కోట్ల విలువైన భారీ కాంట్రాక్టు పటాన్‌చెరు సమీపంలోని బానూరులో గల భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)కు దక్కింది. మంగళవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో బీడీఎల్ డైరెక్టర్ (ప్రొడక్షన్) వీ గురుదత్త ప్రసాద్ కాంట్రాక్టుపై సంతకంచేశారు. బీడీఎల్ బానూరు యూనిట్‌లో మిసైల్స్, లాంచర్ల తయారీకి అవసరమైన సాంకేతిక సహకారాన్ని రష్యా అందించనున్నది.

ప్రైవేటు ఇంజినీరింగ్ ఫీజుల సమీక్షకు గత రెండేండ్ల ఆడిట్ నివేదికల స్వీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో 2019-20 నుంచి వచ్చే మూడేండ్లకు సంబంధించి ప్రైవేటు ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా కాలేజీల్లో ఫీజుల సమీక్ష కోసం రెండేండ్ల కిందటి ఆడిట్ లెక్కలు స్వీకరించాలని నిర్ణయం తీసుకున్నామని ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. వాస్తవానికి గత మూడేండ్ల నుంచి ఆడిట్ నివేదికలను కోరాల్సి ఉన్నదని, 2018-19 విద్యా సంవత్సరం లెక్కలు అసంపూర్తిగా ఉన్నందున రెండేండ్ల లెక్కలనే పరిగణనలోకి తీసుకుంటున్నామని చెప్పారు. ఇంజినీరింగ్ ఫీజుల సమీక్షకు సంబంధించి నోటిఫికేషన్‌ను విడుదల చేయడానికి ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు.

మన రిజర్వేషన్లు అడగండి

మొదటిపేజీ తరువాయి...

అసెంబ్లీ తీర్మానాన్ని బిల్లులో చేర్చాలని కేంద్రాన్ని ఎంపీ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్ బిల్లుపై లోక్‌సభలో చర్చ సందర్భంగా ఎంపీ వినోద్ మంగళవారం ఢిల్లీలో పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో సవరణలకు పట్టుబడుతామని తెలిపారు. రిజర్వేషన్లు పెంచేందుకు రాజ్యాంగ సవరణ అవసరమంటూ ఇన్నాళ్లు కేంద్రం నాన్చుతూ వచ్చిందని, ఇప్పుడు ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ కోసం ముందుకొచ్చినందున తెలంగాణ తీర్మానాలను బిల్లులో చేర్చాలని డిమాండ్ చేశారు. నెలరోజుల నుంచి పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నా, ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్ కేటాయించే అతి ముఖ్యమైన బిల్లును చివరిరోజుల్లో పార్లమెంట్‌లో పెట్టి బీజేపీ గందరగోళ పరిస్థితి తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమైన ఈ బిల్లుపై మాట్లాడేందుకు తక్కువ సమయం ఉన్నదని, బిల్లుపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసేందుకు పార్టీలకు, ఎంపీలకు సమయం లేకుండా పోయిందన్నారు. ఉత్తరాదిన ఓసీలు ఎక్కువని, ఛత్తీస్‌గఢ్‌లో ఎస్టీలు, దక్షిణాది రాష్ట్రాల్లో వెనుకబడిన వర్గాలు, మైనార్టీలు ఎక్కువ ఉంటారని.. ఇలా ఒక్కో రాష్ట్రానికి ఒక్కో సామాజిక పొందిక ఉంటుందని వివరించారు. ఈ అంశాలన్నింటినీ కేంద్రం విస్మరించిందని విమర్శించారు. ముస్లింలకు 12 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని చేసిన తెలంగాణ అసెంబ్లీ తీర్మానంపై కేంద్రప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. ఇంద్రసహానీ కేసును చూపుతూ మైనార్టీ, ఎస్టీల రిజర్వేషన్ల పెంపును మోదీ ప్రభుత్వం నాలుగున్నరేండ్లుగా అడ్డుకుంటున్నదని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన రిజర్వేషన్లను కేంద్రం ఇప్పటికైనా పరిగణనలోకి తీసుకోవాలని, శాసనసభ చేసిన చట్టాన్ని కేంద్రం ఆమోదించాలని డిమాండ్ చేశారు. సామాజిక పొందిక ఆధారంగా రిజర్వేషన్లను కల్పించుకొనే అవకాశం రాష్ట్రాలకే ఇవ్వాలని ఎంపీ వినోద్‌కుమార్ కోరారు.

మా కోటాను అనుమతించండి

- ఎస్టీలకు 10%, ముస్లింలకు 12% ఇవ్వండి
- రిజర్వేషన్లను రాష్ట్రాలే అమలుచేసుకోవాలి
- ఈబీసీ రిజర్వేషన్లకు టీఆర్‌ఎస్ మద్దతు
- ఆలస్యమైనా అగ్రవర్ణ పేదలకు న్యాయం
- లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్షనేత జితేందర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఎస్టీలకు 10%, ముస్లింలకు 12% రిజర్వేషన్లు ఇవ్వాలంటూ తెలంగాణ అసెంబ్లీ 2017లో పంపిన తీర్మానాన్ని ఎందుకు అనుమతించడం లేదని టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత ఏపీ జితేందర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఆయా రాష్ట్రాల్లో ఉన్న సామాజికవర్గాల ఆధారంగా రాష్ట్రాలే రిజర్వేషన్లు అమలుచేసుకునేలా కేంద్రం అనుమతించాలని డిమాండ్‌చేశారు. సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని దృఢతరం చేసేందుకు తమ నాయకుడు కేసీఆర్ ఎప్పుడూ ముందుంటారన్న జితేందర్‌రెడ్డి.. అందులో భాగంగానే అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు టీఆర్‌ఎస్ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నదని చెప్పారు. ఇదే సమయంలో తమ రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని ఆమోదించాలని కోరారు. మంగళవారం లోక్‌సభలో ఈబీసీ బిల్లుపై జరిగిన చర్చలో మాట్లాడిన జితేందర్‌రెడ్డి.. నిజానికి రిజర్వేషన్లనేవి అభివృద్ధికి దూరంగా ఉంటూ వచ్చిన కొన్ని కులాలను అన్నిరంగాల్లోనూ ముందుకు తీసుకొచ్చేందుకు ఉద్దేశించినవని చెప్పారు. అయితే ప్రస్తుత 'ఆర్థికంగా వెనుకబడిన పేదలు' అనేది వెనుకబడినవారిలో మరో కోణమన్నారు. ఈ రెండింటినీ కలిపి చూడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆలస్యమైనా అగ్రవర్ణ పేదలకు న్యాయం జరుగాలని ఆకాంక్షించారు. ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన అగ్రవర్ణ పేదలకు ఈ బిల్లుతో ఎంతో ప్రయోజనం ఉన్నప్పటికీ.. 10 శాతం రిజర్వేషన్లతో సమస్య పరిష్కారం కాదన్నారు. రాష్ట్రాలను బట్టి పరిస్థితులు మారుతుంటాయని ఉదహరించారు. ఒక దేశంలో ఒకే తరహా చట్టాలుండాలని సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వంలో తాము అనేకసార్లు పార్లమెంట్‌లో గళమెత్తామని గుర్తుచేశారు. తమిళనాడులో 69% రిజర్వేషన్లకు రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో అవకాశం కల్పించారన్న జితేందర్‌రెడ్డి.. తెలంగాణ అసెంబ్లీ తీర్మానం విషయంలో మాత్రం కేంద్రం నుంచి ఎలాంటి చలనం లేదంటూ నిరసన తెలిపారు.

సాధారణ ప్రజలను పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీ

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పరిపాలించిన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజలకు అవసరమైన మౌలిక వసతి సదుపాయాల కల్పన, వ్యవసాయం, విద్యుత్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని జితేందర్‌రెడ్డి విమర్శించారు. ఈ రెండు పార్టీలు సాధారణ ప్రజలను పట్టించుకోలేదన్నారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల విధానాన్ని తీసుకువచ్చినా.. వారంతా ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురయ్యారని చెప్పారు. ఆ తరువాతే ఆర్థికంగా వెనుకబాటు అనేది దేశంలోకి ప్రవేశించిందన్నారు. ప్రస్తుత రిజర్వేషన్ల బిల్లుపైకూడా తమకు నమ్మకం లేదని, చట్టసభలు ఒప్పుకున్నా, సుప్రీంకోర్టు పక్కనపెట్టవచ్చని వ్యాఖ్యానించారు. 1992లో ఇందిరాసహానీ కేసులో రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండవద్దని సుప్రీంకోర్టు స్పష్టంచేసిన విషయాన్ని ప్రస్తావించారు. బిల్లును మరింత పకడ్బందీగా తయారుచేయడానికి సవరణలు చేయాలని జితేందర్‌రెడ్డి సూచించారు.

తెలంగాణ ఏర్పాటుతో పెరిగిన ముస్లిం, ఎస్టీ జనాభా

ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయిన తరువాత తెలంగాణలో జనాభాపరంగా కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయని జితేందర్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి ఏపీలో 8% ముస్లిం జనాభా ఉంటే.. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో 12 శాతానికి, 6 శాతం ఉన్న ఎస్టీ జనాభా 10 శాతానికి చేరుకున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలోనే వారి సామాజిక, ఆర్థిక వెనుకబాటు ఆధారంగా ముస్లింలకు 12%, ఎస్టీలకు 10% చొప్పున ఉద్యోగాలు, విద్యారంగంలో రిజర్వేషన్లు అమలుచేయాలని 2017లో రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విన్నవించిన సంగతిని ఆయన గుర్తుచేశారు.

వైద్యారోగ్యశాఖలో డ్యాష్‌బోర్డు!

- 15 రకాల ప్రజారోగ్య కార్యక్రమాలు అనుసంధానం
- వైద్యసేవల అమలును నిశితంగా పరిశీలించే అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రజలకు మెరుగైన వైద్యసేలు అందించేందుకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అత్యాధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నది. ఆరోగ్య తెలంగాణ నిర్మాణంలో భాగంగా పౌరుల హెల్త్‌ప్రొఫైల్ తయారుచేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే కంటివెలుగు శిబిరాలు కొనసాగుతుండగా.. త్వరలో చెవి, ముక్కు, గొంతు, దంత పరీక్షలు కూడా నిర్వహించనున్నారు. ఇలా దశలవారీగా ప్రజల ఆరోగ్య సమాచారాన్ని సేకరించి హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తారు. ఈ సమాచారాన్ని కంప్యూటర్‌లో నిక్షిప్తంచేసి, మానిటరింగ్‌చేయాలని, ప్రజలకు అవసరమైన వైద్యసహాయం వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ గతంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇందులో భాంగా రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అన్ని రకాల వైద్య పథకాలు, సేవలను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయడానికి వీలుగా డ్యాష్ బోర్డును ఏర్పాటు చేస్తున్నది. ప్రజలకు వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయో తెలుసుకొని మానిటరింగ్ చేయడానికి వీలుగా 'ఇంటిగ్రేటెడ్ పోర్టల్'ను తయారుచేస్తున్నారు. ప్రజల వైద్య సేవలకు సంబంధించిన 15 రకాల కార్యక్రమాలను దీనికి అనుసంధానం చేయనున్నారు. త్వరలో దీనిని అమలులోకి తీసుకురానున్నారు. ఈ పోర్టల్ ద్వారా కంటి వెలుగు, కేసీఆర్ కిట్స్, అంబులెన్స్ సర్వీసెస్, డ్రగ్ కంట్రోల్, ఐపీఎం, వెల్‌నెస్ సెంటర్లు, ఎయిడ్స్ కంట్రోల్, వైద్య విద్య తదితర కార్యక్రమాలన్నింటినీ మానిటరింగ్ చేయనున్నారు. అంబులెన్స్ ఎక్కడి నుంచి ఎటు వెళ్తోందో కూడా ఈ డ్యాష్‌బోర్డు ద్వారా పరిశీలించవచ్చు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో ఏ రకమైన వ్యాధులు విజృంభిస్తున్నాయో తెలుసుకొని, తగిన చర్యలు తీసుకుంటారు. ఒక పేషెంట్‌కు రక్తం అవసరమైతే ఆ గ్రూప్ రక్తం సమీపంలో ఎక్కడ అందుబాటులో ఉందో తెలుసుకొని సరఫరా చేస్తారు. ఇలా వైద్యానికి సంబంధించిన అన్ని అంశాలను డ్యాష్‌బోర్డు ద్వారా పర్యవేక్షించవచ్చని అధికారులు చెప్తున్నారు. తెలంగాణ హెల్త్ ప్రొఫైల్ రూపొందించడంలో కీలకంగా మారుతుందన్నారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.52 గంటలకు

సూర్యాస్తమయం: 5.54 గంటలకు

విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం తదియ మధ్యాహ్నం 2.41 వరకు, తదుపరి చతుర్థి, నక్షత్రం: దనిష్ఠ, అమృతఘుడియలు: మధ్యాహ్నం 3.05 నుంచి సాయంత్రం 4.41 వరకు, రాహుకాలం మధ్యాహ్నం 12.23 నుంచి 1.46 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.01 నుంచి 12.45 వరకు, వర్జ్యం: లేదు.

లోకం పోకడ



పండుగకు మగాళ్లకు మందు బాటిల్ సరే.. మాకు వాకిలి నిండా ముగ్గులు వేసి పెట్టాలి మరి!

సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్‌గా మారెడ్డి

- నియామక ఉత్తర్వులపై సీఎం సంతకం
- సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన శ్రీనివాస్‌రెడ్డి



రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం ప్రగతిభవన్‌లో పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, కోనేరు కోనప్ప, దివాకర్‌రావు, టీఎస్‌ఐఐసీ చైర్మన్ బాలమల్లు తదితరులు

హైదరాబాద్/సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్‌గా సిద్దిపేట మండలం ఇర్కోడు గ్రామానికి చెందిన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులపై సీఎం కేసీఆర్ మంగళవారం సంతకం చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమంనుంచి సీఎం కేసీఆర్‌తో ఉన్న మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి సముచిత స్థానం కల్పించడంపై ఉద్యమకారులు హర్షం వ్యక్తంచేశారు. కేసీఆర్ అంతరంగికులలో ఒకరిగా ఉన్న శ్రీనివాస్‌రెడ్డి ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఇర్కోడు సర్పంచ్‌గా 1987 రాజకీయ జీవితం ప్రారంభించిన ఆయన.. కేసీఆర్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే 1994 నుంచి సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వరుసగా మూడుసార్లు పనిచేశారు. కేసీఆర్ టీఆర్‌ఎస్ పార్టీని స్థాపించిన తర్వాత 2001లో జరిగిన ఉపఎన్నికలో శ్రీనివాస్‌రెడ్డి టీడీపీ తరపున సిద్దిపేట అసెంబ్లీ స్థానంనుంచి పోటీచేసి కేసీఆర్ చేతిలో ఓడిపోయారు. ప్రత్యేక రాష్ట్ర సాధ న కోసం శ్రీనివాస్‌రెడ్డి టీడీపీకి రాజీనామా చేసి ఉద్యమ పార్టీ టీఆర్‌ఎస్‌లో చేరారు. నాటి నుంచి ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కేసీఆర్ వెన్నంటే ఉండి అంచలంచెలుగా ఎదిగారు. నాటినుంచి దాదాపు పార్టీకి సంబంధించిన ప్రతి బహిరంగసభ ఏర్పాట్లలో శ్రీనివాస్‌రెడ్డి పాత్ర ఉన్నది. టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగానూ పనిచేశారు. సీఎం కేసీఆర్ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి పార్టీ అభివృద్ధికి కృషిచేశారు. ఆయన సేవలను గుర్తించిన సీఎం కేసీఆర్ రాష్ట్ర సివిల్‌సప్లై కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. శ్రీనివాస్‌రెడ్డి నియామకంపై మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, కోనేరు కోనప్ప, దివాకర్‌రావు, టీఎస్‌ఐఐసీ చైర్మన్ బాలమల్లుతోపాటు టీఆర్‌ఎస్ నాయకులు కల్వకుంట్ల వంశీధర్‌రావు హర్షం వ్యక్తంచేశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పెద్ద బాధ్యత అప్పగించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మరోమారు చిరుత పంజా

- వారంలో నాలుగోసారి గొర్రెల మందపై దాడి
- రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కొత్తపల్లిలో భయం

ఇబ్రహీంపట్నం, నమస్తేతెలంగాణ : చిరుత పులి సంచారంతో రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కొత్తపల్లి గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. వారం రోజులుగా చిరుత గొర్రెలు, మేకల మందలపై వరుసగా దాడులు జరుపుతుండటంలో భయం భయంగా గడుపుతున్నారు. ఇప్పటికే మూడు మేకలు, ఒక అడవి పందిని చంపిన చిరుత సోమవారం అర్ధరాత్రి కొత్తపల్లి గ్రామశివారులో భిక్షపతికి చెందిన మేకను ఎత్తుకెళ్లి చంపింది. భిక్షపతి రోజులాగే సోమవారం రాత్రి తన వ్యవసాయబావివద్ద గొర్రెలు, మేకల మందను కట్టేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి తిరిగివచ్చిన ఆయనకు మందలో ఒక మేక కన్పించలేదు. దీంతో చుట్టుపక్కల పరిశీలించగా మేక చనిపోయి కన్పించింది. దానిని చిరుత తిన్న ఆనవాళ్లు ఉన్నాయి. దీంతో భయపడిన భిక్షపతి గ్రామానికి వచ్చి ఈ విషయాన్ని స్థానికులకు తెలిపారు. అయితే, చిరుతను పట్టుకునేందుకు అధికారులు ప్రత్యేక బోన్లను ఏర్పాటు చేసినప్పటికీ చిక్కకుండా తప్పించుకుంటుండడంతో ఎప్పుడు, ఎక్కడ, ఎటువైపు నుంచి దాడి చేస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. అయితే, వీలైనంత త్వరలో దానిని బంధిస్తామని, అందుకోసం ప్రత్యేక టీంలను ఏర్పాటుచేశామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

ఢిల్లీలో టీఆర్ఎస్ భవనానికి రూ.5 లక్షలు సాయం

- ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలిసి కేటీఆర్‌కు చెక్కు అందజేసిన వాశిలి

చందానగర్, నమస్తే తెలంగాణ: ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర సమితి కార్యాలయ నిర్మాణానికి శేరిలింగంపల్లికి చెందిన సీనియర్ నాయకుడు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేశాడు. టీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు వాశిలి చంద్రశేఖర్‌ప్రసాద్ స్థానిక శాసనసభ్యుడు అరికెపూడి గాంధీతోపాటు ప్రగతిభవన్‌లో మంగళవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఢిల్లీలో టీఆర్ఎస్ పార్టీకి కేటాయించిన స్థలంలో భవననిర్మాణానికి తనవంతుగా రూ.5 లక్షల చెక్కును గాంధీ చేతులమీదుగా వాశిలి కేటీఆర్‌కు అందజేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిన కేటీఆర్‌కు తమ పూర్తి సహకారం ఉంటుందని ఆయన అన్నారు. వాశిలి చంద్రశేఖర్‌ప్రసాద్ స్పందనను కేటీఆర్, ఎమ్మెల్యే గాంధీలు అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హమీద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



మంగళ వారం టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రూ. 5 లక్షల చెక్కును అందజేస్తున్న రంగారెడ్డి జిల్లా టీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు వాశిలి చంద్రశేఖర్‌ప్రసాద్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

సీఎం కేసీఆర్‌కు మన్మోహన్ అభినందన

- మాజీ ప్రధానిని కలిసిన ఎంపీ సంతోష్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను ఎంపీ జోగినిపల్లి సంతోష్.. మంగళవారం పార్లమెంటులో కలిశారు. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అఖండ విజయం సాధించడాన్ని మన్మోహన్ అభినందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలంగాణను అభివృద్ధిపరచేందుకు నిరంతరం కృషిచేస్తున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్‌కు తన తరపున అభినందనలు తెలియజేయాలని ఎంపీ సంతోష్‌తో మన్మోహన్ పేర్కొన్నారు.



మంగళ వారం ఢిల్లీలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్

'సహకార' ఎన్నికలు వాయిదా

- పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: సహకార సంఘాల ఎన్నికలను వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ పంచాయతీల ఎన్నికల నేపథ్యంలో సహకార ఎన్నికలను నిర్వహించరాదని సహకారశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి మంగళవారం ఆదేశాలు జారీచేశారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది, ప్రజలంతా ఆ ఎన్నికల్లో తలమునకలై ఉన్న పరిస్థితుల్లో సహకార ఎన్నికలు నిర్వహించవద్దని సహకారశాఖ కమిషనర్, రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. పంచాయతీ ఎన్నికలతోపాటు లోక్‌సభకు ఫిబ్రవరిలోనే ముందస్తు ఎన్నికలు వచ్చే సూచనలు ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. పంచాయతీ ఎన్నికలు ముగియగానే ఫిబ్రవరిలో సహకార ఎన్నికలు నిర్వహించవచ్చనే ఉద్దేశంతో సహకారశాఖ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. వాస్తవానికి పాలకవర్గాల పదవీకాలం గత ఏడాది ఫిబ్రవరి 7నే ముగిసింది. అవే పాలకవర్గాలను పర్సన్ ఇంచార్జిలుగా ఆరు నెలల చొప్పున నియమిస్తూ.. గతంలో రెండుసార్లు గడువు పొడిగించారు. ఆ ఉత్తర్వుల గడువు వచ్చేనెల 7తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాకే సహకార ఎన్నికల నిర్వహణపై తుది నిర్ణయం తీసుకోనున్నట్టు అధికారవర్గాలు వెల్లడించాయి. ఎన్నికలు వాయిదా పడిన నేపథ్యంలో పీఏసీఎస్‌లకు పర్సన్ ఇంచార్జిల నేతృత్వంలోని పాలకవర్గాలకు మరో ఆరు నెలలు పొడిగింపు ఇచ్చే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి

పత్తి కొనుగోళ్లు వేగవంతం

- కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోళ్లు చేయాలి
- బిల్లుల చెల్లింపుల్లో జాప్యాన్ని సమీక్షించాలి
- 72 గంటల్లో చెల్లించేలా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాలి
- ఫిబ్రవరి నుంచి మార్కెట్ కమిటీల్లో ఈ-రశీదు విధానం
- వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: మార్కెట్ యార్డుల్లో పత్తి ధరలు తగ్గుతున్న నేపథ్యంలో రైతులకు మద్దతు ధర చెల్లించి జిల్లాల కలెక్టర్ల ద్వారా ప్రకటించిన 202 జిన్నింగ్ మిల్లులతోపాటు, 27 మార్కెట్‌యార్డుల్లో కొనుగోళ్లు జరుపాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి సీసీఐ అధికారులను ఆదేశించారు. మంగళవారం పత్తి, కందుల కొనుగోళ్లపై మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, సీసీఐ బ్రాంచ్ మేనేజర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ మార్కెటింగ్‌శాఖలో అమలవుతున్న ఈ-సర్వీసెస్‌ను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెటింగ్‌శాఖ కార్యదర్శులు పత్తి కొనుగోళ్లపై ప్రతిరోజూ సమీక్షించుకొని రైతులకు బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కోరారు. ఏ కొనుగోలు కేంద్రంలోనైనా 72 గంటల్లో చెల్లింపులు జరిగేలా మార్కెటింగ్‌శాఖ తయారుచేసిన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకోవాలని ఆదేశించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లోనూ ఈ సాఫ్ట్‌వేర్ ద్వారానే కొనుగోళ్లు జరుగాలని, మార్కెటింగ్, సీసీఐ అధికారులు డిజిటల్ సంతకం చేయడానికి మాత్రమే పరిమితమని గుర్తించాలన్నారు. కొనుగోలు వివరాలను సీసీఐకి ఆన్‌లైన్ ద్వారానే పంపి, రైతులకు చెల్లింపులు చేపట్టాలని తెలిపారు. 2017-18లో ఏర్పాటుచేసిన విధంగానే రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపాదించిన 127 కొనుగోలు కేంద్రాలను జనవరి 9 నుంచి ప్రారంభించాలని సూచించారు. కందుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ప్రారంభతేదీ, నియమనిబంధనలపై పత్రికా ప్రకటనలు జారీచేయాలని ఆదేశించారు. గిడ్డంగులు, శీతలగిడ్డంగులు, ప్రాసెసింగ్ యూనిట్లు, ప్రత్యక్ష కొనుగోలు కేంద్రాలకు ఆన్‌లైన్ లైసెన్స్‌లను మార్చి 31 నుంచి జారీచేయాలని చెప్పారు. మార్కెటింగ్ కమిటీల ఆదాయం కోసం జారీచేసే ఈ -రశీదు విధానాన్ని 24 మార్కెట్ కమిటీల కార్యదర్శులు జనవరి 7 వరకు అమలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, 22 కమిటీలు ఆ లక్ష్యాన్ని సాధించినట్టు తెలిపారు. మిగిలిన మార్కెట్ కమిటీలలో దశలవారీగా ఫిబ్రవరి నాటికి ఈ రశీదు విధానాన్ని అమలుచేయాలని చెప్పారు. 2018-19లో సీసీఐ ద్వారా మార్కెటింగ్‌శాఖ రూ.731 కోట్ల విలువైన 1,34,805 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలుచేసినట్టు మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ జీ లక్ష్మిబాయి తెలిపారు. వీటికి సంబంధించి ఇప్పటివరకు రూ.567కోట్లు రైతులకు చెల్లించినట్టు తెలిపారు. 2018-19 సంవత్సరానికి 146 కందుల కొనుగోలుకేంద్రాలకుగాను ఇప్పటివరకు 19 కేంద్రాల ద్వారా 17,017 మెట్రిక్ టన్నులు కొన్నట్టు మార్క్‌ఫెడ్ ఎండీ వీ భాస్కరాచారి తెలిపారు.

ఎర్ర బంగారం అధరహో

- క్వింటాల్ ధర గరిష్ఠంగా రూ.10వేలకు పైనే
- రాష్ట్రంలోని మార్కెట్లకు రోజూ తొమ్మిది వేల బస్తాలు రాక
- గుంటూరు మార్కెట్ కన్నా రూ.3వేల వరకు అధికం
- ఏపీ నుంచీ భారీగా తరలివస్తున్న పంట

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని మార్కెట్ యార్డులకు మిర్చి పోటెత్తుతున్నది. తెలంగాణతోపాటు ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన రైతులు సైతం తమ దిగుబడులను రాష్ట్రంలోని మార్కెట్లకు తరలిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని గంజ్‌లకు ఇతర రాష్ట్రాల నుంచి అత్యధికంగా మిర్చి పంటను తీసుకొస్తున్నారు. ఉమ్మడి ఏపీలో రైతులు తమ పంటను అమ్ముకునేందుకు నానా యాతన పడాల్సి వచ్చేది. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం, మార్కెట్‌కు తరలించినా తగిన ధర దక్కకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. అమ్ముకునేందుకు రోజుల తరబడి పడిగాపులు కాసేవారు. దళారీలదే రాజ్యం కావడంతో కనీసం పెట్టుబడి కూడా దక్కేది కాదు. తెలంగాణ ప్రభుత్వం మార్కెటింగ్ విధానంలో తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా రైతులు ఆర్థికంగా బలపడుతున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచీ..

తమ ఉత్పత్తులకు తెలంగాణలో అయితేనే న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో ఇతర రాష్ట్రాల రైతులు సైతం వరుస కడుతున్నారు. అక్కడి ధరతో పోల్చుకుంటే రవాణా చార్జీలు పోనూ క్వింటాల్‌కు రూ.వేలల్లోనే మిగులుతుండటంతో హర్షం వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలోని నల్లగొండ, నాగార్జునసాగర్, దామరచర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, అయిజ ప్రాంతాలతోపాటు ఏపీలోని మాచర్ల, గుంటూరు, దాచేపల్లి, నందిగామ, కర్నూలు ప్రాంతాల నుంచి మలక్‌పేట్ మార్కెట్‌కు నిత్యం వేల సంఖ్యలో మిర్చి బస్తాలు వస్తున్నాయి. ఏపీలోని గుంటూరు మార్కెట్ యార్డు మిర్చి అమ్మకాలకు పెట్టింది పేరు. కానీ అక్కడ రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో ఇక్కడికి తరలివస్తున్నారు.

రైతుల కండ్లల్లో ఆనందం

ప్రస్తుతం మలక్‌పేట్ మార్కెట్‌లో మిర్చి క్వింటాల్‌కు సగటున రూ.9,500 పలుకుతోంది. కనిష్ఠంగా రూ.4,500-5,000 గరిష్ఠంగా రూ.9,500-10,500 వరకు గిట్టుబాటు అవుతోంది. ఏపీలోని గుంటూరు మార్కెట్‌లో సగటు క్వింటాల్ ధర రూ.7 వేలు మాత్రమే. గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ.8వేలకు మించడం లేదు. మలక్‌పేటలో క్వింటాల్‌కు రూ.2500-3,000 అదనంగా వస్తున్నది. ఇతర రాష్ట్రాలకు చెందిన పెద్ద రైతులు సొంతగా పంటను తరలిస్తుండగా, చిన్న, సన్నకారు రైతులు ఐదారుగు కలిసి ఒకే వాహనంలో మిర్చి పంటను తీసుకొస్తున్నారు. రైతులకు రవాణా చార్జీ కింద బస్తాకు గరిష్ఠంగా రూ.వంద ఖర్చు అవుతోంది. ఒక్కో బస్తాలో 30-40 కిలోల మిర్చీ పడుతుంది. అంటే క్వింటాల్‌కు రూ.300-400 వ్యయం చేస్తున్నారు. దీంతో ఒక్కోరైతుకు ఏపీతో పోల్చితే రవాణా చార్జీలు పోను దాదాపు క్వింటాల్‌కు రూ.2,000-2,500 మిగులుతున్నది. ఒక్కో రైతు సగటున 10 క్వింటాళ్ల మిర్చి అమ్ముతున్నట్టు మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. దీనినిబట్టి రైతులు దాదాపు రూ.25 వేల వరకు లాభం కండ్లజూస్తున్నారు.



మంగళ వారం హైదరాబాద్‌లోని మలక్‌పేట్ మార్కెట్‌యార్డుకు తరలివచ్చిన మిర్చి పంట

గతేడాది కంటే 500 ఎక్కువ



నేను మార్కెట్‌కు 15 క్వింటాళ్ల మిర్చి తీసుకొచ్చిన. పోయినేడాది క్వింటాల్‌కు రూ.7వేలు వచ్చింది. ఇప్పుడు రూ.7,500 పలికింది. క్వింటాల్‌కు రూ.500 ఎక్కువొచ్చింది. తెలంగాణ ప్రభుత్వం రాకముందు మార్కెట్ సౌలత్ లేక పంటను ఊర్లనే సేటుకు అగ్గువకు అమ్ముకునేటోడిని. ఇప్పుడు మంచి గిట్టుబాటు ధర వస్తున్నది.

\- నర్సింహులు, గద్వాల

వచ్చిన రోజే కొనుగోళ్లు



నేను ఎకరం విస్తీర్ణంలో మిర్చి వేసిన. పంటను అమ్మేందుకు ప్రతిసారి మలక్‌పేట్‌కే వస్తా. గతంలో పంటను అమ్ముకునేందుకు మార్కెట్‌లో రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఇప్పుడు వచ్చినరోజే కొనుగోళ్లు జరుగుతున్నాయి. ధర గతంతో పోల్చితే నాకు రూ.3 వేలు కలిసొచ్చింది.

\- శ్రీను, మిర్చి రైతు

ఎన్విరాన్‌మెంటల్ పరీక్ష 31కి వాయిదా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 30న జరుగాల్సిన ఎన్విరాన్‌మెంటల్ పరీక్షను 31కి వాయిదా వేస్తూ ఇంటర్ బోర్డు సెక్రెటరీ ఏ అశోక్ నిర్ణయం తీసుకున్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పరీక్ష వాయిదా వేస్తున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28న జరుగాల్సిన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్షను ముందుగా ప్రకటించిన ప్రకారమే యథావిధిగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షలు ఉదయం 10 నుంచి 1 గంట వరకు జరుగుతాయని చెప్పారు.

ఒకేషనల్ కాలేజీల అఫిలియేషన్‌కు నోటిఫికేషన్

రాష్ట్రంలోని ఒకేషనల్ కాలేజీలకు (వృత్తి విద్యా జూనియర్ కళాశాలలు) 2019-20 అఫిలియేషన్ పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఇంటర్ బోర్డు సెక్రెటరీ ఏ అశోక్ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 10 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు.

హైదరాబాద్‌లో ఇండియా సాఫ్ట్

- 19వ ఎడిషన్‌కు వేదిక కానున్న నగరం
- వచ్చే నెల 4,5 తేదీల్లో హెచ్ఐసీసీలో సదస్సు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రముఖ ఐటీ సంస్థలకు చెందిన అంతర్జాతీయ ఒప్పందాలు, చర్చాగోష్ఠులకు వేదికగా నిలిచే ఇండియా సాఫ్ట్ సమావేశం హైదరాబాద్ వేదికగా జరుగనుంది. కేంద్ర ప్రభుత్వ ఐటీ , శాస్త్రసాంకేతిక శాఖల మద్దతుతో ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఈఎస్‌సీ) నిర్వహించే ఈ సదస్సు 19వ ఎడిషన్ హైదరాబాద్ వేదికగా ఫిబ్రవరి 4,5 తేదీల్లో హెచ్ఐసీసీలో జరుగనుంది. ఈ సమావేశం వివరాలను ఈఎస్‌సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీకే సరీన్, ఇండియా సాఫ్ట్ ఆర్గనైజింగ్ చైర్మన్ నలిన్‌కోహ్లీ, ఎస్‌టీపీఐ డైరెక్టర్ సీవీడీ రాంప్రసాద్, నాస్కాం ప్రతినిధి ఆర్ శ్రీనివాస్‌రావు మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఐటీ రంగంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మొదలుకొని భారీ కంపెనీలను ఒక్కతాటిపైకి తెచ్చి పరస్పరం చర్చలు, ఒప్పందాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు హైదరాబాద్‌ను వేదికచేసినట్లు వివరించారు. ఈ కీలక జాతీయ సదస్సుకు తెలంగాణ రాష్ట్రప్రభుత్వం మద్దతు ఇవ్వటం తమకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తున్నదని వెల్లడించారు. ఎగ్జిబిషన్లో పాల్గొనే సంస్థలను ప్రోత్సహించేందుకు యాభై శాతం రాయితీ ఇచ్చిందని వివరించారు. మహిళలకు వందశాతం ప్రదర్శన పన్ను మినహాయింపు ఇచ్చారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రోత్సాహం చూసి మధ్యప్రదేశ్, గోవా రాష్ట్రాలు ఈ ప్రదర్శనకు మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయని వివరించారు. రాబోయే కాలంలో ఐటీ, ఐటీ అనుబంధ పరిశ్రమల వృద్ధి 8-10 శాతం మేర ఉంటుందని అంచనా వేస్తున్నట్లు ఈఎస్‌సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీకే సరీన్ పేర్కొన్నారు. అమెరికా నిబంధనలతో ఐటీ పరిశ్రమ ఎగుమతులపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ఆఫ్రికా, మధ్య ఆసియా దేశాలపై దృష్టి సారిస్తే మన కంపెనీలు అభివృద్ధిపథంలో సాగుతాయని వివరించారు.



మంగళ వారం బేగంపేటలోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఈఎస్‌సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీకే సరీన్, చిత్రంలో ఇండియా సాఫ్ట్ ఆర్గనైజింగ్ చైర్మన్ నలిన్ కోహ్లీ, ఎస్‌టీపీఐ డైరెక్టర్ సీవీడీ రాంప్రసాద్, నాస్కాం ప్రతినిధి ఆర్ శ్రీనివాస్‌రావు, ఐటీ జేడీ హుస్సేన్

హోంమంత్రిని కలిసిన లూధియానా ఎమ్మెల్యే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంజాబ్‌లోని లూధియానా నియోజకవర్గ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ వైద్ మంగళవారం తెలంగాణ హోంశాఖ మంత్రి మహమూద్‌అలీని మర్యాదపూర్వకంగా కలిశారు. కుల్దీప్‌సింగ్ హైదరాబాద్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని హోంమంత్రి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అడిగి తెలుసుకొని సంతోషం వ్యక్తంచేశారు.

బీసీ యువతకు నైపుణ్య శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీసీ నిరుద్యోగ యువతకు చేయూతనందించేందుకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్టు బీసీ కార్పొరేషన్ ఎండీ అలోక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో వృత్తి నైపుణ్య శిక్షణ అందించేందుకు అభ్యర్థులను ఎంపికచేశారు. ఎంపికైనవారికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ప్లేబాటమీ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు అలోక్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రజక ఫెడరేషన్ ఎండీ కే చంద్రశేఖర్, బీసీ కార్పొరేషన్ జీఎం జీ రాంరెడ్డి, అపోలో మెడ్ స్కిల్స్ ప్రతినిధి డాక్టర్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

క్యూనెట్ ఆటకట్టు

- రూ.వెయ్యి కోట్లకుపైగా కుంభకోణాన్ని ఛేదించిన సైబరాబాద్ పోలీసులు
- మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో లక్షల మందికి టోకరా
- 58 మంది అరెస్టు.. బెంగళూరులో గోడౌన్, బ్యాంక్ అకౌంట్లు సీజ్



మంగళవారం మీడియాకు క్యూనెట్ కేసు వివరాలు వెల్లడిస్తున్న సైబరాబాద్ సీపీ సజ్జనార్

శేరిలింగంపల్లి: 'క్యూనెట్' బ్రాండ్ పేరుతో దేశంలోని వివిధ ప్రాంతాల్లో గుట్టుచప్పుడుకాకుండా గొలుసుకట్టు వ్యాపారం నిర్వహిస్తూ, లక్షల మందిని ముంచుతున్న నిందితులను సైబరాబాద్ పోలీసులు అరెస్టుచేశారు. దాదాపు రూ.వెయ్యి కోట్ల కుంభకోణాన్ని ఛేదించడంతోపాటు 14 కేసులకు సంబంధించి మొత్తం 58 మందిని అదుపులోకి తీసుకొన్నారు. బ్యాంకు ఖాతాల్లోని రూ.2.7 కోట్లను, బెంగళూరులోని గోడౌన్‌ను సీజ్ చేశారు. మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో కమిషనర్ సజ్జనార్ వివరాలను వెల్లడించారు. విజయ్ ఈశ్వరన్, జోసఫ్ బిస్మార్క్ 1998లో హాంగ్‌కాంగ్, మలేషియా కేంద్రంగా క్యూవన్ గ్రూఫ్ ఆఫ్ కంపెనీ పేరుతో వ్యాపారం ప్రారంభించి నష్టపోయారు. వారు 2001లో భారత్‌కు వచ్చి గోల్డ్‌క్వెస్ట్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో బంగారు కాయిన్ల వ్యాపారం ప్రారంభించారు. 2004లో క్వెస్ట్‌నెట్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో గోల్డ్ కాయిన్స్, బయోడిస్క్, వాచ్‌లు, హాలిడే ట్రిప్స్ వంటి కార్యకలాపాలు నిర్వహించారు. భారత్‌తోపాటు మలేషియా, కంబోడియా, టర్కీ, సౌదీ అరేబియా, రష్యా తదితర దేశాల్లో గొలుసుకట్టు వ్యాపారాలు ప్రారంభించి అమాయకుల నుంచి డబ్బులు దండుకున్నారు. 2010లో భారత కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వీరి కంపెనీలపై విచారణకు ఆదేశించడంతో కార్యకలాపాలు స్తంభించాయి. విజయ్ ఈశ్వరన్, జోసఫ్ బిస్మార్క్ మళ్లీ 2011లో విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ఇండియా కంపెనీని ప్రారంభించి 'క్యూనెట్' బ్రాండ్ పేరుతో వ్యాపార, ఆరోగ్య, అభరణాలఉత్పత్తి, విహార యాత్రలు, విద్యాపరమైన ప్యాకేజీలతో గొలుసుకట్టు వ్యాపారానికి తెరలేపారు.

లక్షల్లో బాధితులు

వీరు పక్కా ప్రణాళికతో నిరుద్యోగులకు గాలం వేస్తారు. ఒకసారి పెట్టుబడి పెడితే ప్రతినెలా డబ్బు వస్తాయని, రెండుమూడేండ్లలో కోటీశ్వరులు కావొచ్చని నమ్మించి రూ.లక్షలు కట్టించుకుంటారు. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఇస్తారు. రెండుమూడు నెలలు తిప్పించుకున్న తర్వాత గొలుసుకట్టు వ్యాపారాన్ని తెరమీదికి తెస్తారు. మీ స్నేహితులు, బంధువులను కనీసం ఇద్దరిని చేర్పించి, తమ ఉత్పత్తులు అమ్మితేనే మీ డబ్బు తిరిగొస్తుందని చెప్తారు. ఇలా తెలంగాణ, ఏపీతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో లక్షల మందిని మోసం చేశారు. దాదాపు రూ.వెయ్యి కోట్లకుపైగా వసూలు చేసి ఉంటారని పోలీసులు చెప్తున్నారు.

58 మంది నిందితుల అరెస్టు

ఈ మోసాలపై అందిన ఫిర్యాదుల మేరకు సైబరాబాద్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. రాయదుర్గం, మాదాపూర్, గచ్చిబౌలి, కేపీహెచ్‌బీ, మియాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 58 మందిని అరెస్టుచేశారు. బెంగళూరులో ఉన్న క్యూనెట్ ఉత్పత్తుల గోడౌన్‌ను, కంపెనీకి చెందిన అకౌంట్‌లో ఉన్న రూ.2.7 కోట్లను సీజ్ చేసినట్టు సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ మోసాలపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మాదాపూర్ డీసీపీ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ డీసీపీ విజయ్‌కుమార్, కూకట్‌పల్లి ఏసీపీ సురేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



‘హిమాలయన్ క్వీన్’లో మంటలు

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెనుప్రమాదం

సిమ్లా, జనవరి 8: ప్రముఖ పర్యాటక రైలు హిమాలయన్ క్వీన్‌లో మంగళవారం మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమవ్వడంతో పెను ప్రమాదం తప్పింది. దాదాపు 200 మంది ప్రయాణికులతో హిమాచల్‌ప్రదేశ్‌లోని కల్కా నుంచి సిమ్లాకు వెళ్తున్న ఈ రైలులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ మంటలను అదుపు చేసి అధికారులకు సమాచారమిచ్చారు. మరో ఇంజిన్‌ను మార్చిన అనంతరం రైలు సిమ్లాకు బయలుదేరింది.

‘అయోధ్య’పై రాజ్యాంగ ధర్మాసనం

- సీజేఐ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో ఏర్పాటు
- రేపు విచారణ ప్రారంభం

న్యూఢిల్లీ, జనవరి 8: వివాదాస్పద రామజన్మభూమి- బాబ్రీ మసీదు స్థల వివాదం కేసుపై విచారణ జరిపేందుకు అత్యున్నత న్యాయస్థానం మంగళవారం ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ చంద్రచూడ్ సభ్యులుగా ఉన్నారు. ఈనెల 10న అయోధ్య కేసుపై ఈ ధర్మాసనం విచారణ జరపనుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో నోటీసును పొందుపరిచారు. అయోధ్య కేసు విషయంలో జనవరి 10న తగిన ధర్మాసనం తదుపరి ఉత్తర్వులు జారీ చేస్తుందని సుప్రీంకోర్టు ఈ నెల 4న పేర్కొన్న విషయం తెలిసిందే. వివాదంలో ఉన్న 2.27 ఎకరాల స్థలాన్ని సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహి అఖారా, రామ్ లల్లా మధ్య సమానంగా పంచుతూ 2010లో అలహాబాద్ హైకోర్టు వెలువరించిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో 14 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై జనవరి మొదటి వారంలో తగిన బెంచ్ విచారణ చేపడుతుందని గతేడాది అక్టోబర్ 29న సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

మహిళా కాంగ్రెస్ నేతగా ట్రాన్స్‌జెండర్

ప్రధాన కార్యదర్శిగా నియమించడం ఇదే తొలిసారి



రాహుల్‌తో అప్సరా రెడ్డి

న్యూఢిల్లీ, జనవరి 8: అఖిల భారత మహిళా కాంగ్రెస్ (ఏఐఎంసీ) జాతీయ ప్రధాన కార్యదర్శిగా ట్రాన్స్‌జెండర్ అప్సరారెడ్డి నియమితులయ్యారు. 133 ఏండ్ల చరిత్ర గల ఈ పార్టీ జాతీయస్థాయిలో ఒక ట్రాన్స్‌జెండర్‌ను నియమించడం ఇదే మొదటిసారి. జర్నలిస్టు, సామాజిక కార్యకర్తగా పని చేసిన అప్సరారెడ్డిని జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఏఐఎంసీ అధ్యక్షురాలు, ఎంపీ సుస్మితాదేవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నియమించారు. బాలలపై లైంగిక దాడులు, తదితర సామాజిక అంశాలపై అప్సరారెడ్డి కృషి చేస్తున్నారు. ఇంతకుముందు ఆమె బీజేపీ, అన్నాడీఎంకే పార్టీల్లో పని చేశారు. మహిళా కాంగ్రెస్‌లోకి అప్సరారెడ్డిని స్వాగతిస్తున్నట్లు సుస్మితాదేవ్ తెలిపారు. భారత జాతీయ కాంగ్రెస్ కుటుంబంలో అప్సరారెడ్డిని సభ్యురాలిగా నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అప్సరారెడ్డి స్పందిస్తూ అన్ని వర్గాల వారిని కలుసుకుంటూ.. మహిళల అభ్యున్నతి కోసం, వారి హక్కుల సాధనకు కృషి చేస్తానన్నారు. మహిళలకు ఆర్థిక సాధికారత సాధించడం కోసం వివిధ రాష్ట్రాల్లోని మహిళా కాంగ్రెస్ శాఖల అధ్యక్షురాళ్లతో కలిసి పని చేస్తానని తెలిపారు.



హాంగ్‌కాంగ్‌కు దక్షిణతీరంలో అగ్ని ప్రమాదం కారణంగా సముద్రంలోకి ఒరిగిపోతున్న ఆయిల్ ట్యాంకర్ ‘బెలాక్ ఫార్చ్యూన్’. ఈ నౌకలో మంగళవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో ఒకరు మరణించారు. కాగా ఇతర పడవల సాయంతో మంటలను ఆర్పుతూ, నౌక సముద్రంలో మునిగిపోకుండా ఆపేందుకు ప్రయత్నిస్తున్నామని హాంగ్‌కాంగ్ ప్రభుత్వం తెలిపింది.

వాణిజ్య బలోపేతానికి కృషి చేద్దాం

- రక్షణ రంగంలోనూ సహకరించుకుందాం
- ఫోన్‌లో మాట్లాడుకున్న మోదీ, ట్రంప్



న్యూఢిల్లీ/వాషింగ్టన్, జనవరి 8: భారత్, అమెరికా మధ్య వాణిజ్య సంబంధాల బలోపేతానికి కృషి చేయాలని ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించారు. నిత్యం యుద్ధవాతావరణంతో సతమతమవుతున్న ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతిస్థాపనకు సహకరించుకోవాలని భావించారు. సోమవారం సాయంత్రం మోదీ, ట్రంప్ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఇకపైనా కొనసాగించాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. అలాగే ఇండో-పసిఫిక్ ప్రాంత భద్రతలో కూడా ఇరుదేశాలు సహకరించుకోవాలని పేర్కొన్నారు. రక్షణ రంగంలో సహకరించుకోవాలని, ఉగ్రవాదంపై కలిసి పోరాడాలని నిర్ణయించారు.

మమ్మల్ని తక్కువ అంచనా వేయొద్దు

- ఎస్పీ, బీఎస్పీలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ సూచన

న్యూఢిల్లీ, జనవరి 8: ఉత్తర్‌ప్రదేశ్‌లో తమను తక్కువ అంచనా వేయొద్దని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సంకేతాలు ఇచ్చారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో తాము ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధమని పేర్కొన్నారు. గల్ఫ్ న్యూస్‌కు రాహుల్ ఇంటర్వ్యూ ఇస్తూ యూపీలో కాంగ్రెస్ పార్టీ ఆశ్చర్యకర ఫలితాలను సాధించనున్నదని తెలిపారు. ‘యూపీలో కాంగ్రెస్ పార్టీ చాలా శక్తివంతంగా ఉంది. మా శక్తి సామర్థ్యాలపై చాలా నమ్మకంతో ఉన్నాం. అందరినీ ఆశ్చర్య పరిచే ఫలితాలు సాధిస్తాం’ అని అన్నారు.

చైనాలో ఉత్తరకొరియా అధినేత కిమ్

బీజింగ్, జనవరి 8: ఉత్తరకొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్ తన సతీమణితో కలిసి మంగళవారం చైనాకు వచ్చారు. కొరియా ద్వీపకల్పాన్ని నిరాయుధీకరించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కిమ్ మలివిడుత చర్చలు జరుగనున్నాయన్న వార్తల నేపథ్యంలో చైనాలో కిమ్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకున్నది. అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు కిమ్ ఈ నెల 7-10 మధ్య చైనా పర్యటనకు వచ్చారని అధికార వార్తాసంస్థ ‘జిన్హువా’ పేర్కొంది.

భారత్ బంద్ పాక్షికం

- కేంద్ర వైఖరికి నిరసనగా కార్మికుల దేశవ్యాప్త సమ్మె
- చాలా రాష్ట్రాల్లో పెద్దగా కనిపించని బంద్ ప్రభావం
- ముంబైలో స్తంభించిన ప్రజా రవాణా వ్యవస్థ
- పశ్చిమ బెంగాల్‌లో పలు హింసాత్మక సంఘటనలు
- కర్ణాటకలో అంగన్‌వాడీ కార్యకర్త మృతి
- నేడూ కొనసాగనున్న సమ్మె

న్యూఢిల్లీ/కోల్‌కతా/తిరువనంతపురం, జనవరి 8: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పది జాతీయ కార్మిక సంఘాలు చేపట్టిన రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెకు తొలిరోజు మంగళవారం పాక్షిక స్పందన లభించింది. చాలా రాష్ట్రాల్లో బంద్ ప్రభావం పెద్దగా కనిపించలేదు. పశ్చిమ బెంగాల్‌లో పలు హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. బృహన్ముంబై విద్యుత్ సరఫరా,రవాణా(బెస్ట్) సంస్థకు చెందిన 32 వేల మంది ఉద్యోగులు సమ్మెకు దిగడంతో ముంబైలో ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించింది. కర్ణాటకలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఓ అంగన్‌వాడీ కార్యకర్త కుప్పకూలి మృతిచెందారు. కేరళలో విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఆందోళనకారుల నిరసనలతో పలు రాష్ట్రాల్లో రైళ్లు ఆలస్యంగా నడిచాయి. కార్మికుల సమ్మెకు పలు బ్యాంకు ఉద్యోగ సంఘాలు మద్దతు ప్రకటించడంతో ఆయా రాష్ట్రాల్లో బ్యాంకు సేవలకు పాక్షికంగా అంతరాయం తలెత్తింది. వేతనాలు పెంచాలంటూ బృహన్ ముంబై విద్యుత్ సరఫరా,రవాణా(బెస్ట్) సంస్థకు చెందిన 32 వేల మంది ఉద్యోగులు సమ్మెకు దిగడంతో మహారాష్ట్రలో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. 25 లక్షల మంది ప్రయాణికులపై దీని ప్రభావం పడింది. సుమారు 5వేల మంది ఆందోళనకారులు పాల్ఘర్‌లో ఢిల్లీకి వెళ్లే జాతీయ రహదారిని దిగ్బంధించారు. పశ్చిమ బెంగాల్‌లో బంద్ ప్రభావం పాక్షికంగా కనిపించింది. బంద్‌కు వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వ కార్యాలయాలు, ఐటీ రంగ సంస్థలు, పోర్టు కార్యకలాపాలు యథావిధిగా సాగాయి. అయితే బ్యాంకు సేవలకు పాక్షికంగా అంతరాయం ఏర్పడింది. ఓ చోట స్కూల్ బస్సుపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. కోల్‌కతాతోపాటు పలు ప్రాంతాల్లో ఆందోళనకారులు ప్రధాని మోదీ దిష్టిబొమ్మను తగులబెట్టి, టైర్లకు నిప్పంటించి నిరసన వ్యక్తం చేశారు. బంద్‌ను విఫలం చేసేందుకు తృణమూల్ కార్యకర్తలు యత్నించారు. మరోవైపు వరికి కనీస మద్దతు ధరను పెంచాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో బిజూ జనతాదళ్ చేపట్టిన ఒకరోజు నిరసనలో ఆ పార్టీ అధినేత, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ పాల్గొన్నారు. అనంతరం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు వినతి పత్రం సమర్పించారు. గోవాలో సుమారు 5వేల మందికిపైగా కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కర్ణాటకలో కార్మికుల సమ్మెకు మిశ్రమ స్పందన లభించింది. కేఎస్‌ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రైవేట్ బస్సులు, ఆటో రిక్షాలు యథావిధిగా నడిచాయి. కాగా, నిరసన సందర్భంగా ముందగోడిలో ఓ అంగన్‌వాడీ కార్యకర్త కుప్పకూలి మృతిచెందారు. ఒడిశాలో 16వ జాతీయ రహదారిపై బైఠాయించి కార్మికులు నిరసన తెలిపారు. కేరళలో బంద్ ప్రభావం కనిపించింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. విద్యాసంస్థలు మూతపడ్డాయి. పలు చోట్ల రైళ్లను అడ్డగించడంతో ఆలస్యంగా నడిచాయి. రాజస్థాన్‌లో ఓ జపనీస్ కంపెనీలోకి ప్రవేశించేందుకు కార్మికులు యత్నించడంతో ఘర్షణ తలెత్తింది. ఈ సందర్భంగా 22 మంది పోలీసులు, 50 మంది నిరసకారులకు గాయాలయ్యాయి. దేశవ్యాప్తంగా 20 కోట్ల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని సీఐటీయూ వెల్లడించింది. ప్రభుత్వ విధానాలపై ప్రజల ఆగ్రహానికి ఇదే నిదర్శనమని తెలిపింది.



నాంపల్లిలో విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్న డీసీసీ బ్యాంక్ ఉద్యోగులు

బ్యాంకు సేవలకు పాక్షికంగా అంతరాయం

కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మెకు ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐబీఈఏ), బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(బీఈఎఫ్ఐ) మద్దతు ప్రకటించాయి. దీంతో పలుచోట్ల బ్యాంకు సేవలకు అంతరాయం ఏర్పడింది. అయితే మరో ఏడు బ్యాంకు ఉద్యోగుల సంఘాలు సమ్మెకు దూరంగా ఉన్నాయి.



తెలంగాణలో నామమాత్రం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు తెలంగాణలో స్పందన నామమాత్రంగా కనిపించింది. వివిధ సంఘాలు ఈ సమ్మెలో పాలుపంచుకున్నాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.సాయిబాబు తెలిపారు. సింగరేణి, టీఎస్‌ఆర్టీసీ సంస్థల్లో ఉన్న టీఆర్‌ఎస్ పార్టీ అనుబంధ సంఘాలు ఈ సమ్మెలో పాల్గొనలేదని ఆయన తెలిపారు.

బెంగళూరులో మంగళ వారం వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శన



సేంద్రియసాగుపై పరస్పర సహకారానికి ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న వ్యవసాయవర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు, పతంజలి డైరెక్టర్ రవీంద్రబాబు

‘పతంజలి’తో వ్యవసాయ వర్సిటీ ఒప్పందం

- సేంద్రియ సాగులో పరస్పర సహకారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సేంద్రియ వ్యవసాయంలో పరస్పర సహకారం కోసం హరిద్వార్‌లోని పతంజలి బయో రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. ఉపకులపతి వీ ప్రవీణ్‌రావు సమక్షంలో అవగాహన పత్రాలపై పతంజలి డైరెక్టర్ డాక్టర్ రవీంద్రబాబు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్ సంతకాలు చేశారు. అతి తక్కువ ధరకే రైతులకు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు అందించాలన్నదే లక్ష్యమని వారు తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించని, కాలుష్యరహిత వ్యవసాయంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడమే తమ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడాతో...

ప్రిసిషియన్ ఫార్మింగ్, నీటియాజమాన్యం, భూసార సంరక్షణ అంశాల్లో పరస్పర సహకారంతో కలిసి పనిచేయాలని అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా, జయశంకర్ తెలంగాణ వ్యవసాయవర్సిటీ నిర్ణయించాయి. ఈ అంశంపై ఫ్లోరిడా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ రమేశ్‌రెడ్డి మంగళవారం వ్యవసాయవర్సిటీ ఉపకులపతి ప్రవీణ్‌రావు, రిజిస్ట్రార్ ఎస్ సుధీర్‌కుమార్‌తో సమావేశమయ్యారు. సాగునీటి విశ్లేషణ, భూసార పరీక్షలు, మైక్రోబియల్ విశ్లేషణలో ఫ్లోరిడా విశ్వవిద్యాలయం సహకారం అందించనున్నది.

సీతారామకు గ్రీన్‌సిగ్నల్

మొదటిపేజీ తరువాయి...

సందర్భంగా సీతారామ ప్రాజెక్టుకు త్వరితగతిన పర్యావరణ అనుమతి ఇవ్వాలంటూ కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి హర్షవర్ధన్‌ను కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సంబంధిత మంత్రిత్వశాఖ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీచేయడం ప్రాధాన్యం సంతరించుకున్నది.

గోదావరి నదిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి నీటిని మళ్లించి.. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని 6,74,402.47 ఎకరాలకు అందించేందుకు సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. ఉమ్మడి రాష్ట్రంలోని ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ ప్రాజెక్టులను రీడిజైనింగ్‌లో సమీకృతం చేసి ఈ ప్రాజెక్టును రూపొందించింది. రూ.13,384.80 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా 3,28,860.19 ఎకరాల నూతన ఆయకట్టుకు సాగునీరు అందనుండగా.. 3,45,542.28 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగనున్నది. మూడుజిల్లాల పరిధిలోని దాదాపు 180 గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుంది. తాగునీటికోసం ప్రత్యేకంగా కేటాయించిన మూడు టీఎంసీలతో ఆయా గ్రామాల పరిధిలోని చెరువులను నింపడంతోపాటు, ఇప్పటికే మనుగడలో ఉన్న సాగునీటి పథకాలకు కూడా ప్రయోజనం చేకూరనున్నది. ప్రాజెక్టు నిర్మాణంలోభాగంగా దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద హెడ్‌రెగ్యులేటర్ నిర్మాణం, 372 కిలోమీటర్ల మేర కాల్వ తవ్వకం, నాలుగు పంపుహౌజ్‌ల నిర్మాణం, డెలివరీ సిస్టర్న్స్, తొమ్మిది కిలోమీటర్ల పంపింగ్ మెయిన్, వాగులపై క్రాస్ డ్రైనేజీ, సొరంగాలు, కాల్వలపై క్రాస్‌రెగ్యులేటర్లు, తూముల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. వచ్చే జూన్‌నాటికి ప్రాజెక్టును పూర్తిచేసే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తున్నది.




సీతారామా ఎత్తిపోతల పథకం నీటిని తరలించేందుకు కుమ్మరిగూడెం వద్ద నిర్మాణ దశలో ఉన్న ప్రధాన కాలువ

రూ.1158.72 కోట్లతో ఈఎంపీ

సీతారామ ప్రాజెక్టుకోసం సుమారు 20,946.72 ఎకరాల భూసేకరణ జరుపాల్సి ఉన్నది. ఇందులో 3,783.33 ఎకరాలు అటవీభూమి, 11,905.90 ఎకరాలు పట్టాభూమి, 5257.48 ఎకరాలు ప్రభుత్వభూమి ఉన్నది. ప్రాజెక్టు నిర్మాణంతో సుమారు 4,769.13 ఎకరాల భూమి ముంపునకు గురవుతుండగా.. 157 గ్రామాల పరిధిలో 9,696 కుటుంబాలు నిరాశ్రయులవుతున్నాయి. ప్రాజెక్టుకు కేంద్ర అటవీశాఖ గతంలోనే తుది అనుమతులు ఇచ్చింది. పర్యావరణ అనుమతికోసం గతేడాది ఆగస్టు 8న భద్రాద్రి-కొత్తగూడెం, 29న ఖమ్మం, సెప్టెంబరు 6న మహబూబాబాద్ జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. పర్యావరణ ప్రభావిత అంచనా నివేదికను నీటిపారుదలశాఖ గతంలోనే కేంద్రానికి సమర్పించింది. ఈ క్రమంలోనే నిపుణుల అంచనా కమిటీ గత అక్టోబర్ 26, 27 తేదీల్లో భేటీ అయిన సందర్భంగా సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ అనుమతులపై చర్చించింది. ప్రాజెక్టు అధికారులు సమర్పించిన నివేదికలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేసింది. కాగా, సీఎం కేసీఆర్ రెండోసారి ప్రమాణ స్వీకారంచేశాక తొలిసారిగా చేపట్టిన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర పర్యావరణ, అటవీశాఖమంత్రి హర్షవర్ధన్‌ను కలిశారు. సీతారామ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతిని వెంటనే జారీచేసేలా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. సీఎం దౌత్యం ఫలించి కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ అనుమతినిస్తూ ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంత్రిత్వశాఖ డైరెక్టర్ డాక్టర్ ఎస్ కర్కెట్ట ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ సుధాకర్‌కు లేఖ పంపారు. ఇందులో ప్రాజెక్టు పరిధిలో పర్యావరణ నిర్వహణ ప్రణాళిక (ఈఎంపీ)కు రూ.1158.72 కోట్లు కేటాయించినట్టు అధికారులు స్పష్టంచేశారు. ఇందుకు సంతృప్తి చెందిన నిపుణుల అంచనా కమిటీ.. ఈ మొత్తాన్ని బడ్జెట్‌లో కేటాయింపులు చేయడంతో పాటు, ఈ నిధులను ఈఎంపీకి మాత్రమే వెచ్చించాలని స్పష్టంచేసింది.


ఇస్టా కాంగ్రెస్‌కు ఏర్పాట్లు చేయండి



మంగళ వారం సచివాలయంలో ఇస్టా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎస్ ఎస్కే జోషి, ఇస్టా సెక్రటరీ జనరల్ ఎండ్రీస్ వైస్, స్విట్జర్లాండ్ ప్రతినిధి ఓల్గా స్టోయికీ, ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ పీటర్ కార్ బెర్రీ, తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉన్నతాధికారులు

- అధికారులకు సీఎస్ ఎస్కే జోషి ఆదేశం
- బ్రోచర్ ఆవిష్కరించిన అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : జూన్ 26 నుంచి జూలై 3 వరకు హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగే 32వ ఇంటర్నే సీడ్ టెస్టింగ్ అసోసియేషన్- ఇస్టాకాంగ్రెస్ (ఐఎస్‌టీఏ)కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎస్కే జోషి ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ఈ అంశంపై సమీక్ష జరిపారు. అంతకుముందు ఇంటర్నేషనల్ సీడ్ ఎగ్జిబిషన్‌పై రూపొందించిన బ్రోచర్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆవిష్కరించారు. జూన్ 26న ప్రారంభోత్సవ కార్యక్రమం, 26 నుంచి 28 వరకు సీడ్ సింపోజియం, ఇంటర్నేషనల్ సీడ్ ఎగ్జిబిషన్, 28న విత్తన ఉత్పత్తిదారుల సమావేశం, జూన్ 29 నుంచి జూలై 3 వరకు ఇస్టా వార్షిక సమావేశాలు జరుగుతాయని తెలిపారు. దాదాపు 400 మంది విదేశీ ప్రతినిధులు పాల్గొంటారని, వీరికి వసతి, భద్రత, రవాణా సదుపాయాలు కల్పించాలని సీఎస్ ఆదేశించారు. విత్తన ప్రదర్శనలో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి 200 విత్తన కంపెనీలు పాల్గొంటాయని, కొత్త ఉత్పత్తులు, సీడ్ ప్రాసెసింగ్, ప్యాకింగ్ ఎక్విప్‌మెంట్స్, సీడ్ ట్రీట్‌మెంట్, నూతన టెక్నాలజీపై చర్చ ఉంటుందని సీఎస్ అన్నారు. విత్తనోత్పత్తి, నాణ్యతపై ఈ సింపోజియం ఉంటుందని చెప్పారు. ఈ సింపోజియంలో అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి 50 మంది చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ నుంచి ప్రతినిధులు పాల్గొంటారన్నారు. సమీక్షలో ఇస్టా సెక్రటరీ జనరల్ ఎండ్రీస్ వైస్, ఇస్టా స్విట్జర్లాండ్ ప్రతినిధి ఓల్గా స్టోయికీ, ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ పీటర్ కార్ బెర్రీ, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, టూరిజంశాఖ కార్యదర్శి బీ వెంకటేశం, హైదరాబాద్ పోలీసు కమిషనర్ అంజనీకుమార్, అదనపు డీజీ జితేందర్, వ్యవసాయశాఖ కమిషనర్ రాహుల్ బొజ్జా, రీజినల్ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, సీడ్ కార్పొరేషనర్ డైరెక్టర్, ఇస్టా కో-ఆర్డినేటర్ డాక్టర్ కే కేశవులు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సమాచారశాఖ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో అంతర్జాతీయ పతంగుల పండుగ, మిఠాయిలు వేడుక నిర్వహణపై సమీక్షిస్తున్న సీఎస్ ఎస్కే జోషి. చిత్రంలో అధికారులు బుర్రా వెంకటేశం, అంజనీకుమార్, దినకర్‌బాబు తదితరులు ఉన్నారు.

హైదరాబాద్ ఖ్యాతి ఇనుమడించాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : హైదరాబాద్ బ్రాండ్ ఇమేజి పెరిగేలా అంతర్జాతీయ పతంగుల పండుగ, మిఠాయిల పండుగలను నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్కే జోషి అధికారులను ఆదేశించారు. ఈ నెల 13 నుంచి 15 వరకు పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగనున్న నాలుగో అంతర్జాతీయ పతంగుల పండుగ.. మిఠాయి వేడుకల నిర్వహణపై మంగళవారం సచివాలయంలో సీఎస్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రతిరోజు 3 లక్షల మంది సందర్శకులకు తగినవిధంగా ఏర్పాట్లుచేయాలన్నారు. బారికేడ్లు, పరిశుభ్రత, ట్రాఫిక్, అగ్నిమాపక వ్యవస్థ, బందోబస్తు, మంచినీటి సరఫరా, వైద్యసేవలు అందించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా లేఔట్ రూపొందించుకొని పనులు చేపట్టాలన్నారు. జీహెచ్‌ఎంసీ ద్వారా స్వచ్ఛ సర్వేక్షణపై ప్రచారం నిర్వహించాలన్నారు. పతంగుల పండుగలో 20 దేశాల నుంచి 50 మంది పతంగులు ఎగురవేసే నిపుణులు పాల్గొంటారని టూరిజంశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. వివిధ రాష్ట్రాల మహిళలు వెయ్యిరకాల మిఠాయిలు తయారు చేస్తారని వివరించారు. ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని చెప్పారు. ఈ రెండు పండుగలను చూడటానికి దాదాపు 10 లక్షల మంది సందర్శకులు వస్తారని పేర్కొన్నారు. వచ్చేఏడాదినాటికి హైదరాబాద్‌లో పతంగుల పండుగ అతి పెద్ద పండుగగా నిర్వహించడానికి చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్, టూరిజం కమిషనర్ దినకర్‌బాబు, ఫైర్ సర్వీసెస్ డీజీ గోపికృష్ణ, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తెలుగువర్సిటీలో బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్, జూలూరు గౌరీశంకర్, ఆంజనేయగౌడ్, వీసీ సత్యనారాయణ

బీసీల వాస్తవ స్థితిగతుల అధ్యయనం

- 97 ప్రభుత్వ సంస్థల నుంచి సమాచారం సేకరించాం
- బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వెనుకబడిన తరగతులకు చెందిన 119 కులాల వాస్తవ జీవన స్థితిగతులు, సామాజిక, ఉపాధి, విద్యారంగాల్లో ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేస్తున్నామని బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు చెప్పారు. బీసీ కులాల స్థితిగతుల అధ్యయనంలో భాగంగా బుధవారం తెలుగువర్సిటీని బీసీ కమిషన్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 119 బీసీ కులాల ఆర్థిక పరిస్థితిని ఇతర సామాజిక కులాలతో తులనాత్మక అధ్యయనంచేయాలని ప్రభుత్వం కోరిందన్నారు. అందులో భాగంగానే ఇప్పటివరకు 31 జిల్లాల్లోని 97 ప్రభుత్వ సంస్థల నుంచి సమాచారాన్ని సేకరించామని చెప్పారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్, ఆంజనేయగౌడ్, జూలూరు గౌరీశంకర్, వర్సిటీ వీసీ ఎస్వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానికి ఎదురుదెబ్బ

సర్కార్‌కిది గుణపాఠం

కేంద్రం తప్పు చేసినట్లు రుజువైంది ■ సుప్రీంకోర్టు తీర్పుపై ప్రతిపక్షాల స్పందన

న్యూఢిల్లీ: సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను బలవంతంగా సెలవుపై పంపుతూ మోదీ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు పక్కకుపెట్టడం శుభ పరిణామమని కాంగ్రెస్ తెలిపింది. ప్రధాని తాను చేసిన ఆదేశాలు చట్టవ్యతిరేకమని సుప్రీంకోర్టుతో చెప్పించుకున్న తొలి ప్రధాని మోదీ అని ఎద్దేవా చేసింది. ఎల్లవేళలా మనుగడలో ఉండే సీబీఐ, సీవీసీ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల స్వతంత్రతను, స్వయం ప్రతిపత్తిని దెబ్బతీయాలని ప్రయత్నించడం తగదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా ట్వీట్ చేశారు. కాగా, అలోక్ వర్మను తిరిగి సీబీఐ డైరెక్టర్ కుర్చీలో సుప్రీంకోర్టు కూర్చోబెట్టడంతో ప్రధాని మోదీ తప్పు చేసినట్లు రుజువైందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. దీనికి నైతిక బాధ్యత వహించి ప్రధాని రాజీనామా చేయాలన్నారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ స్పందిస్తూ అలోక్ వర్మ విషయంలో కేంద్రం తప్పు చేసినట్లు రుజువైందన్నారు. 'రాఫెల్'పై అలోక్ వర్మ దర్యాప్తు జరుపుతారేమోనన్న భయంతోనే ఆయనను బలవంతంగా సెలవుపై పంపారన్నారు. జమ్ముకశ్మీర్ మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని చెప్పారు. ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా స్పందిస్తూ సుప్రీంకోర్టు తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని పేర్కొన్నారు. సీబీఐపై సుప్రీంకోర్టు తీర్పు నిరంకుశపాలనకు వ్యతిరేకంగా లభించిన గొప్ప విజయమని కర్ణాటక మాజీ సీఎం, కాంగ్రెస్ నేత సిద్దరామయ్య పేర్కొన్నారు.


విద్యార్థి సంఘాల బంద్‌తో గువాహటిలో నిలిచిపోయిన బస్సులు

పౌరసత్వ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకం కాదన్న హోంమంత్రి రాజ్‌నాథ్
- వాకౌట్ చేసిన కాంగ్రెస్ పార్టీ.. బీజేపీతో ఏజీపీ తెగదెంపులు
- బిల్లుకు వ్యతిరేకంగా ఈశాన్య రాష్ట్రాల్లో స్తంభించిన జన జీవనం

న్యూఢిల్లీ, జనవరి 8: బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి వలస వచ్చిన ముస్లిమేతరులకు దేశ పౌరసత్వం కల్పించాలని కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లును లోక్‌సభ మంగళవారం ఆమోదించింది. కాగా, బిల్లుకు వ్యతిరేకంగా అసోంతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన 11 గంటల బంద్‌తో జనజీవనం స్తంభించింది. లోక్‌సభలో బిల్లుపై చర్చ సందర్భంగా హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ 'పౌరసత్వం (సవరణ) బిల్లు 2019' రాజ్యాంగానికి వ్యతిరేకం కాదన్నారు. వీరు భారత్‌కు తప్ప మరో దేశానికి వెళ్లలేరన్నారు. కాగా, ఈ బిల్లును వ్యతిరేకించిన అసోం గణపరిత్ (ఏజీపీ).. బీజేపీతో సంబంధాలు తెగదెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. ఎన్డీయే మిత్రపక్షాలు శివసేన, జేడీయూ వ్యతిరేకించాయి. మిజోరం, మేఘాలయ ప్రభుత్వాలు వ్యతిరేకించాయి. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపేందుకు సర్కార్ నిరాకరించడంతో కాంగ్రెస్ వాకౌట్ చేసింది.

అసోంలో నిరవధిక 'ఆర్థిక' దిగ్బంధానికి పిలుపు
వివాదాస్పద పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా అసోంను 'ఆర్థికంగా దిగ్బంధించాలి' అని కృషక్ ముక్తి సంగ్రామ్ (కేఎంఎస్ఎస్) సహా 70కి పైగా సంఘాలు నిర్ణయించాయి. వివిధ సంఘాలు ఇచ్చిన 11 గంటల బంద్ పిలుపుతో అసోంతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో జన జీవనం స్తంభించింది. దిబ్రూగఢ్‌లోని అసోం సీఎం సర్బానంద సోనోవాల్‌ను అఖిల అసోం విద్యార్థి సంఘం (అసు) కార్యకర్తలు కార్యకర్తలు ఘెరావ్ చేశారు. ఆందోళనకారులు టైర్లకు నిప్పంటించి పలు జాతీయ రహదారులను దిగ్బంధించారు. వాహనాలను ధ్వంసం చేశారు. అసుతోపాటు ఈశాన్య విద్యార్థి సంఘాల సంస్థ (ఎన్ఈఎస్ఓ) బంద్ పిలుపునకు ఏజీపీ, కాంగ్రెస్, ఏయూయూడీఎఫ్) సహా 70 సంఘాలు మద్దతు పలికాయి.

సీబీఐ X సీబీఐ కేసు

- డైరెక్టర్ అలోక్‌వర్మను సెలవుపై పంపడాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు
- ఆయనను మళ్లీ డైరెక్టర్‌గా నియమిస్తూ ఆదేశాలు
- అత్యున్నత కమిటీ తేల్చేంత వరకూ విధానపరమైన నిర్ణయాలు తీసుకోవద్దని ఆంక్షలు


అలోక్‌వర్మ

న్యూఢిల్లీ, జనవరి 8: సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మ కేసులో కేంద్రానికి సుప్రీంకోర్టులో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఆయన అధికారాలను తొలిగించి, నిర్బంధ సెలవుపై పంపడాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు వెంటనే ఆయనను తిరిగి విధుల్లో నియమించాలని ఆదేశించింది. మూడు నెలల క్రితం అలోక్‌వర్మను సెలవుపై పంపుతూ సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ), కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగం (డీవోపీటీ) తీసుకున్న నిర్ణయాన్ని పక్కన పెట్టింది. అలోక్‌వర్మ ప్రధాన విధాన నిర్ణయాలేవీ తీసుకోరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీనిపై సీబీఐ డైరెక్టర్‌ను ఎంపికచేసే ప్రధాని, లోక్‌సభలో విపక్ష నేత, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌తో కూడిన అత్యున్నత కమిటీ వారంలోపు నిర్ణయం తీసుకోవాలన్నది. అలోక్‌వర్మపై వచ్చిన అవినీతి ఆరోపణల విషయంలో సీవీసీ నివేదిక ఆధారంగా అత్యున్నత కమిటీ నిర్ణయం తీసుకోవాలని తెలిపింది. సీబీఐ వర్సెస్ సీబీఐగా పేర్కొన్న ఈ కేసులో చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం మంగళవారం తీర్పును చెప్పింది. రంజన్ గొగోయ్ సెలవులో ఉండటంతో 44 పేజీల తీర్పును మరో జస్టిస్ ఎస్కే కౌల్ చదివి వినిపించారు. సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా మన్నెం నాగేశ్వరరావు నియామకాన్నీ సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. కాగా అలోక్‌వర్మ రెండేండ్ల పదవీకాలం ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యంలో అత్యున్నత కమిటీ అతి త్వరలో సమావేశం కావాలి. లేకుంటే ప్రక్రియ అంతా నిష్ఫలమవుతుంది. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ (డీఎస్‌పీఈ) చట్టాన్ని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. సెలక్షన్ కమిటీ అనుమతి లేకుండా సీబీఐ డైరెక్టర్‌ను బదిలీ చేయరాదని డీఎస్‌పీఈ చట్టం పేర్కొంటున్నదని గుర్తు చేసింది. ఈ కేసులో తాము సీబీఐ డైరెక్టర్ అధికారాలను తొలిగించే అధికారం ప్రభుత్వానికి ఉందా అన్న విషయాన్ని మాత్రమే పరిశీలించామని తెలిపింది. అలోక్‌వర్మ, సీబీఐ స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్తానా పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకుంటూ రచ్చకెక్కిన నేపథ్యంలో ప్రభుత్వం వారిద్దరినీ నిర్బంధ సెలవుపై పంపుతూ గత అక్టోబర్ 23న ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రభుత్వ ఆదేశాలను సవాలు చేస్తూ వర్మ సుప్రీంకోర్టుకు వెళ్లారు. అవినీతి కేసులో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆస్తానా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. పలు మలుపులు, పరిణామాల అనంతరం సుప్రీంకోర్టు తాజాగా తన నిర్ణయాన్ని వెల్లడించింది.

సీబీఐ డైరెక్టర్ స్వతంత్రతకు, విశ్వసనీయతకు నిదర్శనంగా ఉండాలి
సీబీఐ డైరెక్టర్ స్వతంత్రతకు విశ్వసనీయతకు నిదర్శనంగా ఉండాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అయితే అన్ని రకాల నియంత్రణ, ఒత్తిడులు లేనప్పుడే అది సాధ్యమవుతుందని పేర్కొంది. అన్యప్రభావాల నుంచి సీబీఐ డైరెక్టర్ కార్యాలయాన్ని దూరంగా ఉంచడమే దానిని ఏర్పాటుచేయడంలోని శాసనం ఉద్దేశమని స్పష్టం చేసింది. దేశంలో ప్రధాన దర్యాప్తు సంస్థగా, ఎటువంటి భయం, పక్షపాతం లేకుండా తన పాత్రను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగానే సీబీఐని అన్ని రకాల బాహ్య ప్రభావాలకు అతీతంగా ఉండేలా ఏర్పాటుచేశారని తెలిపింది. అందువల్ల ఆ సంస్థ డైరెక్టర్ స్వతంత్రతకు, విశ్వసనీయతకు నిదర్శనంగా ఆదర్శప్రాయునిగా ఉండాలని పేర్కొంది. సీబీఐకి ఇటువంటి స్వేచ్ఛను ఇవ్వడంలోని ప్రధాన ఉద్దేశం ప్రజా ప్రయోజనమేనని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కోర్టు వినీత్ నారాయణ్ కేసులో ఇచ్చిన తీర్పును ప్రస్తావించింది. ఉన్నతస్థాయిలో ఉన్న ప్రభుత్వ అధికారుల అవినీతిపై వచ్చే ఆరోపణలకు సంబంధించి 1997లో కోర్టు 'వినీత్ నారాయణ్' తీర్పునిచ్చింది.

అలోక్‌వర్మ దర్యాప్తులు ప్రారంభించవచ్చు
సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మ దర్యాప్తులను చేపట్టవచ్చని, ఓ మాజీ అధికారి పేర్కొన్నారు. కేవలం విధాన నిర్ణయాలు మాత్రమే తీసుకోవద్దని కోర్టు తన తీర్పులో పేర్కొందని ఆయన గుర్తు చేశారు. పేరు వెల్లడించడానికి నిరాకరించిన ఆ అధికారి ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ, సీబీఐ డైరెక్టర్ నిర్ణయాలు మూడు విభాగాలకు సంబంధించినవి ఉంటాయని చెప్పారు. అవి పాలనాపరమైనవి, దర్యాప్తుకు సంబంధించినవి, విధానపరమైనవి అని తెలిపారు. ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం, చార్జిషీట్లు దాఖలు చేయడం, కేసుల దర్యాప్తును పర్యవేక్షించడం, అధికారులను బదిలీ చేయడం విధాన నిర్ణయాల కిందకు రావని చెప్పారు.

వారిద్దరినీ సెలవుపై పంపడం సబబే: జైట్లీ
అవినీతి ఆరోపణల నేపథ్యంలో సీబీఐలోని ఇద్దరు సీనియర్ అధికారులైన అలోక్‌వర్మ, ఆస్తానాలను సెలవుపై పంపడాన్ని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ సమర్థించుకున్నారు. సీవీసీ సిఫారసు మేరకు వారిద్దరినీ సెలవుపై పంపడం సబబేనని చెప్పారు.

సీబీఐలో అంతర్గత పోరుకు దారితీసిన పరిణామాలు

- **2017 అక్టోబర్ 23:** సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మ అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ సీబీఐ స్పెషల్ డైరెక్టర్‌గా రాకేశ్ ఆస్తానా నియామకం.
- **2018, జూలై 12:** అలోక్‌వర్మ విదేశీ పర్యటనలో ఉండగా, సీబీఐలో పదోన్నతులపై సీవీసీ ఏర్పాటు సమావేశానికి ఆస్తానా హాజరు.
- **ఆగస్టు 24:** అలోక్‌వర్మతోపాటు మరికొందరు అధికారులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ సీవీసీకి ఆస్తానా ఫిర్యాదు
- **అక్టోబర్ 15:** హైదరాబాద్ వ్యాపారి సాన సతీశ్‌బాబు ఫిర్యాదు ఆధారంగా ఆస్తానా, డీఎస్పీ దేవేందర్ కుమార్‌పై సీబీఐ కేసు నమోదు
- **అక్టోబర్ 22:** దర్యాప్తు పత్రాలను ఫోర్జరీ చేశారనే ఆరోపణలతో డీఎస్పీ దేవేంద్ర కుమార్‌ను అరెస్టు చేసిన సీబీఐ. ఎఫ్ఐఆర్‌లో ఆస్తానాను 1వ నిందితునిగా, దేవేంద్రకుమార్‌ను 2వ నిందితునిగా పేర్కొంది.
- **అక్టోబర్ 23:** అలోక్‌వర్మ, రాకేశ్ ఆస్తానాలను నిర్బంధ సెలవుపై పంపిన కేంద్రం, సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా మన్నెం నాగేశ్వరరావు నియామకం. ఆ రోజు ఉదయం తమపై ఎఫ్ఐఆర్‌ను సవాలు చేస్తూ ఆస్తానా, దేవేంద్రకుమార్ ఢిల్లీ హైకోర్టులో ఎఫ్ఐఆర్ దాఖలు. దేవేంద్రకు కోర్టు 7 రోజుల కస్టడీ.
- **అక్టోబర్ 24:** తనను నిర్బంధ సెలవుపై పంపడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటషన్ దాఖలు చేసిన అలోక్‌వర్మ.
- **డిసెంబర్ 6:** తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించిన సుప్రీంకోర్టు
- **2019 జనవరి 8:** ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పు పట్టిన సుప్రీంకోర్టు సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మ నియామకాన్ని పునరుద్ధరిస్తూ తీర్పు.

ఇక మోదీ తప్పించుకోలేరు



- అనిల్ అంబానీకి రూ.30వేల కోట్లు దోచి పెట్టారు
- రాఫెల్‌పై సీబీఐ దర్యాప్తు తథ్యం
- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో అవినీతిపై ఇక ప్రధాని మోదీ తప్పించుకోలేరని, ఆయనను ఎవరూ కూడా కాపాడలేరని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చెప్పారు. ఈ ఒప్పందంలో భాగంగా ప్రధాని మోదీ రూ.30వేల కోట్ల ప్రజాధనాన్ని దోచి తన స్నేహితుడైన అనిల్ అంబానీకి పంచాడన్న విషయంలో ప్రజలకు ఏమాత్రం అనుమానం లేదన్నారు. సీబీఐ వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాత ఆయన పార్లమెంట్ బయట విలేకరులతో మాట్లాడుతూ రాఫెల్ యుద్ధ విమానాలపై సీబీఐ దర్యాప్తు చేసే అవకాశముండటంతోనే రాత్రికిరాత్రి అలోక్‌వర్మను బలవంతంగా సెలవుపై పంపారన్నారు. 'అలోక్ వర్మ విషయంలో కేంద్రం తీరు తప్పని సుప్రీంకోర్టు తీర్పుతో అర్థమవుతున్నది. ఇక ప్రధాని మోదీగానీ, ఆయన మంత్రులుగానీ రాఫెల్‌పై దర్యాప్తు నుంచి తప్పించుకోలేరు. ఒకవేళ తప్పించుకుందామన్నా సాధ్యం కాదు. 'రాఫెల్‌పై చర్చ సందర్భంగా ప్రధాని మోదీ తప్పించుకున్నారు. ఈ అంశంపై ఆయన నాతో చర్చించవచ్చు. ప్రజా కోర్టులో చర్చిద్దాం. రాఫెల్‌లో అవినీతి నిజం. దీనిని నుంచి ఎవరూ తప్పించుకోలేరు. అది ప్రధాని మోదీ కానివ్వండి. ఇంకెవరైనా కానివ్వండి' అని తెలిపారు.

ఈబీసీ బిల్లు పాస్

మొదటిపేజీ తరువాయి...
రిజర్వేషన్లు కల్పించాలని ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం సోమవారం నిర్ణయించిన విషయం తెలిసిందే. అందుకనుగుణంగా రాజ్యాంగ బిల్లు (124వ సవరణ)-2019ను కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి తావర్ చంద్ గెహ్లాట్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీనిపై దాదాపు నాలుగున్నర గంటలపాటు చర్చ జరిగింది. అనంతరం చర్చకు తావర్‌చంద్ గెహ్లాట్ సమాధానమిచ్చారు. సుప్రీంకోర్టులో సవాల్ చేస్తే బిల్లు భవితవ్యం ఏమిటని పలువురు ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన సందేహాలకు సమాధానమిస్తూ.. అత్యున్నత న్యాయస్థానం బిల్లుకు ఆమోదం తెలుపుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రభుత్వ విధానం, ఉద్దేశం మంచిదని, అందుకే రాజ్యాంగ సవరణ ద్వారా పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు చెప్పారు. 'మీ అనుమానాలు అసంబద్ధం. వాటికి ముగింపు పలకండి' అని ప్రతిపక్ష సభ్యులకు సూచించారు. చర్చలో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ జోక్యం చేసుకుంటూ, రాజ్యాంగ సవరణ బిల్లుకు రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం అవసరం లేదని చెప్పారు. కుల ఆధారిత రిజర్వేషన్లపైనే సుప్రీంకోర్టు 50 శాతం గరిష్ఠ పరిమితి విధించిందని, తాజా బిల్లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సంబంధించినదని వివరించారు. అయితే తాజా బిల్లును ఎన్నికల జిమ్మిక్కుగా విపక్షాలు విమర్శించాయి. న్యాయ పరిశీలన ముందు ఈ బిల్లు నిలబడగలదా అని అనుమానాలు వ్యక్తం చేశాయి.

లోపాలమయం: విపక్షాలు
అగ్ర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈబీసీ) పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లు లోపాలమయం అని విపక్ష పార్టీలు ఆరోపించాయి. ఈ బిల్లు న్యాయవ్యవస్థ పరిశీలనకు నిలబడకపోవచ్చునని కాంగ్రెస్ పార్టీ సందేహం వ్యక్తం చేసింది. పీవీ నర్సింహారావు ప్రభుత్వ హయాంలో ఆర్థిక ప్రాతిపదికన పది శాతం రిజర్వేషన్ కల్పించడానికి చేసిన ప్రయత్నాలను సుప్రీంకోర్టు కొట్టివేసిందని కాంగ్రెస్ సభ్యుడు కేవీ థామస్ గుర్తు చేశారు. ఆయన లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొంటూ ప్రభుత్వం తొందరపాటుతో చేసిన బిల్లులో పలు లోపాలు ఉన్నాయని, దీన్ని సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) పరిశీలనకు పంపాల్సిందన్నారు. 'ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నిన్న కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం, ఈ రోజు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తీరు ప్రభుత్వ నిజాయితీపై సందేహాలు లేవనెత్తుతున్నది' అని పేర్కొన్నారు. వార్తా పత్రికలు రాసినట్లు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందడానికి అధికార పక్షం చేస్తున్న 'బూటకపు' రాజకీయ వాగ్దానంగా కనిపిస్తున్నదని చెప్పారు. ఏఐఏడీఎంకే సభ్యుడు ఎం తంబిదురై మాట్లాడుతూ ఆర్థిక వెనుకబాటుతనం ప్రాతిపదికన కాక సామాజిక వెనుకబాటుతనం ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించాల్సి ఉన్నదన్నారు. ఇప్పటివరకు ఆర్థికంగా సమాజంలోని పేదల అభ్యున్నతికి ప్రభుత్వం అమలుచేస్తున్న పలు పథకాలు విఫలమైనట్లేనా? అని ప్రశ్నించారు. తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సుదీప్ బందోపాధ్యాయ మాట్లాడుతూ ఉద్యోగాల కోసం ఈ బిల్లు ప్రవేశపెట్టలేదని, యువతను తప్పుదోవ పట్టించడానికేనన్నారు. బూటకపు హామీలు ఎప్పటికీ వాస్తవ రూపం దాల్చబోవని చెప్పారు. ఎన్సీపీ సభ్యురాలు సుప్రియా సూలే మాట్లాడుతూ ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే తమ ప్రభుత్వ హయాంలో జరిగే చివరి పార్లమెంట్ సమావేశాల్లో చివరి రోజున బిల్లును ప్రవేశపెట్టడమేమిటని ప్రశ్నించారు. ఈ బిల్లుకు సుప్రీంకోర్టు ఆమోదం లభించదని కేంద్ర మంత్రి పేర్కొన్న సంగతిని ఆమె గుర్తుచేశారు. బీజేడీ సభ్యుడు భర్తృహరి మెహతాబ్ మాట్లాడుతూ ప్రత్యేక ఎజెండాతో ఈ బిల్లు ప్రవేశపెట్టారని వ్యాఖ్యానించారు. సీపీఎం సభ్యుడు జితేంద్ర చౌదరి మాట్లాడుతూ ఈబీసీలకు పదిశాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం కోరుకుంటున్నదని, కానీ ఉద్యోగాలెక్కడున్నాయి? అని ప్రశ్నించారు. ఎస్పీ సభ్యుడు ధర్మేంద్ర యాదవ్ మాట్లాడుతూ ఈ బిల్లు ఎన్నికల జిమ్మిక్కు అని వ్యాఖ్యానించారు. ఆర్జేడీ సభ్యుడు జైప్రకాశ్ నారాయణ్ యాదవ్ మాట్లాడుతూ అగ్రవర్ణాలను వంచించడానికే ఈ బిల్లును ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఐఎన్ఎల్డీ సభ్యుడు దుష్యంత్ చౌతాలా మాట్లాడుతూ ఈ బిల్లును సుప్రీంకోర్టు అడ్డుకుంటుందన్నారు.


బిల్లు ఆమోదం పొందిన అనంతరం మంత్రి గెహ్లాట్‌ను అభినందిస్తున్న సభ్యులు

లబ్ధి పొందే కులాలు
బ్రాహ్మణులు, రాజపుత్రులు (ఠాకూర్లు), వైశ్యులు, జాట్లు, మరాఠాలు, భూమిహార్లు, కాపు, కమ్మ, రెడ్డి, వెలమ తదితర సామాజికవర్గాలు

రాజ్యాంగాన్ని మోసగించడమే: అసదుద్దీన్ ఒవైసీ

అగ్రకులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈబీసీ)కు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. సర్కార్ ప్రయత్నం రాజ్యాంగాన్ని మోసగించడమేనని పేర్కొన్నారు. రిజర్వేషన్ బిల్లుపై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఒవైసీ పాల్గొంటూ ప్రస్తుతం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుతనం ఆధారంగా మాత్రమే రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. ఆర్థిక వెనుకబాటు తనాన్ని రాజ్యాంగం గుర్తించదని అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. ఈ బిల్లును సుప్రీంకోర్టు అడ్డుకుంటుందని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు.

ఇనేండ్లు ఏం చేశారూ?
'కేంద్ర నిర్ణయం రాజకీయ ప్రేరేపితమైనది. అగ్రవర్ణ పేదలపై నిజంగా ప్రభుత్వానికి ప్రేమ ఉంటే రిజర్వేషన్లు కల్పించడానికి ఇంత కాలం ఎందుకు ఆగినట్లు. కేవలం రాజకీయంగా లబ్ధిపొందడానికే మోదీ సర్కార్ రిజర్వేషన్లను తెరమీదకు తీసుకొచ్చింది'
–ఒమర్ అబ్దుల్లా (జమ్ముకశ్మీర్ మాజీ సీఎం)

నేడు రాజ్యసభలో రిజర్వేషన్ల బిల్లు

రాజ్యసభ కార్యకలాపాలు మంగళవారంతో ముగియాల్సి ఉన్నప్పటికీ అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన బిల్లు కోసం బుధవారం వరకు పొడిగించారు. అయితే ఈ బిల్లును ఆదరాబాదరాగా తీసుకురావల్సిన అవసరం ఏమిటని రాజ్యసభలో ప్రతిపక్షాలు ప్రశ్నించే అవకాశముంది. ఈ నేపథ్యంలో తమ ఎంపీలందరూ బుధవారం సభకు హాజరుకావాలని ప్రతిపక్షాలు సూచించాయి. కాగా, లోక్‌సభలో అన్ని పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపినప్పటికీ రాజ్యసభలో ప్రభుత్వానికి ఎదురీత తప్పదని విశ్లేషకులు తెలిపారు. లోక్‌సభలో ప్రభుత్వానికి మెజారిటీ ఉన్నదని, కానీ రాజ్యసభలో మొత్తం 244 ఎంపీలకుగాను బీజేపీకి 73 మంది మాత్రమే ఉన్నారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు నిలదీసే అవకాశముందని పేర్కొన్నారు. మరోవైపు రాజ్యసభలో మంగళవారం వాయిదాల పర్వం కొనసాగింది. దీంతో సభా కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి. సభా కార్యకలాపాలను బుధవారానికి పొడిస్తున్నట్లు చైర్మన్ వెంకయ్యానాయుడు ప్రకటించారు.

దేశ చరిత్రలో మైలురాయి

ఈబీసీ బిల్లు ఆమోదంపై ప్రధాని మోదీ

అగ్రవర్ణాల్లోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడం దేశ చరిత్రలో ఓ మైలురాయి అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని పార్టీలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కులాలు, మతాలకతీతంగా ప్రతి ఒక్క పేదవాడూ గౌరవప్రదంగా జీవించేలా చూడడం మన బాధ్యత అని ఆయన వ్యాఖ్యానించారు. 'సబ్‌కాసాత్ సబ్‌కా వికాస్'కు తాము కట్టుబడి ఉన్నామన్నారు. బిల్లు ఆమోదం పొందిన అనంతరం ఈమేరకు ఆయన ట్వీట్ చేశారు.

కోటా పరిధిలోకి పలువురు!

- 86 శాతం వ్యవసాయ కుటుంబాలు ఐదెకరాలలోపువే
- గ్రామీణప్రాంతాల్లో దాదాపు అన్ని కుటుంబాలూ
- రూ.8 లక్షల లోపు వార్షికాదాయం ఉన్నవే

న్యూఢిల్లీ: అగ్రవర్ణాలలో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ పది శాతం కోటాకు ప్రభుత్వం అర్హత ప్రాతిపదికను ప్రతిపాదించింది. ఏటా రూ.8 లక్షలకన్నా తక్కువ ఆదాయం ఉన్నవారు, ఐదెకరాల కన్నా తక్కువ వ్యవసాయ భూమి ఉన్నవారు, గ్రామీణ ప్రాంతాల్లో అయితే వెయ్యి గజాల కన్నా తక్కువ స్థలంలో ఇల్లు, నోటిఫైడ్ పురపాలక ప్రాంతంలో 100 గజాలకన్నా తక్కువ, నోటిఫై కాని పురపాలక ప్రాంతంలో 200 గజాల కన్నా తక్కువ స్థలంలో సొంత ఇల్లు ఉన్నవారు ఈ రిజర్వేషన్ సదుపాయం పొందేందుకు అర్హులు. ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబర్‌లో విడుదల చేసిన 2015-16నాటి వ్యవసాయ గణాంకాల ప్రకారం వ్యవసాయ భూములున్న 86 శాతం కుటుంబాలలో పలు కుటుంబాలు ఈ రిజర్వేషన్‌కు అర్హతను పొందనున్నాయి. అంటే దేశంలోని మొత్తం రైతు కుటుంబాల్లో ఐదెకరాల కన్నా తక్కువ వ్యవసాయభూమి ఉన్న కుటుంబాలు 86 శాతం. వీరిలో జనరల్‌కేటగిరీలో ఉన్న వాళ్లు (అగ్రకులాలకు చెందిన కుటుంబాలు) కూడా పలువురు ఉంటారు. వీరికి తాజా రిజర్వేషన్ వర్తించనుంది.

ఐదెకరాల కన్నా తక్కువ వ్యవసాయ భూమి ఉన్నవారు (2015-16 గణాంకాల ప్రకారం)	భూములున్న కుటుంబాలు
సన్నకారు రైతులు (2.5 ఎకరాలకన్నా తక్కువ ఉన్నవారు)	9,98,58,000
చిన్న రైతులు (ఐదెకరాల కన్నా తక్కువ ఉన్నవారు)	2,57,77,000
మొత్తం	12,56,35,000
అన్ని వర్గాల రైతులు	14,57,27,000

రూ.8 లక్షల వార్షికాదాయం ఉన్న (లేదా నెలకు రూ.66,666 సంపాదించే) వారు
ఈ ప్రాతిపదిక ప్రకారం దాదాపు అందరు గృహస్థులు రిజర్వేషన్ పొందేందుకు అర్హులవుతారు. జాతీయ నమూనా సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ) 2011-12 నివేదిక ప్రకారం పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న టాప్ 5 శాతం భారతీయులు కూడా ఈ పరిధిలోకి వస్తారు. గృహ వినియోగ వ్యయం, తలసరి ఆదాయ వినియోగ వ్యయం సూచికల పరంగా చూస్తే.. ఒక కుటుంబంలో ఐదుగురు సంపాదించినా వారి నెలసరి ఆదాయం రూ.66,666 కన్నా తక్కువగానే ఉంటుంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం తలసరి సగటు నెల ఆదాయాన్ని ఈ కింది విధంగా పేర్కొంటున్నారు

	తలసరి ఆదాయం	ఒకరి కన్నా ఎక్కువమంది సంపాదిస్తే వచ్చేఆదాయం			
సంపాదించేవారు		ఇద్దరు	ముగ్గురు	నలుగురు	ఐదుగురు
గ్రామీణ	4,481	8,962	13,443	17,924	22,405
పట్టణ	10,281	20,502	30,843	41,124	51,405

గ్రామీణ ప్రాంతాలలో 99 శాతం మంది ఈ రిజర్వేషన్‌కు అర్హులవుతారు. నాబార్డ్ 2016-17 నివేదిక ప్రకారం గ్రామీణుల ఆదాయం రూ.66,666 కన్నా తక్కువగా ఉన్నది.

అభివృద్ధి లక్ష్యాల సాధనలో పరస్పర సహకారం

భారత్, నార్వే మధ్య ఒప్పందం


నార్వే ప్రధాని ఎర్నా సోల్బర్గ్‌తో ప్రధాని నరేంద్రమోదీ

న్యూఢిల్లీ, జనవరి 8: సముద్ర ఆర్థిక వ్యవస్థతోపాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్డీజీ)ను సాధించడంలో పరస్పరం సహకరించుకోవాలని భారత్, నార్వే అంగీకారానికి వచ్చాయి. ఈ మేరకు అవగాహనా ఒప్పందం (ఎంవోయూ)పై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. భారత్‌లో అధికారిక పర్యటనకు వచ్చిన నార్వే ప్రధాని ఎర్నా సోల్బర్గ్‌తో ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ద్వైపాక్షిక వాణిజ్యంతోపాటు వివిధ అంశాలపై చర్చలు జరిపారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో నూతన మార్గానికి, శక్తికి మార్గం సుగమం అయ్యిందని ప్రధాని మోదీ, నార్వే ప్రధాని సోల్బర్గ్ పేర్కొన్నారు. అంతకుముందు రాష్ట్రపతి భవన్‌లో ఎర్నా సోల్బర్గ్‌కు ఘన స్వాగతం లభించింది. త్రివిధ దళాల నుంచి ఆమె గౌరవ వందనం స్వీకరించారు.

స్టెరిలైట్ ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి మార్గం సుగమం

మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే

న్యూఢిల్లీ, జనవరి 8: తమిళనాడులోని ట్యుటికొరిన్‌లో వేదాంత స్టెరిలైట్ ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి సుప్రీంకోర్టు మార్గం సుగమం చేసింది. ఈ ఫ్యాక్టరీని మూసివేయాలన్న తమిళనాడు ప్రభుత్వ నిర్ణయాన్ని పక్కన బెడుతూ గత నెల 15న జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) జారీ చేసిన ఆదేశాలపై స్టే ఇవ్వడానికి సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. ఫ్యాక్టరీని పునఃప్రారంభించే విషయమై యథాతథ స్థితిని కొనసాగించాలని గతనెల 21న మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ జారీ చేసిన ఆదేశాలపైనా జస్టిస్‌లు ఆర్ఎఫ్ నారిమన్, నవీన్ సిన్హాలతో కూడిన ధర్మాసనం స్టే విధించింది. అయితే స్టెరిలైట్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలన్న ఎన్జీటీకి ఆదేశాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై వైఖరేమిటో తెలియజేయాలని వేదాంతను సుప్రీంకోర్టు ఆదేశించింది.

పాఠశాలలో విద్యార్థులపై మాజీ ఉద్యోగి దాడి

20 మందికి గాయాలు.. చైనాలో ఘటన

బీజింగ్: చైనా రాజధాని బీజింగ్‌లోని ప్రాథమిక పాఠశాల మాజీ ఉద్యోగి ఉన్మాదిగా మారి ఆ పాఠశాల విద్యార్థులపై సుత్తితో కొట్టి దాడి చేయడంతో 20 మంది గాయపడ్డారు. వారిలో ముగ్గురు పరిస్థితి సీరియస్‌గా ఉన్నదని అధికారులు మంగళవారం తెలిపారు. జీచెంగ్ జిల్లాలోని నంబర్ వన్ ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేసిన లియాంగ్ అలియాస్ జాను ఇటీవల తొలిగించారు. దీంతో ఆగ్రహించిన సదరు వ్యక్తి.. విద్యార్థులు వ్యాయామం చేస్తున్నప్పుడు వారి తలపై సుత్తితో మోదాడు. ఈ ఘటన తెలియగానే పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. గాయపడిన విద్యార్థులను దవాఖానలో చేర్చారని సౌత్‌చైనా మార్నింగ్ పోస్ట్ పేర్కొంది.

ఏకపార్టీ కంటే సంకీర్ణ పాలనే మెరుగు

మెహబూబా ముఫ్తీ

శ్రీనగర్: ఏక పార్టీ పాలన కంటే సంకీర్ణ ప్రభుత్వాల హయాంలోనే మెరుగైన ఫలితాలు వచ్చాయని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ అన్నారు. త్వరలో జరిగే జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ ఏర్పాటు కోసం ఏదో ఒక పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఇవ్వాలన్న నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యపై మెహబూబా స్పందిస్తూ పై విధంగా వ్యాఖ్యానించారు. గతంలో ఏకపార్టీగా నేషనల్ కాన్ఫరెన్స్‌కు అనుకూలంగా ప్రజాతీర్పు చెప్పినప్పుడు అధికారాలన్నీ కేంద్రానికి అప్పగించిందని ఆరోపించారు. తన తండ్రి ముఫ్తీ సయీద్ ఆధ్వర్యంలోని సంకీర్ణ ప్రభుత్వం పలు విజయాలు సాధించిందన్నారు.

ముస్లింలకూ రిజర్వేషన్లు కల్పించాలి

అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నది ఎలక్షన్ స్టంట్. అయినప్పటికీ స్వాగతిస్తున్నాం. ఆర్థికంగా వెనుకబాటుకు గురైన ముస్లింలకు, ఇతర మైనారిటీ వర్గాలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కేంద్రానికి లేఖ కూడా రాశాం. కానీ మా డిమాండ్‌ను కేంద్రం పట్టించుకోలేదు.
–మాయావతి (బీఎస్పీ అధ్యక్షురాలు)

అగ్రకులాల పేద యువతకు బహుమతి

రిజర్వేషన్లు అనేవి అగ్రవర్ణ పేద యువతకు మోదీ సర్కార్ అందించిన బహుమతి. వారు తమ జీవితాన్ని ఉన్నతంగా చక్కదిద్దుకోవడానికి గొప్ప అవకాశం. ఈ రిజర్వేషన్ల విషయంలో ఇన్నాళ్లు బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడిన పార్టీలకు ఇదో గుణపాఠం.
–అమిత్ షా (బీజేపీ అధ్యక్షుడు)



సీబీఐ నిష్పాక్షికంగా పనిచేయాలనే విస్తృత ప్రయోజనాల దృష్ట్యా న్యాయస్థానం సీబీఐ డైరెక్టర్‌కు పదవికి భద్రతను కల్పించింది. దీంతో పాటు జవాబుదారీతనాన్ని కూడా కల్పించింది. న్యాయస్థానం సూచనలను ఆచరించాల్సిందే.


అరుణ్ జైట్లీ, కేంద్రమంత్రి

సుప్రీంకోర్టు సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను మళ్లీ నియమించింది అంటే ప్రధానిని తీవ్రంగా అభిశంసించినట్టే. మోదీ ప్రభుత్వం దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటినీ భ్రష్టు పట్టించింది. రాఫెల్ స్కాం దర్యాప్తు ప్రధాని వైపుగా పోతుందనే ఉద్దేశంతోనే దీనిని నిలిపివేయడానికి సీబీఐ డైరెక్టర్‌ను అర్ధరాత్రి తొలిగించారనేది నిజం కాదా?

అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి



చరిత్రలో నేడు



1799

నెపోలియన్‌పై యుద్ధానికి నిధుల కోసం ఆదాయపు పన్నును ప్రవేశపెట్టిన బ్రిటిష్ ప్రధాని విలియం పిట్ ది యంగర్.

1915

దక్షిణాఫ్రికా నుంచి తిరిగివచ్చిన మహాత్మా గాంధీ.





1945

జనరల్ డగ్లస్ మెక్ అర్థర్ నాయకత్వంలో ఫిలిపీన్స్‌పై దాడి చేసిన అమెరికా సైనికులు.

చైనా, అమెరికా ఉప మంత్రిత్వ శాఖ స్థాయిలో వాణిజ్య చర్చలను సోమవారం మొదలుపెట్టాయి. చర్చలు సాగుతుండగానే, అమెరికా క్షిపణి వాహక నౌక ఒకటి దక్షిణ చైనా సముద్రంలోని జిషా దీవుల సమీపానికి వచ్చినట్టు యూరప్ పత్రికలలో వార్త వచ్చింది. చైనా ఆర్థిక శక్తిగా అవతరించడం వల్ల అమెరికా నేతృత్వంలోని ప్రపంచ వ్యవస్థ వణికిపోతున్నది. దానిని సున్నితంగా పరిష్కరించుకోవాలే తప్ప, యుద్ధనౌక ద్వారా బెదిరించడం సాధ్యం కాదు.

గ్లోబల్ టైమ్స్

పాకిస్థాన్‌లో మిలిటెన్సీ ప్రమాదం ఇంకా తొలిగిపోలేదని, దీర్ఘకాలిక పోరాటానికి అనుగుణంగా రూపాంతరం చెందుతున్నదనీ తాజా అధ్యయనంలో వెల్లడైంది. పాకిస్థాన్ శాంతియుత అధ్యయనాల సంస్థ రూపొందించిన 'పాకిస్థాన్ భద్రతా నివేదిక 2018' మిలిటెన్సీకి సంబంధించిన విశేష సమాచారాన్ని అందించింది. 2017తో పోలిస్తే గత ఏడాదిలో ఆత్మాహుతి దాడులు తగ్గాయి. కానీ చిన్న సంస్థలు మరింత ప్రమాదకరంగా తయారయ్యాయి. పాకిస్థాన్ ప్రభుత్వానికి ఈ విషయం తెలుసు. అయితే ఇందుకు ఆఫ్ఘనిస్థాన్ కారణమని అంటున్నది.

డాన్

అశాస్త్రీయ భావజాలం

పంజాబ్‌లోని జలంధర్‌లో 106వ భారత సైన్స్ కాంగ్రెస్ స్ఫూర్తివంతంగా సాగింది. ఈ నెల మూడో తేదీ నుంచి ఏడో తేదీ దాకా ఐదు రోజుల పాటు జరిగిన ఈ సమావేశంలో నూతన ఆవిష్కరణలు, అంకుర భావాల గురించి అర్థవంతమైన చర్చలు జరిగాయి. అయితే ఎప్పటిలాగానే కొందరు వక్తలు వివిధ సందర్భాల్లో శాస్త్ర విజ్ఞానానికి సంబంధించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఆధునిక శాస్త్రవిజ్ఞానానికి మైలురాళ్లుగా చెప్పుకుంటున్న మూలకణ సిద్ధాంతం, ఐన్‌స్టీన్ గురుత్వాకర్షణ, శక్తినిత్యత్వ సూత్రం, డార్విన్ పరిణామ సిద్ధాంతం కన్నా, వేల సంవత్సరాల ముందే వేద కాలం నాడే భారతీయ శాస్త్రవిజ్ఞానం మెండుగా ఉన్నదని చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. ఆంధ్రయూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ స్థానంలో ఉన్న ఒక విద్యాధికుడు నేటి 'స్టెమ్ సెల్' సిద్ధాంతం లాగానే, వేల ఏండ్ల క్రితం కౌరవులు వందమంది మూలకణం నుంచి జన్మించిన వారేనని ఆయన చెప్పుకొచ్చారు. గాంధారి గర్భస్థ కణం నుంచి తీసిన మూలకణం నుంచి విభజనతో వంద మట్టికుండల్లో వాటిని ఫలదీకరణం చెందించి నేటి టెస్ట్‌ట్యూబ్ టెక్నాలజీ వలెనే నాడు వందమందికి జన్మనిచ్చారని భాష్యం చెప్పటంతో విజ్ఞాన శాస్త్ర పాఠం వింటున్న వారంతా విస్తుపోయే పరిస్థితి ఎదురైంది. మరో సందర్భంలో తమిళనాడుకు చెందిన కేజే కృష్ణన్ న్యూటన్‌కు గురుత్వాకర్షణ గురించి మాత్రమే తెలుసు, కానీ గురుత్వ వికర్షణ గురించి తెలియదని చెప్పుకొచ్చాడు. మానవ జీవితంపై అమిత ప్రభావం కలిగించే వికర్షణ శక్తి గురించిన జ్ఞానం తన సొంతమని, ఈ శాస్త్ర విజ్ఞాన శతాబ్దం ఐన్‌స్టీన్‌ది అంటున్నారని, నిజానికి ఈ శతాబ్దం నాదేనని ప్రకటించి అందరినీ ఆశ్చర్యచకితులను చేశాడు.

నేడు చేస్తున్న ప్లాస్టిక్ సర్జరీకన్నా, వేల ఏండ్ల క్రితమే వినాయకునికి ఏనుగు తల అమర్చటం ఎంతో మేలైన ప్రక్రియ అని ప్రధాని మోదీ ఓ సందర్భంలో సెలవిచ్చారు. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు కల్పిత గాథలను శాస్త్ర విజ్ఞానానికి పోటీగా, లేదా దానికి మించినదిగా చెప్పటం విజ్ఞానాన్ని వక్రీకరించటమే. ఇకముందు అశాస్త్రీయమైన ప్రతిపాదనలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని సైన్స్ కాంగ్రెస్ నిర్ణయించడం హర్షణీయం. శాస్త్రీయ భావజాలం, ఆచరణే మానవ వికాసానికి మార్గం అనడంలో ఎటువంటి సందేహాలకు తావు లేదు.

బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు ఇలాంటి పుక్కిటి పురాణగాథలు ఆధారంగా శాస్త్రవిజ్ఞానాన్ని తప్పుదోవ పట్టించేవిధంగా మాట్లాడటం పట్ల తీవ్ర నిరసనలు కూడా వ్యక్తమయ్యాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలోనే పురాణాల ఆధారంగా చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చుతూ సైన్స్ కాంగ్రెస్ నిర్వాహకులు అశాస్త్రీయ వాదనలను తీవ్రంగా ఖండించారు. అలాగే మునుముందు ఇలాంటి ఘటనలు జరుగకుండా వక్తలు ప్రసంగించబోయే విషయాన్ని ముందే పరిశీలిస్తామని వివరించటం, సైన్స్ కాంగ్రెస్‌లో దొర్లిన అపసవ్యాల తీవ్రతను గర్తించటం గమనార్హం. సమకాలీన సామాజిక సమస్యల మూలాలను వెతికి వాటి నిర్మూలన కోసం బాటలు వేయటం లక్ష్యంగా సైన్స్ కాంగ్రెస్‌లో చర్చలు, కార్యశాలలు జరుగాలి. కానీ శాస్త్ర విజ్ఞానం అంటే భౌతిక, రసాయన, గణితశాస్త్రాల సమ్మిళితం మాత్రమేననే విపరీత ధోరణి రాజ్యమేలుతున్నది. వస్తూత్పత్తికి పెద్ద పీట వేసే భౌతిక, రసాయన శాస్త్రాల ఫలితాలు, అభివృద్ధి ఆవిష్కరణలనే సమాజ దిక్సూచిలుగా చెబుతూ సమాజాన్ని వస్తుమయ ప్రపంచంగా మార్చేశారు. పద్దెనిమిదో శతాబ్దంలో ప్రారంభమైన ఈ పోకడ మూలంగా శాస్త్ర విజ్ఞానం పెట్టుబడికి లాభాలు చేకూర్చే సాధనంగా కుచించుకుపోయింది. సామాజిక శాస్త్రాలు కాలం చెల్లినవిగా పరిగణన పొంది, వీటి అధ్యయనం, పరిశోధన అడుగంటింది. ఈ పరిస్థితుల్లోంచే మనిషి జీవనం వస్తూత్పత్తితో ఎంతగా సౌకర్యవంతంగా, సౌఖ్యంగా మారినా సామాజిక హింస, అశాంతి పెచ్చరిల్లుతున్నది. ఇలాంటి సామాజిక పరిస్థితుల్లో సామాజిక విజ్ఞాన శాస్త్రాల పునాదిగా విజ్ఞానాభివృద్ధికి, మానవ వికాసానికి మార్గాలు వేయాలి. ఈ గురుతర బాధ్యతలను మసకబార్చి కట్టుకథలను ప్రామాణికాలుగా చెలామణి చేయాలనే పోకడ మానవాళికే విషాదం.

అజ్ఞానం కన్నా తప్పుదోవపట్టిన జ్ఞానంతోనే పెద్ద ప్రమాదం. గత సైన్స్ కాంగ్రెస్‌లోనూ అశాస్త్రీయ వాదనలు వినిపించాయి. మైసూర్‌లో జరిగిన 103వ సైన్స్ కాంగ్రెస్‌లో ఓ పెద్ద మనిషి పులిచర్మంపై కూర్చొని యోగా చేస్తే వృద్ధాప్యం దరిచేరదని, నవయవ్వన తేజంలో ఎల్లకాలం అలరారవచ్చని చెప్పుకొచ్చాడు. తిరుపతిలో జరిగిన వార్షిక సమావేశాల్లోనూ ఇదేవిధంగా మాట్లాడటంతో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ధోరణి మరింత పెరిగి నేటి శాస్త్ర సాంకేతికరంగ అభివృద్ధి అంతా వేదాల్లోనే ఉన్నదనే దాకా వెళ్లింది. చరిత్రను పునర్లిఖించే పేర మెజార్టీ వాదాన్ని చరిత్ర పుస్తకాల్లో జొప్పించే ప్రయత్నం వేగంగా జరుగుతున్నది. ఆధునిక ఆయుధ సంపత్తి యుగంలో నేటి మిసైల్‌కన్నా ఎంతో శక్తివంతమైనది విష్ణువు ప్రయోగించే విష్ణుచక్రం అని బీజేపీ పెద్దలు ప్రకటించారు. నేడు చేస్తున్న ప్లాస్టిక్ సర్జరీకన్నా, వేల ఏండ్ల క్రితమే వినాయకునికి ఏనుగు తల అమర్చటం ఎంతో మేలైన ప్రక్రియ అని ప్రధాని మోదీ ఓ సందర్భంలో సెలవిచ్చారు. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు కల్పిత గాథలను శాస్త్ర విజ్ఞానానికి పోటీగా, లేదా దానికి మించినదిగా చెప్పటం విజ్ఞానాన్ని వక్రీకరించటమే. ఇకముందు అశాస్త్రీయమైన ప్రతిపాదనలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని సైన్స్ కాంగ్రెస్ నిర్ణయించడం హర్షణీయం. శాస్త్రీయ భావజాలం, ఆచరణే మానవ వికాసానికి మార్గం అనడంలో ఎటువంటి సందేహాలకు తావు లేదు.

జనగళం

అప్రమత్తంగా ఉండాలె

రాష్ట్రంలో చలి తీవ్రతగా మళ్లీ పెరుగుతున్నది. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. స్వైన్‌ఫ్లూ లాంటి వైరస్ బారిన పడకుండా వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలి. సొంత నిర్ణయాలు తీసుకోవద్దని ఇప్పటికే వైద్యులు సూచిస్తున్నారు. స్వైన్‌ఫ్లూ లాంటి లక్షణాలు కనిపిస్తే ఆందోళన పడకుండా వైద్యులను సంప్రదించా లి. అలాగే చుట్టుపక్కల దోమలు లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. అపరిశుభ్రం గా ఉంటే సంబంధిత పారిశుద్ధ్య అధికారుల దృష్టికి తీసుకొని రావాలి. అలాగే అధికారులు ఎప్పటికప్పుడు చెత్తను ఏరివేస్తూ అక్కడ దోమలు, ఈగలు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలి. ప్రజలు కూడా తడి, పొడి చెత్తను వేరుగా వేయాలి. ఎక్కడపడితే అక్కడ చెత్తవేయకుండా పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలి.

- తాళ్లపెల్లి మనోజ్‌గౌడ్, మలక్‌పేట్, హైదరాబాద్

ప్రాథమిక విద్య బలోపేతం

ఈ మధ్య పిల్లలకు చదువడం, రాయడం రావడం లేదనే వార్తలు వస్తున్నాయి. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలోనే పిల్లలకు పటిష్ట పునాది వేయాలి. దీనికోసం మూడవ తరగతికి వచ్చేసరికి పిల్లలకు ఎక్కాలు, చదువడం, రాయడం వచ్చేలా చూడాలి. అప్పుడే పిల్లలకు పై తరగతుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. విద్యాశాఖ ఈ దిశగా ఆలోచన చేయాలి.

- పి.శంకర్, హైదరాబాద్

చరిత్రాత్మక విజయం

ఏడు దశాబ్దాల కల నెరవేరింది. కోహ్లీ నేతృత్వంలోని యువ ఆటగాళ్లు గవాస్కర్–బోర్డర్ ట్రోఫీని గెలిచి భారత్‌కు చరిత్రాత్మక విజయాన్ని సాధించిపెట్టారు. ఈ సిరీస్‌లో భారత జట్టు ఆటగాళ్లు బౌలింగ్, బ్యాటింగ్‌లో మెరుగైన ఆటను ప్రదర్శించారు. అందుకే ఈ విజయం దక్కింది. మునుముందు కూడా ఇదే ఆట తీరును కనబరుచాలి. వచ్చే ప్రపంచకప్‌ను మరోసారి భారత్‌కు అందించేలా కృషి చేయాలి.

- జి.నర్సింహా, సంగారెడ్డి

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

తెలంగాణం



గొంగిడి సునీత

'రైతు బంధు'వు కేసీఆర్

రైతుబంధు పథకం ద్వారా రైతు తనకు కావల సిన పెట్టుపడి కోసం బ్యాంకులు లేదా వడ్డీ వ్యాపారస్తుల మీద ఆధార పడాల్సిన అవసరం ఉండదు. వడ్డీల భారం ఉండదు. ముఖ్యంగా రైతు కు మానసిక ఒత్తిడి దూరమయ్యే అవకాశం ఉన్నది. తద్వారా రైతు తన సాగు ఎటువంటి ఒత్తిడి లేకుండా చేసుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ ప్రకృతి విపత్తుల వల్ల పంట ఎండిపోయినా లేక మద్దతు ధర రాక పోయినా రైతు మీద భారం పడదు.

నకిలీ విత్తనాలను నమ్మి మోస పోవ డం.. చేతికి పంట రాక.. పెట్టుబడికి చేసిన అప్పు కట్టలేక.. కుటుంబ పాలన సమస్యగా మారిన రైతులకు ఉమ్మడి రాష్ట్రంలో ఆత్మహత్యే శరణ్యమైంది. కొద్దో గొప్పో చేతికి వచ్చి న పంటకు గిట్టుబాటు ధర లేక విలవిల్లాడిన రైతు కండ్లల్లో ఇప్పుడు మార్పు చూస్తున్నాం. ఓ వైపు సాగు నీళ్లు, మరో వైపు నిరంతర విద్యుత్. ఒకప్పుడు జీవితంపై ఆశ వదులుకున్న రైతు, నేడు గుండె నిండా ధైర్యంతో వ్యవసాయం చేసుకుంటున్నడు. ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా రైతు , రైతు కష్టాలు తెలిసిన నాయకుడు. అందుకే దేశంలో ఎక్కడాలేని విధంగా కొత్త తరహా రైతు పథకాలు ప్రవేశ పెట్టి రైతుల ఆదాయం పెంచే దిశగా అడుగులు వేస్తున్నరు. ఈ గుణాత్మక మార్పులతో రైతులకు భరోసా ఇస్తు న్నది తెలంగాణ రాష్ట్రం.

నేను పది నెలల కిందట రాజాపేటలో ఓ ఊరికి వెళ్తున్నాను. బొందుగుల గ్రామం వద్ద ఓ రైతును చూసి కారు ఆపాను. అతని దగ్గరికి వెళ్లి నేనెవరో తెలుసా అని అడిగాను. మీరు గొంగిడి సునితమ్మ కదా అన్నాడు. ఇలా మా ఇద్దరి మధ్య పది నిమిషాల సంభాషణ జరిగింది. ఆ రైతు పేరు యాదగిరి. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బంధు పథకం కింద పెట్టుబడి సాయం ఎలా అందించాలో రైతుల అభిప్రాయం సేకరిస్తున్నాను. మీ అభిప్రాయం చెప్పండి అని యాదగిరిని అడిగాను. యాదగిరి ఇచ్చిన సమాధానం నన్ను ఆకట్టుకున్నది.

'ఆరెకరాల భూమి ఉన్న నేనే 8 ఏండ్ల కిందట వ్యవసాయం మానేసి హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో కూలీ పనులకు వెళ్తున్నాను. నా భార్య ఇండ్లల్లో పాచి పనిచేస్తున్నది. ఊర్ల చేసిన అప్పులన్నీ మెల్లమెల్లగా తీరుస్తున్నా. తెలంగాణ వచ్చినంక, కేసీఆర్ సార్ ముఖ్యమంత్రి అయినంక నీళ్లు వస్తున్నయని, 24 గంటల కరెంటు వస్తున్నదని, రైతు బంధు పథకం కింద పెట్టుబడి సాయం ఇస్తున్నరని తెలిసి ఇప్పుడు ఊరి బాట పట్టిన. 8 ఏండ్ల కింద ఇడిసిపెట్టిన ఎవుసం మళ్లీ షురూ జేస్తున్నా...'

యాదగిరి మాటల్లో ధైర్యం, గర్వం కనిపించింది, ఇక వ్యవసాయం పండుగ అయితదని సీఎం కేసీఆర్ చెప్పిన మాట యాదికివచ్చింది. అప్పు లు కట్టలేక ఉరితాడు వేలాడిన రైతు ఇప్పుడు ధైర్యం హలం పట్టి ముందుకు కదులుతున్నడు. రైతులకు దగ్గర కావాలన్న తపనతో ప్రభుత్వం రైతుల్లో నూతన ఒరవడిని కలిపించింది. తెలంగాణ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిన తర్వాత దేశంలోని కొన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాయి. దేశవ్యాప్తంగా రైతు రుణమాఫీపై చర్చ మొదలైంది. దీంతో పాటు వ్యవసాయ సంక్షోభాన్ని గట్టెక్కించడమెట్లా అనే చర్చ కూడా జరుగుతున్నది. రుణమాఫీ వల్ల రైతులకు ప్రయోజనం జరుగదని వాదిస్తున్నవారు కూడా తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతుబంధు వంటి పథకాలను ప్రశంసించడం గమనార్హం. పైగా వారు రుణమాఫీని వద్దంటూనే, వ్యవసాయ సంక్షోభ నివారణకు ఏ సూచనలు చేస్తున్నారో, వాటిని తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తుండటం కూడా గమనించవలసిన విషయం.

రైతు రుణమాఫీని విడిగా చూడకుండా, సమగ్ర వ్యవసాయ వ్యూహంలో భాగంగా చూసినవారికి దాని ప్రాధాన్యం అర్థమవుతుంది. ఇప్పటి వరకు జరిగిన రుణమాఫీలు, ఇప్పుడు కొన్నిఇతర రాష్ట్రాలు ప్రకటించిన రుణమాఫీలతో పోలిస్తే, తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న రుణమాఫీ స్వభావరీత్యా భిన్నమైంది. మిగితా నాయకుల మాదిరిగా ఓట్ల కోసం అనుసరించే ఉపశమనంగా కాకుండా వ్యవసాయ సంక్షోభ నివారణలో భాగంగా సీఎం కేసీఆర్ రుణమాఫీ పథకాన్ని ప్రవేశపెట్టడం వల్ల ఈ పథకం రైతులకు ఉపయోగకరంగా మారుతున్నది. జాతీయస్థాయి రాజకీయాల్లో కొత్త ఒరవడి ప్రవేశపెట్టాలని భావిస్తున్న కేసీఆర్‌కు వ్యవసాయ రంగంలో తాను సూచించే పరిష్కారాలకు తెలంగాణ నమూనా ఉపయుక్తంగా ఉంటుంది.

ఆర్థికవేత్తలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తమ పరిధిలోనే ఆలోచిస్తారు. కానీ పరిపాలకులు మొత్తం సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని పరిష్కా రాలు అన్వేషిస్తారు. కేసీఆర్ వ్యవసాయరంగ వ్యూహం ఈ విధంగా రూపొందినదే. పంటకు పెట్టుబడి లేక, నీటి వసతి లేక, కరెంటు లేక, గిట్టుబాటు ధర రాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. యాంత్రీకరణ జరుగడం లేదు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వ్యవసాయరంగ సంస్కరణలు అమలు జరుగడం లేదు. వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రోత్సాహం అందడం లేదు. వీటన్నిటి పరిష్కారం కోసం మన కేసీఆర్ సార్ తెలంగాణను నమూనాగా నిలబట్టేందుకు ముందుకుపోతుండు. రైతులకు అవసరమైన నీటి వసతి, విద్యుత్, పెట్టుబడి, యంత్రాలు, గిడ్డంగులు, మార్కెట్ సౌకర్యం, పంటకు మద్దతు ధర మొదలైనవి అందించడంతోపాటు, రైతు సమన్వయ సమితిల ఏర్పాటు ద్వారా పంట వేయడం మొదలుకొని మార్కెటింగ్ వరకు పకడ్బందీ వ్యవస్థ నిర్మాణం సాగుతున్నది.

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే రైతులకు 17వేల కోట్లతో రుణమాఫీ చేశారు. నీలం, పైలాస్ తుఫాన్లతో వచ్చిన నష్టం వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులకు 480 కోట్లతో ఇన్‌పుట్ సబ్సిడీని అందజేశారు. వ్యవసాయ క్షేత్రంలో మంచి చెడులను చర్చించుకొని, అధికారుల సలహాలతో ముందుకు కదిలేందుకు రైతు వేదికలను ఏర్పాటుచేసి ప్రతి 5 వేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తర ణాధికారిని నియమించారు. ప్రతి 5 వేల ఎకరాలకు రైతు వేదిక ఏర్పాటు చేశారు. ఒక్కో వేదిక కోసం 12 లక్షలతో భవనాన్ని నిర్మించడమే కాకుండా నూతన టెక్నాలజీని రైతులకు ఎప్పటికప్పుడు అందించడానికి కంప్యూట ర్లు, ఆన్‌లైన్ సిస్టమ్‌లు ఏర్పాటుచేశారు. మట్టి నమూనాలను పరీక్షించేం దుకు ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి తెచ్చారు. మట్టి లో సారాన్ని పరీక్షించి రైతుకు అవగాహన కల్పించడమే కాకుండా అందులో డీఏపీ, యూరియా, ఎంతవరకు వాడాలి, నీరు ఎంత పెట్టాలి, ఆ మట్టి లో ఏ పంట వేయాలని రైతులకు సూచనలు ఇచ్చే కేంద్రంగా మలుస్తు న్నారు.

ఏ వస్తువు కొనాలన్నా ఉత్పత్తిదారుడికే వస్తువు ధర నిర్ణయించే హక్కు, అధికారం ఉన్నా, రైతుకు మాత్రం తాను పండించిన పంటకు ధరను నిర్ణయించి అమ్ముకునే పరిస్థితి లేదు. ధరను నిర్ణయించే హక్కును రైతులకు ఇవ్వాలన్నదే కేసీఆర్ సంకల్పం. అవసరమైన చోట శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ వ్యవసాయ పనిముట్లు కూడా అందించి పంట కాలనీలను ఏర్పాటుచేయడం జరుగుతున్నది. రైతన్న ఏ పంట వేసుకున్నా ఆ పంటకు డిమాండ్ తగ్గకుండా చేయాలని కేసీఆర్ సంక ల్పించారు. భవిష్యత్‌లో గిట్టుబాటు ధర గోస రైతులకు ఉండకూడదనే వినూత్నమైన పద్ధతిలో పంట కాలనీలు ఏర్పాటుచేసి గ్రామాల వారీగా వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేయనున్నారు. తద్వారా ధరలను నియంత్రించడం కోసం పంట కాలనీలు ప్రవేశ పెట్టాలన్నదే కేసీఆర్ ఆలోచన.

కేసీఆర్ గారితో చర్చిస్తున్నప్పుడు వింటుంటే గర్వంగా అనిపిస్తది. అన్నం పెట్టే రైతన్నను ఆదుకోవడానికి ఎవరు ఊహించని పథకం తీసుకొచ్చారు. అన్నం పెట్టే రైతన్నకు సున్నం పెట్టి నకిలీ విత్తనాలు, ఎరువులు ఎవరైన వ్యాపారస్తులు విక్రయిస్తే 6 నెలల జైలుశిక్ష వేసి కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. రైతుబంధు పథకం వల్ల రైతు తనకు కావల సిన పెట్టుపడి కోసం బ్యాంకులు లేదా వడ్డీ వ్యాపారస్తుల మీద ఆధార పడాల్సిన అవసరం ఉండదు. వడ్డీల భారం ఉండదు. ముఖ్యంగా రైతుకు మానసిక ఒత్తిడి దూరమయ్యే అవకాశం ఉన్నది. తద్వారా రైతు తన సాగు ఎటువంటి ఒత్తిడి లేకుండా చేసుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ ప్రకృతి విపత్తుల వల్ల పంట ఎండిపోయినా లేక మద్దతు ధర రాక పోయినా రైతు మీద భారం పడదు. అలాగే రైతుల ఆత్మహత్యలు ఉండవు.

రైతులను సంపన్నులను చేసి అంతిమంగా అప్పులు లేని దశకు తీసుకపోవడమే ముఖ్యమంత్రి కేసీఆర్ గారి అంతిమ లక్ష్యం. వ్యవసాయం ఒక పండుగ కావాలని ఆయన లక్ష్యం. రైతే రాజు కావాలనేది ఆయన సంకల్పం. ఒక రైతే పాలకుడిగా అధికారం చేపడితే రైతు సంక్షేమం కోసం ఏమైతే చేయగలరో అదంతా సీఎం కేసీఆర్ ఇప్పుడు తెలంగాణలో అమలు చేస్తున్నారు. రైతు సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శం గా నిలుస్తుందనటంలో సందేహం లేదు.


అన్నం పెట్టే రైతు దేవుడితో సమానం అనేది కేసీఆర్ అభిప్రాయం. ఆరుగాలం కష్ట పడి పంటను పండించి మనకు అన్నం పెట్టి రైతు కాలం చేస్తే వారి కుటుంబం ఆనాథ అయితది. ఆ కుటుంబాలను ఆదుకుంటే కొంతైన బాధతీర్చగలమని కేసీఆర్ చేసిన ఆలోచనే రైతు బీమా. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రతి రైతు పేరిట ప్రతి ఏటా రూ.2271 చెల్లిస్తున్నారు. రైతు దూరమైతే వారం రోజుల్లో ఆ కుటుంబానికి 5 లక్షల రూపాయల బీమాను అందేలా కేసీఆర్ చర్యలు తీసుకున్నారు.

రైతులను సంపన్నులను చేసి అంతిమంగా అప్పులు లేని దశకు తీసుకపోవడమే ముఖ్యమంత్రి కేసీఆర్ గారి అంతిమ లక్ష్యం. వ్యవసాయం ఒక పండుగ కావాలని ఆయన లక్ష్యం. రైతే రాజు కావాలనేది ఆయన సంకల్పం. ఒక రైతే పాలకుడిగా అధికారం చేపడితే రైతు సంక్షేమం కోసం ఏమైతే చేయగలరో అదంతా సీఎం కేసీఆర్ ఇప్పుడు తెలంగాణలో అమలు చేస్తున్నారు. రైతు సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శం గా నిలుస్తుందనటంలో సందేహం లేదు.

(వ్యాసకర్త: ఎమ్మెల్యే, ఆలేరు)

నుమాయిష్ హైదరాబాద్ జిందగీ

విశ్లేషణ



బుద్దా మురళి

కార్ఖానా జిందా తిలస్మాత్ ఉర్దూలో గంభీరంగా ఆ స్వరం వినిపించగానే ఒక్కసారిగా బాల్యం కళ్లముందు మెదులుతుంది. ఘంటసాల స్వరం ఎలా ప్రత్యేకమైందో నుమాయిష్‌లో ఉర్దూ లో వినిపించే ఆ గంభీరమైన స్వరం అలా ప్రత్యేకమైంది. ఆ స్వరం వినిపించకపోతే అది నుమాయిషే కాదు అనుకునేంత ప్రత్యేక ఆకర్షణ ఆ స్వరం. కాలంతో పాటే నుమాయిష్ రూపం మారుతున్నది. స్వరం మారుతున్నది. గతేడాది నుమాయిష్‌కు వెళ్లినప్పుడు ఆ ఉర్దూ స్వరానికి బదులు తెలుగు సినిమాల పాటలు వినిపించాయి. వేల మంది మహిళలు బుర్ఖాలో కనిపించే అపురూప దృశ్యం ఒక్క నుమాయిష్‌కే పరిమితం కావచ్చు. ఢిల్లీ ప్రగతి మైదాన్‌లో జరిగే ఎగ్జిబిషన్ అతిపెద్దది కావచ్చు కానీ, దాని చరిత్ర తక్కువే 72లో ఇందిరాగాంధీ హయంలో ప్రారంభమైంది. నుమాయిష్ మాత్రం 1938లో 78 ఏండ్ల క్రితం అప్పటి నిజాం ప్రభుత్వం ప్రారంభించింది. 78 ఏండ్ల క్రితమే హైదరాబాద్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి, ఇక్కడి ఉత్పత్తులకు ప్రచారం కల్పించాలనే ఆలోచన అద్భుతం.

వేలాది మంది జనం, వందలాది స్టాల్స్, లక్షలాది రూపాయల కొనుగోళ్ల అమ్మకాలతో సందడి. హైదరాబాద్ పారిశ్రామిక ప్రదర్శనలో సందడే సందడి. గతేడాది 22 లక్షల మంది సందర్శించారు. మెట్రో రైలు సౌకర్యం వల్ల ఈసారి అంతకన్నా ఎక్కువమందే వస్తారని అంచనా. హైదరాబాద్ నుమాయిష్ అంటే అంతేనా? ఆరువారాల పాటు ఏర్పడే తాత్కాలిక మార్కెటేనా? కాదు అంతకన్నా చాలా ఎక్కువ. నుమాయిష్ హైదరాబాద్ జిందగీ. ఇప్పుడు ప్రపంచమే ఒక మార్కెట్. అమ్మకాలు కొనుగోళ్ల లెక్కలే తప్ప మానవత్వం, అనుబంధాలు కనిపించని మార్కెట్. అరచేతిలోనే ఇప్పుడు ప్రపంచ మార్కెట్ నిక్షిప్తమైంది. ప్రపంచంలో ఎక్కడి వస్తువునైనా ఇప్పుడు అరచేతిలో స్మార్ట్‌ఫోన్‌తో కొనేయవచ్చు. ఒకప్పుడు హైదరాబాద్‌లో షాపింగ్ అంటే అబిడ్స్‌కు వెళ్లాలి. ఇప్పుడు దిల్‌సుఖ్‌నగర్, కొంపల్లి, కూకట్‌పల్లి, ఉప్పల్ అటు ఇటూ అని కాదు నగరానికి నాలుగు వైపులా అంతటా కిక్కిరిసిన మార్కెట్లే. అబిడ్స్‌ను మించిన బిజీ షాపింగ్ సెంటర్లే. నుమాయిష్ ఒక మార్కెట్ కాదు. హైదరాబాదీలు జీవితంలో ఒక భాగం, మధురమైన జ్ఞాపకం. తండ్రి చేతులు పట్టుకొని ఓ వింత ప్రపంచాన్ని చూసిన అనుభూతి. తల్లి భుజాలపై ఎక్కి ఆనందపు అంచులు చూసిన జీవితం.

ఇప్పుడు నుమాయిష్ తీరే మారిపోయింది. నుమాయిష్ అంటే ఇప్పుడు బోలెడు షాప్స్, బోలెడు షాపింగ్ అంతే.. నుమాయిష్ అంటే అంతే నా? కాదు అంతే కాదు ఇంకా ఎంతో? హైదరాబాద్‌ను నేనే నిర్మించాను, ఆధునిక తెలంగాణ నిర్మాతను నేనే అని ఆంధ్రా పాలకులు నేటికీ ప్రచారం చేసుకొంటున్నా.. అలా ప్రచారం చేసుకొనే చంద్రబాబు పుట్టడానికి 12 ఏండ్ల ముందు 1938లోనే హైదరాబాద్ నగరంలో పారిశ్రామికాభివృద్ధి కోసం, ఇక్కడి ఉత్పత్తులకు ప్రచారం కల్పించడం కోసం నిజాం ప్రభువు లు నుమాయిష్‌ను ప్రారంభించారు. గోలకొండ పత్రికలో 1941 జనవరి 6న నుమాయిష్ గురించి వచ్చిన ఒక వార్తను చూస్తే ఆనాటి కాలంలోనే హైదరాబాద్‌లో పారిశ్రామికాభివృద్ధికి ఎంత ప్రాధాన్యం ఇచ్చారో అర్థమ వుతుంది.

ఈ మూడవ ప్రదర్శనను నిజాం ప్రభువు గారి ఆజ్ఞానుసారం ప్రధాన మంత్రి సర్ అక్బర్ హైదర్‌గారు కావించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం ప్రభువు పదహారు అణాల ముల్కీలు. నిజాం ప్రభువు ఒకసారి తాము తమ దేవిడీలో గోలకొండ సబ్బునే వాడుచున్నామని సెలవిచ్చిరి. అధికారులు అందరూ అదేవిధంగా దానిని వాడి తమ అధికార స్థానాల్లోని అందరికి దాని ప్రాముఖ్యాన్ని నచ్చజెప్పి యుండిన గోలకొండ సబ్బులెందుకు మాయమైయుండును.

ఈ రాష్ట్రంలో ఎన్నో పరిశ్రమలు బహు ప్రాచీనమైనవి కలవు. ఎన్నో కొత్తవి స్థాపించారు. పరిశ్రమలకు తగిన ప్రోత్సాహం, ప్రకటన సౌకర్యాలు లేవు. ప్రభుత్వం వారు వీలైనంతవరకు ద్రవ్య సహాయం చేయుచున్నారు. కానీ, ధనికులు తమ ద్రవ్యాన్ని పరిశ్రమల్లో వినియోగించుట లేదు. వడ్డీ సాగులలో, కౌలు ఖబులియతులలో ఎంత లాభమున్నదో అంత లాభం పరిశ్రమల్లో లేదని ధనికుల అభిప్రాయం.


మన రాష్ట్రంలోని పట్టు జలతారు నేతవారును, బంగారు వెండి పనులవారును, తివాసీల వారును, బ్రష్షులు, అద్దములు చేయువారు ,, గుండీలు, సబ్బులు బిస్కట్లు మున్నగునవి చేయువారు తమ తమ వస్తువులను ప్రదర్శించాలి. ఆంధ్ర మహాసభ వారు తెలంగా ణ పరిశ్రమల పట్టికను జిల్లాల నుంచి తెప్పించి వాటి వివరాలతో ఒక లఘు పట్టిక ప్రచురించాలి . (ఇది 194 1 జనవరి 6న గోలకొండలో వచ్చిన ఆనాటి నుమాయిష్ వార్త)

75 ఏండ్ల కిందట నాటి ఈ వార్తను చదివితే నుమాయిష్ ఉద్దేశం, లక్ష్యం, ఆ తరానికి తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధిపై ఉన్న అభిమానం తెలుస్తుంది. దాదాపు 80 వరకు నుమాయిష్‌లో పారిశ్రామికాభివృద్ధి ఏ విధంగా సాగుతుందో తెలిపేవిధంగా ఉండేది. వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక వ్యవసాయ పనిముట్లను ప్రత్యేకంగా ప్రదర్శనకు ఉంచేవారు. దీనివల్ల అన్ని ప్రాంతాల రైతులకు వ్యవసాయంలో వస్తున్న మార్పులు తెలిసేవి. హైదరాబాద్ ఐటీ రంగంలో దూసుకెళ్తుంది. కేవలం ఉద్యోగులుగానే ఉండిపోకుండా తెలంగాణ యువత స్టార్టప్ కంపెనీల ద్వారా ఎదుగాలని ప్రభుత్వం టీ–హబ్ ఏర్పాటుచేసింది. ఇదే తరహాలో తెలంగాణ యువత పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేవిధంగా, వారికీ అవగాహన కలిగించేవిధంగా నుమాయిష్ ప్రారంభమైంది. అన్నీ మారుతాయి. మన కోసం ఏదీ ఆగదు, అలానే ఉండిపోదు. నుమాయిష్ అంటే ఒకప్పుడు అక్కడున్న సినిమా తారల బొమ్మలపై చేతులు వేసి నిజంగా వారి భుజాలపై చేతులు వేసి ఫొటోలు దిగినట్టు మురిసిపోయేవారు. పాత తరం హైదరాబాద్ వారందరికీ ఇలాంటి జ్ఞాపకాలుంటాయి. ఇప్పుడు అరచేతిలో స్మార్ట్ ఫోన్లో కెమెరానే కాదు ప్రపంచం అంతా ఉంటుంది. ఇప్పుడు అలా ఫొటోలు దిగడం కనిపించక పోవచ్చు. కానీ యువతను పారిశ్రామికులుగా మార్చడానికి, ఒక ఆలోచ న కలిగించడానికి నుమాయిష్‌ను వాడుకోలేమా?

నుమాయిష్ అంటే ఒకప్పుడు అక్కడున్న సినిమా తారల బొమ్మలపై చేతులు వేసి నిజంగా వారి భుజాలపై చేతులు వేసి ఫొటోలు దిగినట్టు మురిసిపోయేవారు. పాత తరం హైదరాబాద్ వారందరికీ ఇలాంటి జ్ఞాపకాలుంటాయి. ఇప్పుడు అరచేతిలో స్మార్ట్ ఫోన్లో కెమెరానే కాదు ప్రపంచం అంతా ఉంటుంది. ఇప్పుడు అలా ఫొటోలు దిగడం కనిపించక పోవచ్చు. కానీ యువతను పారిశ్రామికులుగా మార్చడానికి, ఒక ఆలోచ న కలిగించడానికి నుమాయిష్‌ను వాడుకోలేమా?

(వ్యాసకర్త: రాష్ట్ర సమాచార కమిషనర్)

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. **Editor: Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



ఏఎమ్మార్పీ నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు (ఇన్‌సెట్‌లో) వరద కాల్వకు నీటిని విడుదల చేస్తున్న ఈఈ శ్రీనివాస్‌రెడ్డి

వరద కాల్వకు నీటి విడుదల

పెద్దవూర: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి నల్లగొండ జిల్లా ప్రజల తాగునీటి అవసరాల కోసం ఏఎమ్మార్పీ లోలెవల్ కెనాల్ (వరద కాల్వ)కు మంగళవారం నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు ఈఈ శ్రీనివాస్ రెడ్డి స్విచ్ ఆన్ చేసి నీటి విడుదలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ కేవలం తాగునీటి అవసరాల కోసం చెరువులను నింపడానికే నీటిని విడుదల చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీఈ రమేశ్, ఏఈ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంలో ఆల్‌టైం రికార్డ్



వరంగల్ నిట్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

వరంగల్‌లో విద్యార్థుల భారీ ర్యాలీ

నిట్‌లో ఉత్సాహంగా యూత్‌ఫెస్ట్

నిట్‌క్యాంపస్(వరంగల్): వరంగల్‌లోని జాతీయ సాంకేతిక విద్యా సంస్థ(నిట్)లో యువజనోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం విద్యార్థులు నిట్ ప్రధాన భవనం నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీని నిట్ డైరెక్టర్ ఎన్వీ రమణారావు ప్రారంభించారు. అనంతరం నిట్ ఆవరణలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. నిట్ స్టూడెంట్ కౌన్సిల్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంయుక్తంగా ఇండియన్ రెడ్ క్రాస్ సౌజన్యంతో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో వెయ్యిమందికిపైగా విద్యార్థులు పాల్గొని 1,124 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ ఏడాదిలో దేశంలో ఇదే ఆల్‌టైం రికార్డుగా అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడాన్ని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ ప్రశంసించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఈవీ శ్రీనివాస్ రావు, స్టూడెంట్ కౌన్సిల్ సెక్రటరీ ప్రశాంత్ రాంశెట్టి, స్టూడెంట్ డీన్ ఎల్ఆర్‌జీ రెడ్డి, రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీశ్‌రాజ్, కాకతీయ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య పాల్గొన్నారు.

ప్రగతికే ఓటు..



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని కమ్మరిపేట తండాలో ఏకగ్రీవంగా ఎన్నుకున్న సర్పంచ్, ఉపసర్పంచ్‌తో తండావాసులు

అభివృద్ధి కోసం ప్రోత్సాహకాల వైపు

పంచాయతీల ఏకగ్రీవానికే జనం పట్టు

జోరుగా సాగుతున్న పాలకవర్గాల ఎంపిక తీర్మానాలు

గ్రామ స్వరాజ్యం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గ్రామాలను అభివృద్ధి బాట పట్టించాలనే లక్ష్యంతో ప్రజలు ముందుకు సాగుతున్నారు. అందుకోసం పంచాయతీ ఎన్నికల్లో పాలక వర్గాలను ఏకగ్రీవం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. ఎక్కడికక్కడ గ్రామస్థులు సమావేశమై అంకిత భావంతో పనిచేసి గ్రామాన్ని అభివృద్ధి చేస్తారనుకునే వారిని ఎంపికచేసి ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారు. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రభుత్వ ప్రోత్సాహకంతోపాటు ఎమ్మెల్యేలు ఇచ్చే అదనపు నజరానాలు దక్కించుకుని తమ పల్లెలను అభివృద్ధి చేసుకోవాలని భావిస్తున్నారు. ఇందు కోసం మంగళవారం కూడా పెద్ద ఎత్తున ఏకగ్రీవంగా తమ పాలక వర్గాలను ఎన్నుకున్నారు. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం భరిణెపాడు సర్పంచ్‌గా మందపాటి సునీతారెడ్డిని గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలో పద్మన్నపల్లి సర్పంచ్‌గా నేనావత్ దేవి, ఉపసర్పంచ్‌గా తిర్పతమ్మ, వార్డు సభ్యులుగా శంకర్, శ్రీనివాసులు, ద్వాళి, హతీరాం, లత, రామస్వామి, శాంతి, చారకొండ మండలం కమాల్‌పూర్ సర్పంచ్‌గా సుజాత, ఉపసర్పంచ్‌గా కేతావత్ డాకులు, 8మంది వార్డు సభ్యులను ఎన్నుకున్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం అంతాయపల్లి సర్పంచ్‌గా కవిత, కోతులకుంట తండా సర్పంచ్‌గా శ్రీనివాసులు, ఆముదంబండతండా సర్పంచ్‌గా మణిని ఆయా గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలో నూతనంగా ఏర్పాటైన శివతండా సర్పంచ్‌గా అంబర్‌సింగ్‌ను ఎన్నుకున్నారు. 8 మంది వార్డు మెంబర్లను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని కమ్మరిపేట తండా సర్పంచ్‌గా మాలోతు సూర్య, ఉప సర్పంచ్‌గా బానోతు రాజు, చందుర్తి మండలం కొత్తపేట సర్పంచ్‌గా భూక్య పంతులు, ఉప సర్పంచ్‌గా గుగులోత్ సునీతను ఆయా గ్రామాల వారు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం ఆడెపల్లి సర్పంచ్‌తోపాటు ఉపసర్పంచ్, 8మంది వార్డు సభ్యులను ఏకగ్రీవం చేస్తూ గ్రామస్థులు తీర్మానించారు. సర్పంచ్‌గా అన్నం చీకటి, ఉపసర్పంచ్‌గా సంతోష్‌గౌడ్ ఎన్నికయ్యారు. గతంలో డబ్బా గ్రామ పంచాయతీ అనుసంధానంగా ఉన్న ఈ గ్రామం ఇటీవలే కొత్తగా పంచాయతీగా ఏర్పడింది. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని వెంకటాపూర్ సర్పంచ్‌గా సభావత్ జగ్ని, ఉపసర్పంచ్‌గా శత్రునాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆదిలాబాద్‌లో జోరుగా..

ఆదిలాబాద్ జిల్లాలో ఏకగ్రీవాల జోరు కొనసాగుతున్నది. సిరికొండ మండలంలో కొత్తగా ఏర్పడిన లచ్చింపూర్ (బి), కొండాపూర్, ఇచ్చోడ మండలం బాబ్జీపేట్, బోథ్ మండలం నాగాపూర్ పంచాయతీ పాలకవర్గాలను ఏక్రగీవంగా ఎన్నుకున్నారు. లచ్చింపూర్(బి) సర్పంచ్‌గా పెందూర్ నర్మద, కొండాపూర్ సర్పంచ్‌గా సిడాం అర్చన, బాబ్జీపేట్ సర్పంచ్‌గా లక్ష్మి, ఉపసర్పంచ్‌గా మోహన్‌ను ఎన్నుకున్నారు. బోథ్ మండలం నాగాపూర్ సర్పంచ్‌గా కోవ సుమిత్ర, ఉప సర్పంచ్‌గా పవార్ బలిరాంతోపాటు వార్డు సభ్యులను ఎన్నుకున్నారు.

ఏకగ్రీవాలతోనే మరింత అభివృద్ధి



మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

ప్రభుత్వం తరపున రూ.10 లక్షలు

అదనంగా మరో రూ.15 లక్షలిస్తా: ఎమ్మెల్యే ఆల

భూత్పూర్: పంచాయతీలను ఏకగ్రీవం చేసుకుంటే మరింత అభివృద్ధి సాధ్యమని, అందుకే ప్రజలు ఆలోచించాలని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరులో మీడియా సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ బలపరిచే అభ్యర్థులనే గెలిపించాలని పిలుపునిచ్చారు. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం రూ.10 లక్షల ప్రోత్సాహకాన్ని అందిస్తుండగా, ఎమ్మెల్యే నిధుల నుంచి తాను అదనంగా మరో రూ.15 లక్షలు కేటాయిస్తానని ప్రకటించారు. దేవరకద్ర నియోజకవర్గంలో ఎక్కువ మంది సర్పంచులు రూ.25 లక్షల ప్రోత్సాహకాన్ని అందుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీఆర్ఎస్ నాయకుడు నారాయణగౌడ్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా ఫత్తేపూర్ మైసమ్మ ఆలయంవద్ద ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి స్వాగతం పలుకుతున్న ఆలయ పాలకవర్గం సభ్యులు, అధికారులు

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వెల్లడి

నవాబ్‌పేట: రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని జడ్చర్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం ఫత్తేపూర్ మైసమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన శకటోత్సవానికి ఆయన హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. ఫత్తేపూర్ మైసమ్మ ఆలయ ఆవరణలోని అటవీభూమికి సంబంధితశాఖ అధికారులతో క్లియరెన్స్ ఇప్పించి పనులు చేపడుతామన్నారు. ఆలయ ఆవరణలో షెడ్ల నిర్మాణంతో పాటు అతిథి గృహం నిర్మిస్తామని చెప్పారు.



నల్లగొండ జిల్లా దేవరకొండలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పక్కన దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

రిజర్వేషన్ల అమలు అధికారం రాష్ట్రాలకివ్వాలి

నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి డిమాండ్

దేవరకొండ, నమస్తే తెలంగాణ: అగ్రవర్ణాల పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, కానీ ముస్లిం, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలుచేసే అధికారాన్ని కేంద్రం రాష్ట్రాలకు ఇవ్వాలని నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నల్లగొండ జిల్లా దేవరకొండలో ఆయన స్థానిక ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌తోకలిసి మీడియా తో మాట్లాడారు. శాసనసభ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన కాంగ్రెస్‌పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఘోర పరాజయం తప్పదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పనితీరు, అభివృద్ధి, సంక్షేమ పథకాలవైపు యావత్తు దేశం చూస్తున్నదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా రైతుబంధు, రైతు బీమా పథకాలను అమలు చేయాలనే ఆలోచనల్లో ఉన్నదన్నారు. పంచాయతీలను ఏకగ్రీవం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ వడ్త్య దేవేందర్, జెడ్పీటీసీ ఆలంపల్లి నర్సింహ పాల్గొన్నారు.

కొండగట్టు ప్రమాదంలో మరొకరి మృతి

66కు చేరిన మృతుల సంఖ్య



హరిత (ఫైల్)

మల్యాల: జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఘాట్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం మరో మహిళ మరణించింది. దీంతో ఘాట్ రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య 66కు చేరింది. గతేడాది సెప్టెంబర్ 11న కొండగట్టు ఘాట్‌రోడ్డుపై జరిగిన బస్సు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన కొడిమ్యాల మండలం డబ్బుతిమ్మాయపల్లికి చెందిన సురకంటి హరిత (35) హైదరాబాద్‌లోని పలు దవాఖానల్లో చికిత్స పొందింది. వైద్యులు చేతులెత్తేయడంతో రెండు నెలలుగా ఇంటి వద్దే నరకయాతన అనుభవిస్తూ మంగళవారం తుదిశ్వాస విడిచినట్టు గ్రామస్థులు తెలిపారు.

రైలు ఢీకొని తల్లీకొడుకు దుర్మరణం

మతిస్థిమితం లేని కుమారుడిని కాపాడబోయి..

నిజామాబాద్ జిల్లా ఫకీరాబాద్ రైల్వేగేటు వద్ద ఘటన

నవీపేట: రైలు ఢీకొనడంతో తల్లీకొడుకు దుర్మరణం చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం ఫకీరాబాద్ రైల్వేగేటు వద్ద మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫకీరాబాద్‌లోని గ్యాంగ్ మెన్ క్వార్టర్‌లో నివాసముంటున్న వడ్డె గంగామణి(45), స్థానిక దాబాలో పనిచేస్తున్నది. ఆమె కుమారుడు గంగా ప్రసాద్(10)కు మతిస్థిమితం లేదు. రోజు మాదిరిగానే హోటల్‌లో పనిముగించుకొని కుమారుడు గంగా ప్రసాద్ (10)తో కలిసి ఇంటికి బయలుదేరింది. ఈ క్రమంలో ఫకీరాబాద్ రైల్వే గేటు వద్ద గేటు వేసినప్పటికీ మతిస్థిమితం లేని ఆమె కుమారుడు గేటు కింద నుంచి పట్టాలపైకి వెళ్లాడు. కుమారుడిని కాపాడేందుకు నాగమణి వెళ్లగా ముంబయి నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్ ఢీకొని తల్లీ కొడుకులిద్దరూ ప్రాణాలు వదిలారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఆర్‌బీఐ ఎస్కార్ట్ వాహనాన్ని ఢీకొన్న టిప్పర్

ఏఆర్ కానిస్టేబుల్ మృతి.. మరో నలుగురికి తీవ్ర గాయాలు

కారేపల్లి రూరల్: ఆర్‌బీఐ ఎస్కార్ట్ వాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో ఏఆర్ కానిస్టేబుల్ మృతిచెందగా, మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకున్నది. వివరాలు ఇలా.. హైదరాబాద్ నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల బ్యాంకులకు డబ్బును తరలించేందుకు ఏఆర్ కానిస్టేబుళ్ల ఎస్కార్ట్ వాహనం ఖమ్మం చేరుకొని, ఖమ్మం నుంచి భద్రాచలం వెళ్లేందుకు ఇల్లెందు మీదుగా బయలుదేరింది. మార్గ మద్యంలో ఖమ్మం-ఇల్లెందు ప్రధానరహదారిలో కారేపల్లి మండల పరిధిలోని ఓసీ సమీపంలో మూలమలుపు వద్ద ఇల్లెందు నుంచి వేగంగా వస్తున్న టిప్పర్ ఎస్కార్ట్‌గా ఉన్న ఇన్నోవాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎస్కార్ట్ వా హనంలో ఉన్న ఏఆర్ కానిస్టేబుళ్లు దస్తగిరి(45), సురేందర్‌గౌడ్, వినోద్‌కుమార్, హరీశ్‌తోపాటు ఇన్నోవా డ్రైవర్ ఫిరోజ్‌ఖాన్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఇల్లెందు ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ దస్తగిరి మృతిచెందాడు. డ్రైవర్ ఫిరోజ్‌ఖాన్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం దవాఖానకు తరలించారు.

లైంగికవేధింపులకు పాల్పడ్డ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

అశ్వారావుపేట, నమస్తే తెలంగాణ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం అనంతారం ఆశ్రమపాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న గుగులోతు శ్రీనివాసరావును లైంగిక వేధింపుల ఆరోపణలపై సస్పెండ్ చేశారు. శ్రీనివాసరావు, ఇదే ఆశ్రమ పాఠశాలలో రోజూవారీ వర్కర్‌గా పనిచేస్తున్న అజ్మీరా సక్రుతోకలిసి బాలికలను కొంతకాలంగా లైంగికంగా వేధిస్తున్నాడని, పలువురు విద్యార్థినులు, ఆశ్రమ పాఠశాల సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఐటీడీపీ పీవో పమేలా సత్పతి విచారణ జరిపి శ్రీనివాసరావును సస్పెండ్ చేయటంతోపాటు వర్కర్ అజ్మీర సక్రును విధులనుంచి తొలగించారు.



సూర్యాపేటలో టీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో కాంగ్రెస్ నాయకులను టీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి


టీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్ఎస్‌లోకి చేరికల పర్వం కొనసాగుతున్నది. వివిధ పార్టీలు, ప్రజాసంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో టీఆర్ఎస్‌లో చేరుతున్నారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 850 మంది మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సమక్షంలో, తుంగతుర్తి నియోజకవర్గం నాగారం బంగ్లాకు చెందిన 50 మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే గాదరి కిశోర్ సమక్షంలో, కోదాడ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 120 మంది ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు సమక్షంలో, హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 300 మంది టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో, నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి 400 మంది కార్మికులు ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.


ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో..: మహబూబ్‌నగర్ జిల్లాలో దేవరకద్ర నియోజకవర్గంలోని అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లి తండావాసులు, చిన్నచింతకుంట మండలం అప్పంపల్లికి చెందిన 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో, మక్తల్ నియోజకవర్గంలోని ఊట్కూరు మండలకేంద్రానికి చెందిన 50 మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో, నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన 20 మంది అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో గులాబి గూటికి చేరారు.

ఉమ్మడి కరీంనగర్‌లో..

కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన 50 మంది కాంగ్రెస్, టీడీపీ నాయకులు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో, తిమ్మాపూర్ మండలకేంద్రంలో 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, మొగిపాలెం గ్రామానికి చెందిన పలువురు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.



కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరుతున్న టీడీపీ నాయకులు



కరీంనగర్ జిల్లా అల్గునూర్‌లోని పార్టీలో చేరినవారికి కండువాలు కప్పుతున్న మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మహబూబ్‌నగర్‌కు సమీపంలోని మయూరీపార్కులో నైట్‌క్యాంపింగ్ సైట్‌ను ప్రారంభించి వసతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

మయూరీ పార్కులో నైట్ క్యాంపింగ్ సైట్

ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని మయూరీపార్కులో మంగళవారం నైట్ క్యాంపింగ్ సైట్‌ను ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పార్కును మరింత అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. రాత్రి వేళలోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా నైట్‌క్యాంపింగ్ సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఆ సైట్‌లోని ఏర్పాట్లను ప్రజాప్రతినిధులు, అధికారులతోకలిసి పరిశీలించారు. పార్కును మరింత ఉన్నతంగా తీర్చిదిద్దే విషయమై వారితో చర్చించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో గంగారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధాఅమర్ తదితరులు పాల్గొన్నారు.

శోకసంద్రం..

- స్వగ్రామాలకు చేరిన అయ్యప్పభక్తుల మృతదేహాలు
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు
- త్వరలో బాధిత కుటుంబాలకు పరిహారం: ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి,ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వెల్లడి

మెదక్ ప్రతినిధి, నర్సాపూర్, నమస్తే తెలంగాణ: అయ్యప్ప దైవదర్శనానికి వెళ్లి తిరుగొస్తుండగా తమిళనాడు రాష్ట్రంలోని పుదుకొట్టై వద్ద మృతిచెందిన మెదక్ జిల్లాకు చెందిన అయ్యప్ప స్వాముల మృతదేహాలకు మంగళవారం రాత్రి వారివారి గ్రామాల్లో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో నర్సాపూర్ మండలంలోని నాలుగు గ్రామాలకు చెందిన తొమ్మిది మంది అయ్యప్పస్వామి భక్తులు, వాహనడ్రైవర్ మృతిచెందిన విషయం తెలిసిందే. వీరి మృతదేహాలు మంగళవారం నర్సాపూర్‌కు చేరుకున్నాయి. ప్రభుత్వ ఖర్చుతో తమిళనాడు నుంచి మృతదేహాలను అంబులెన్సుల్లో తీసుకొచ్చారు. నర్సాపూర్ పట్టణశివారుకు మృతదేహాలు చేరుకోగానే ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డి, కలెక్టర్ ధర్మారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి మురళీయాదవ్, జేసీ నగేశ్, టీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మురళీయాదవ్ అంబులెన్స్‌ల వద్దకు చేరుకొని శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మృతదేహాలను వారి స్వగ్రామాలకు తరలించారు. జర్రు మహేశ్, కర్రె నాగరాజుగౌడ్, బోయినికుమార్ పార్థివదేహాలను వారి స్వగ్రామమైన ఖాజీపేటకు, చీరాల శివప్రసాద్, శ్యాంసుందర్‌గౌడ్ మృతదేహాలను మంతూర్‌కు, నక్కా ఆంజనేయులు, అంబర్‌పేట కృష్ణాగౌడ్ పార్థివదేహాలను రెడ్డిపల్లికి తరలించారు. వాహనడ్రైవర్ సురేశ్ భౌతికకాయాన్ని సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నిమ్టూరుకు తరలించారు. అయ్యప్పస్వాముల పార్థివదేహాలకు వారివారి గ్రామాల్లో మంగళవారం రాత్రి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.



మెదక్ జిల్లా నర్సాపూర్‌కు మృతదేహాలతో తరలివచ్చిన అంబులెన్సులు (ఇన్‌సెట్‌లో) ఖాజీపేటలో నాగరాజు ఇంటి వద్ద రోదిస్తున్న బంధువులు

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: ఎంపీ, ఎమ్మెల్యే

త్వరలో సీఎం కేసీఆర్‌తో బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇప్పిస్తామని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతో మృతదేహాలను తమిళనాడు నుంచి ప్రత్యేక అంబులెన్సుల్లో తీసుకొచ్చామన్నారు.



సిక్కిం, త్రిపుర రాష్ట్రాల బ్యాంకర్లతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్, డీఆర్డీవో ఉపేందర్‌రెడ్డి

రాష్ట్రంలో మహిళా సాధికారిత భేష్

త్రిపుర, సిక్కిం బ్యాంకర్ల బృందం ప్రశంస

యాదాద్రిభువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ: రాష్ట్రంలో మహిళా సాధికారితకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలుభేష్ అని త్రిపుర, సిక్కిం రాష్ట్రాల బ్యాంకర్ల బృందం అభిప్రాయపడింది. రాష్ట్రంలో మహిళాసంక్షేమం, అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను అధ్యయనం చేసేందుకు సీనియర్ బ్యాంకర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులతో కూడిన బృందం మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లాకు చేరుకున్నది. ఆబృందం సభ్యులు భువనగిరి, బీబీనగర్ మండలంలో వెంకిర్యాలలో పర్యటించి సంఘంబంధం మహిళలతో మాట్లాడారు. మహిళలు పొందుతున్న సౌకర్యాలు, ఆర్థిక సహాయం తదితర విషయాలను తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ అనితారామచంద్రన్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

దేశానికే మార్గదర్శకంగా తెలంగాణ

- సీఎం కేసీఆర్ ఆలోచనలను అమలుచేస్తే సాధ్యమే
- ఉద్యమంలో టీఎన్జీవోలది అవినాభావ సంబంధం
- సమస్యలను పరిష్కరిస్తాం: మాజీమంత్రి హరీశ్‌రావు

తెలుగుయూనివర్సిటీ: సీఎం కేసీఆర్ ఆలోచనలను ఉద్యోగులు అమలు చేస్తే, దేశానికే మన ప్రభుత్వం మార్గదర్శకంగా నిలుస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇంది రాప్రియదర్శిని ఆడిటోరియంలో టీఎన్జీవో నగరశాఖ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణసభలో ఆయన మాట్లాడుతూ టీఎన్జీవోలకు, తెలంగాణ ఉద్య మానికి అవినాభావ సంబంధమున్నదని చెప్పారు. ఉమ్మడిరాష్ట్రంలో చంద్రబాబు పాలనలో తెలంగాణ పదాన్ని నిషేధిస్తే, ఉద్యోగులు మాత్రం తెలంగాణ ఎన్జీవోలుగా పేరుపెట్టుకొని ఉద్యమాన్ని ప్రజలకు గుర్తుచేస్తూ చరిత్రాత్మకపాత్ర పోషించారని ప్రశంసించారు. ఉద్యమం సందర్భంగా తెలంగాణ ఉద్యోగులపై దాడులుజరిగితే అండగా నిలిచామని గుర్తుచే శారు. తెలంగాణ ఉద్యోగుల సమస్యలు సీఎంకు తెలుసని, త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని భరోసా కల్పించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 17ఎంపీ సీట్లను గెలుచుకొని కేంద్రాన్ని శాసించేస్థా యికి చేరినప్పుడే హెచ్‌వోడీల విభజనసహా మిగతా సమస్యలు పరిష్కా రమవుతాయని స్పష్టంచేశారు. కేంద్రం మెడలు వంచి ప్రాజెక్టులను పూర్తి చేసుకొని రాష్ర్టాన్ని అభివృద్ధి పథంలో ఉంచేందుకు ఉద్యోగులు కృషిచే యాలని కోరారు. బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ మాట్లా డుతూ తెలంగాణ అభివృద్ధి కోసం, ఉద్యోగులు కృషిచేయాలని పిలుపు నిచ్చారు. టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు కే రవీందర్‌రెడ్డి మాట్లా డుతూ ఏపీలో ఉన్న మరో 800 మంది ఉద్యోగులను త్వరలో తెలంగా ణకు తీసుకొస్తామని ప్రకటించారు. హెచ్‌వోడీల్లో ఖాళీలను భర్తీచేయా లని టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి రాజేందర్ కోరారు. కార్యక్రమంలో టీఎ న్జీవో కేంద్ర సంఘం మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు రేచల్, నగర శాఖ అధ్యక్షుడు ప్రతాప్, శ్రీనివాసరావు, వెంకట్ పాల్గొన్నారు.



టీఎన్జీవో నగరశాఖ డైరీ ఆవిష్కరణ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవో కేంద్రసంఘం అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు రేచల్ తదితరులు

ఏటీఎంల నుంచి 47 లక్షల చోరీ

- సాంకేతిక పరిజ్ఞానంతో దొంగతనం
- ఓ సంస్థ ఉద్యోగి నమ్మక ద్రోహం
- కేసును ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

ఏటీఎంలలో డబ్బులు అమర్చేపనిలో ఉన్న ఉద్యోగి తన దగ్గర ఉండే మాస్టర్ కీతో రూ.47లక్షలు లూటీ చేశా డు. సంస్థ ఫిర్యాదు మేరకు రాచకొండ పోలీసులు నిందితులను అరెస్టుచేశారు. అతడి ప్రియురాలు సైతం జైలుపాలైంది. సైబరాబాద్ సీపీ మహేష్‌భగవత్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బేగంపేటకు చెందిన ఎన్సీఆర్ కార్పొరేషన్ ఏటీఎంలలో డబ్బు అమర్చేందుకు కరూర్ వైశ్య బ్యాంకుతో ఒప్పందం చేసుకొని రైటర్ సేఫ్‌గార్డ్ అనే మరో సంస్థకు సబ్ కాంట్రాక్టు ఇచ్చింది. రైటర్ సేఫ్ గార్డ్ సంస్థలో పని చేస్తున్న సాయిరామ్ సాయికిరణ్ మాస్టర్ కీతో ఏటీఎంలలో నగదు జమచేస్తున్నాడు. ఆ కీ సాయంతో ఏడు నెలల్లో రూ.47.37 లక్షలను కాజేసి ఉద్యోగం మానే శాడు. ఎన్సీఆర్ కార్పొరేషన్ ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి ముగ్గురిని అరెస్టు చేశారు.




స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న సీపీ మహేశ్‌భగవత్

అలర్ట్‌పిన్‌ను సైలెంట్ చేసి నగదు అపహరణ

ప్రధాన నిందితుడైన సాయిరామ్‌సాయికిరణ్ టెక్నికల్‌గా ఎవరికీ దొరకకుండా జాగ్రత్తపడ్డాడు. ఏటీఎం కేంద్రాల్లో నగదును డిపాజిట్ చేసే సమయంలో మెషిన్ చెస్ట్ తెరిచి నగదును డిపాజిట్ చేయగానే అందులో ఉండే అలర్ట్ పిన్‌కు ఈ నగదు తాకి మొత్తం లెక్క బ్యాంక్ అధికారులతో పాటు కంపెనీకి మెస్సేజ్ రూపంలో చేరుతుంది. సాయిరా మ్‌సాయికిరణ్ తెలివిగా తన దగ్గర ఉండే మాస్టర్ కీని డూప్లి కేట్ చేయించి దానితో చెస్ట్‌ను తెరిచి ఓ సన్నటి ఇనుపరా డ్‌తో డబ్బుల కింద ఉండే అలర్ట్‌పిన్ నొక్కిపెట్టి సైలెంట్ చేసి డబ్బును తీసేస్తాడు.అనంతరం యథావిధిగా చెస్ట్‌కు తాలం వేసి వెళ్ళిపోయేవాడు. అలర్ట్‌పిన్ సైలెంట్‌గా ఉండడంతో డబ్బు తీసిన విషయం బ్యాంక్ అధికారులకు తెలిసేది కాదు. మరికొన్ని సందర్భాల్లో బ్యాంక్ ఖాతాదారుడు ఏటీఎం నుంచి నగదు డ్రా చేసే సమయంలో సాంకేతిక లోపంతో డబ్బు బయటికి రాలేక, చెస్ట్ నుంచి బయటికి వచ్చి చిన్న బాక్సులో పడిపోయేవి. ఈ ఐడియా ప్రధాన నిందితుడికి ఉండడంతో డూప్లికేట్ కీ ద్వారా మెషీన్‌లోని ఆ చిన్న బాక్సును తెరిచి అందులో ఉన్న నగదును కాజేసే వాడు. ఇలా మొత్తం 47.37 లక్షలు కాజేసి తన ప్రియు రాలు నర్సింగ్‌రావు పూజ పేరు మీద రెండు బ్యాంక్ ఖాతాలు, స్నేహితుడు తాటికొండ నాగరాజుతో బ్యాంక్ ఖాతాను తెరిపించి అందులో డిపాజిట్ చేయించాడు. వీటిలో రూ. 5 లక్షలు తన ప్రియురాలి కోసం షాపింగ్ చేసి నట్టు పోలీసు విచారణలో తేలింది. సాయిరామ్‌సాయికిర ణ్‌తో పాటు ఆయన ప్రియురాలు నర్సింగ్‌రావు పూజ, స్నేహితుడు తాటికొండ నాగరాజులను పోలీసులు అరెస్టు చేసి వీరి వద్ద నుంచి రూ. 47 లక్షలు స్వాధీనం చేసుకొ న్నారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ సుధీర్ బాబు, మల్కాజిగిరి డీసీపీ ఉమామహేశ్వరశర్మ, కుషాయిగూడ ఏసీపీ శివకుమార్, కీసర ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



పీఆర్టీయూ తెలంగాణ- 2019 డైరీని సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు మంగళ వారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. క్యాలెండర్‌ను హోంమంత్రి మహమూద్ అలీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో శాసన మండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మారెడ్డి అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



టీఎస్బీసీఎల్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, చిత్రంలో ఎమ్మెల్సీ భానుప్రసాద్, టీఎస్బీసీఎల్ ఎండీ సోమేశ్‌కుమార్

టీఎస్బీసీఎల్ సిబ్బందికి ఆరోగ్యపథకం

- బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎక్సైజ్‌శాఖ ఉద్యోగుల మాదిరిగానే టీఎస్బీసీఎల్ ఉద్యోగులకు ఆరోగ్యపథకాన్ని వర్తింపజేస్తామని బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ వెల్లడించారు. టీఎస్బీసీఎల్ ఉద్యోగుల సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను మంగళవారం ఆయన ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సూచనలతో కార్పొ రేషన్‌లోని ఎన్నో సమస్యలను పరిష్కరించామని చెప్పారు. మరో 80 మంది సిబ్బంది నియామకానికి సీఎం కేసీఆర్ అనుమతించారని చెప్పారు. ఎండీ సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆరోగ్యపథకాన్ని టీఎస్బీసీఎల్ ఉద్యోగులకు ఈ సంక్రాంతి నుంచే అమలుచేస్తామని హామీఇచ్చారు. 19 డిపోలను ఆధునీక రించి ఉద్యోగులకు టైంస్కేల్, ఉద్యోగుల రెగ్యులర్‌కు సర్వీస్‌రూల్స్ సవరణ అంశాలను త్వరలోనే సీఎం కేసీఆర్‌కు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యో గుల సంఘం గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భానుప్రసాద్, ఎక్సైజ్‌శాఖ అధికా రులు అజయ్‌రావు, వివేకానందరెడ్డి, ఖురేషి, పీఆర్టీయూ జనరల్ సెక్రెటరీ కమ లాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుపై కేంద్రం నిర్లక్ష్యం

టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీపీఎస్ రద్దు అంశంపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, కనీసం పార్లమెంట్‌లో చర్చ పెట్టడానికి కూడా ఒప్పుకోవడం లేదని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి అన్నారు. సీపీఎస్‌తోపాటు పలు అంశాలపై కేంద్రప్రభుత్వ విధానాలకు నిరసనగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట టీఎన్జీవో ఆధ్వ ర్యంలో భోజన విరామసమయంలో నిరసన చేప ట్టారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లా డుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీజేపీలు ఉద్యోగులపై అనేక వరాలు కురిపించాయని, ఇప్పుడు కేంద్ర పరిధిలో ఉన్న సీపీఎస్‌ను ఎత్తివేసే అంశంపై మాత్రం మాట్లాడటం లేదని మండిప డ్డారు. నాడు కాంగ్రెస్, ఇప్పుడు బీజేపీ ప్రభు త్వాలు కలిసికట్టుగా ఉద్యోగులను మోసంచేస్తు న్నాయని విమర్శించారు. ఈ విధానాన్ని రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వమే ఆమోదిం చిందని గుర్తుచేశారు. సీపీఎస్ రద్దు అంశంపై దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు టీఎన్జీవో మద్ద తుగా నిలుస్తుందని రవీందర్‌రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశా ల్లోనూ సీపీఎస్ రద్దు అంశంపై చర్చిద్దామని పలురాష్ట్రాల ఎంపీలు నోటీసులు ఇచ్చాయని..



రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి

కేంద్రం మాత్రం చర్చకూడా అవసరం లేదని తీసి పారేసిందని ఆరోపించారు. ప్రభుత్వశాఖలను ప్రైవేటీకరించేందుకు చేస్తున్న యత్నాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా నిరసనలు చేపడుతున్నా మని, బుధవారం వరంగల్‌లో భారీర్యాలీ నిర్వ హిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో టీఎ న్జీవో సెంట్రల్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్య దర్శి మామిండ్ల రాజేందర్, అసోసియేట్ ప్రెసి డెంట్ బీ రేచల్, కోశాధికారి రామినేని శ్రీనివాస్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఆహార శుద్ధిరంగంలో జర్మనీ పెట్టుబడులు

వచ్చే నెలలో హైదరాబాద్‌కు టెటామస్ కంపెనీ ప్రతినిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆహార శుద్ధిరం గంలో అంతర్జాతీయంగా పేరున్న జర్మనీలోని టెటామస్ కంపెనీ భారత్‌లో పెట్టుబడులు పెట్టేం దుకు హైదరాబాద్‌ను ఎంచుకున్నది. ఈ విష యాన్ని కంపెనీ భారత సీఈవో కీర్తివర్ధన్‌రెడ్డి.. వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కు మంగళవారం జర్మనీలోని బెర్లిన్‌లో తెలియచే శారు. అంతకుముందు ఎమ్మెల్యే రమేశ్ టెటా మస్ కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపి తెలం గాణ సీఎం కేసీఆర్ ఆహార శుద్ధిరంగానికి, అంత ర్జాతీయ సహకారానికి ప్రకటించిన ప్రాధాన్యాన్ని వివరించారు. ఫిబ్రవరి మొదటి వారంలో హైద రాబాద్‌కు వచ్చి సీఎం కేసీఆర్‌ను కలువడానికి కంపెనీ ప్రతినిధులు సన్నద్ధమవుతున్నారని సీఈవో కీర్తివర్ధన్‌రెడ్డి వేముల ఎమ్మెల్యే చెన్నమ నేని రమేశ్‌కు తెలిపారు. ఈ టెటామస్ కంపెనీ ఆహార భద్రత, ఆహార నాణ్యత, ఫార్మా, కాస్మొ టిక్స్, పశు ఆహారం, వ్యవసాయం, పర్యావరణా నికి సంబంధించిన ఉత్పత్తులను పరిశీలించి అంతర్జాతీయ ప్రమాణాలతో ధ్రువీకరణలను, ఆడిట్లను, ఉత్పత్తులకోసం సలహాలను ఇచ్చి భారత, అంతర్జాతీయ వాణిజ్యానికి కావాల్సిన నిబంధనలన్నింటినీ కంపెనీలు పాటించేందుకు అవసరమైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది. బెర్లిన్‌లో ఉన్న ఈ కంపెనీ ఐరోపా, ఇజ్రాయిల్, చైనా, యూకే, అమెరికా దేశాల్లో 2,500 మంది నిపు ణులతో పనిచేస్తున్నది.

మళ్లీ పెరిగిన చలి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రం లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మళ్లీ తగ్గుతున్నాయి. సోమవారంతో పోల్చితే మంగళవారం కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొంతమేర తగ్గాయి. మంగళవారం అత్యల్పంగా ఆదిలాబాద్ జిల్లా అర్లి(టీ)లో 6.5 డిగ్రీలుగా నమోదైంది. జిల్లాల్లోనూ 7.8 నుంచి 16 డిగ్రీలుగా రికార్డయింది. హైదరాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 16 డిగ్రీలుగా నమోదైంది. మూడు రోజులవరకు ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గు లుంటాయి.

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
కుమ్రంభీం	7.8	28.5
ఆదిలాబాద్	7.8	28.5
మంచిర్యాల	7.8	28.5
నిర్మల్	9.0	27.0
కామారెడ్డి	9.0	28.0
వికారాబాద్	9.9	22.4
జగిత్యాల	10.0	31.0
మెదక్	10.6	32.1
నాగర్‌కర్నూల్	10.8	33.3
జయశంకర్	11.0	28.0
వరంగల్ రూరల్	11.0	29.0
సంగారెడ్డి	11.0	32.0
సిద్దిపేట	11.0	32.0
మహబూబ్‌నగర్	11.2	34.6
పెద్దపల్లి	12.0	27.2
రాజన్నసిరిసిల్ల	12.0	29.0
కరీంనగర్	12.4	33.0
జోగులాంబ గద్వాల	12.5	32.9
రంగారెడ్డి	13.0	29.0
భద్రాద్రి కొత్తగూడెం	13.0	31.0
యాదాద్రి	13.0	35.5
వరంగల్ అర్బన్	13.5	27.0
జనగామ	13.5	31.3
నిజామాబాద్	13.6	29.2
మహబూబాబాద్	13.7	33.2
సూర్యాపేట	14.0	31.0
వనపర్తి	14.1	35.5
హైదరాబాద్	16.0	29.0
మేడ్చల్	16.0	29.0
ఖమ్మం	16.0	32.0
నల్లగొండ	16.4	29.8




తెలుగు రాష్ట్రాల్లో రైల్వే ప్రాజెక్టులపై ఉపరాష్ట్రపతి చర్చ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు రైల్వే ప్రాజెక్టులపై భారత ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యానాయుడు చర్చించారు. ఏపీ లోని రేణిగుంట నుంచి నెల్లూరు వరకు మంగళవారం ఉపరాష్ట్రపతి రైలు ప్రయాణం చేశారు. ఆ సమయంలో రైల్వే ప్రాజెక్టుల గురించి అధికారులతో చర్చించారు. సమావేశంలో జీఎం ఆర్కే కులశ్రేష్ఠ, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ శివ ప్రసాద్, డీఆర్ఎం విజయప్రతాప్‌సింగ్ అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో అన్ని కులాలకు గౌరవం

- ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అన్ని కులాల వారికి సముచిత గౌరవాన్ని ఇస్తున్న మహానేత సీఎం కేసీఆర్ అని ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు కొని యాడారు. బీసీల కోసం ఇప్పటివరకు ఏ సీఎం ప్రవేశ పెట్టనన్ని సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపె ట్టారని చెప్పారు. కాంగ్రెస్ నేతలకు రౌడీయిజం, గుండాయిజం చేయడం, పేకాట క్లబ్బులు నడుపడం తప్ప మరేదీ చేతకాదని విమర్శించారు. మంగళ వారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై సీఎం కేసీఆర్‌ను తప్పు పడుతూ కొన్ని పార్టీలు, బీసీ సంఘాల నేతలు మాట్లా డటాన్ని ఖండించారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ నాయకత్వానికి బీసీలు బ్రహ్మరథం పట్టారని, 88 స్థానాలు గెలుచుకునేలా తోడ్పడ్డారని గుర్తుచేశారు. బీసీ సంఘాల నేతల ముసుగులో కొందరు ఆర్థిక రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. బీసీ విద్యార్థుల కోసం ఇన్ని గురుకుల పాఠశాలలు, కాలేజీలను ప్రారంభించిన సీఎం గతంలో ఎవరైనా ఉన్నారా అని ప్రతిపక్షాలను ప్రశ్నిం చారు. సీఎం కేసీఆర్ బీసీలకు రాజకీయంగా ఉన్నత పదవులిచ్చి గౌరవించా రని, బీసీలకు ఆత్మగౌరవ భవనాలను మంజూరు చేశారని, కుల వృత్తులకు జీవంపోశారని కొనియాడారు.

టీజీహెచ్ఏ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీ మోహన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీ మోహన్‌రెడ్డిని నిల బెడుతూ తెలంగాణ గెజిటెడ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ నిర్ణయం తీసుకు న్నది. ఆయన అభ్యర్థిత్వాన్ని ఎయిడెడ్ టీచర్స్ గిల్డ్, తెలంగాణ మోడల్ స్కూల్ అసోసియేషన్ బలపరిచాయి. మంగళవారం మీడియా సమావేశంలో ఈ నిర్ణ యాన్ని ప్రకటించారు. ఆయన పీఆర్టీయూకు 30 ఏండ్లు సేవలందించారు.

10 నుంచి అంతర్జాతీయ కల్చరల్ టూరిజం సదస్సు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పి టాలిటీ మేనేజ్‌మెంట్ (ఎన్ఐటీహెచ్ఎం) ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి 12 వరకు మూడురోజులపాటు 23వ అంతర్జాతీయ జాయింట్ వరల్డ్ కల్చరల్ టూరిజం సదస్సును నిర్వహిస్తున్నారు. సదస్సులో పాల్గొనడానికి దాదాపు 15 దేశాల నుంచి టూరిజానికి చెందిన ప్రతినిధులు హాజరై పేపర్ ప్రజెంటేషన్ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, ఎన్ఐటీహెచ్ఎం చైర్మన్ బీ వెంకటేశం, ఏయిమ్స్ చైర్మన్ ప్రొఫెసర్ జీఎస్ రావు తదితరులు హాజరుకా నున్నట్లు ఎన్ఐటీహెచ్ఎం డైరెక్టర్ డాక్టర్ ఎస్ చిన్నంరెడ్డి తెలిపారు.



ఆదిలాబాద్‌లో ఏకగ్రీవాల జోరు..

పంచాయతీ ఎన్నికల వేడి రాజుకున్నది. రాష్ట్రంలో ఎక్కడ చూసిన ఏకగ్రీవాలపైనే చర్చ జరుగుతున్నది. పాలక వర్గాన్ని ఏకగ్రీవం చేసుకొని ప్రభుత్వమిచ్చే రూ.10 లక్షల ప్రోత్సాహకంతోపాటు స్థానిక ఎమ్మెల్యేలు ఇచ్చే అదనపు నజరానాలను దక్కించుకునేందుకు పోటీపడుతున్నారు. ఆయా గ్రామాల వారు ఎక్కడికక్కడ సమావేశమై పాలక వర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్టు తీర్మానాలు చేస్తున్నారు. మంగళ వారం ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం కొండాపూర్‌లో స్థానికులు సమావేశమై పాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వార్డులవారీగా ఓటర్ల తుది జాబితా

- వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన ఈసీ
- అసెంబ్లీ ఓటరు జాబితాతోపాటు రెండు సప్లిమెంటరీ లిస్టులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుదిజాబితా విడుదలైంది. రాష్ట్రంలోని 12,732 గ్రామాలు, 1,13,170 వార్డుల్లో ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. అసెంబ్లీ ఓటరు జాబితాతో పాటుగా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కొత్తగా ఓటు నమోదు అవకాశం కల్పిస్తూ జారీచేసిన సప్లిమెంటరీ జాబితాను గతంలోనే ఇచ్చారు. అయితే పలు చోట్ల మార్పులు, చేర్పులు, ఈనెల 1వరకు కొత్త ఓటర్ల నమోదుతో రెండో అనుబంధ జాబితాను ప్రకటించారు. ఈ జాబితా పరిశీలన అనంతరం మంగళవారం గ్రామాలు, వార్డుల వారీగా తుది జాబితాను రాష్ట్రఎన్నికలసంఘం వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టింది. ప్రతి వార్డులో అసెంబ్లీ ఓటరు జాబితా, మొదటి సప్లిమెంటరీ, రెండో సప్లిమెంటరీ జాబితాను వేర్వేరుగా అందుబాటులో పెట్టారు. కొత్తగా ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తులు, పరిశీలన అనంతరం ఓటు హక్కు కల్పించిన జాబితాను ప్రకటించారు. గ్రామాల్లో ఈ జాబితాను వెల్లడించామని ఎన్నికల సంఘం అధికారులు స్పష్టంచేశారు. ఈ ఓటరు జాబితాను https://tsec.gov.in/elecroll/gpWardWiseElecrolls.do వెబ్‌సైట్‌లో ఉన్నదని, వార్డుల వారీగా ఓటర్ల వివరాలు, ఓటరు స్లిప్పులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ వెల్లడించారు.

81 ఓట్లు సాధిస్తే సర్పంచ్

మంచిర్యాల జిల్లాలో నాగారం పంచాయతీ ప్రత్యేకత

నెన్నెల: మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని నాగారం గ్రామంలో 161 ఓట్లు మాత్రమే ఉన్నాయి. ఇక్కడ ఇద్దరు అభ్యర్థులు సర్పంచ్‌గా పోటీచేస్తే 81 ఓట్లు సాధించనవారు విజేతగా నిలుస్తారు. సర్పంచ్‌గా నలుగురు అభ్యర్థులు బరిలో ఉంటే 41 ఓట్లు తెచ్చుకున్న అభ్యర్థి సర్పంచ్ అవుతాడు.

జిల్లాలో 400 లోపు ఓటర్లున్న పంచాయతీలు 28

దండేపల్లి మండలంలోని వందూర్ గూడలో 187 ఓట్లు ఉన్నాయి. ఇక్కడా సర్పంచ్‌గా గెలవాలంటే పెద్దగా శ్రమించాల్సిన అవసరం లేదు. ఇద్దరు అభ్యర్థులు బరిలో ఉంటే 94 ఓట్లు తెచ్చుకున్నవారు సర్పంచ్‌గా విజయం సాధించవచ్చు. తాండూర్ మండలం నీలాయిపల్లిలో 196, హాజీపూర్ మండలం చిన్న గోపాల్‌పూర్‌లో 311, దండేపల్లి మండలం చెల్కగూడలో 316 ఓట్లు, కర్నపేటలో 324 ఓట్లు 8 వార్డులు, బెల్లంపల్లి మండలం లింగాపూర్‌లో 389 ఓట్లు 8 వార్డులు, భీమిని మండలంలోని లక్ష్మీపూర్‌లో 372 ఓట్లు, 8 వార్డులు, అక్కలపల్లిలో 276 ఓట్లు 6 వార్డులు, గొల్లగట్టులో 392 ఓట్లు 8 వార్డులు, కాసిపేట మండలంలోని రొట్టపల్లిలో 271 ఓట్లు, 6 వార్డులు, కొండాపూర్‌లో 367 ఓట్లు 8 వార్డులు, నెన్నెల మండలంలో మెట్‌పల్లిలో 361 ఓట్లు 6 వార్డులు, చెన్నూర్ మండలం రచ్చపల్లిలో 316 ఓట్లు, 6 వార్డులు, చాకేపల్లిలో 302 ఓట్లు 6 వార్డులు, లంబడిపల్లెలో 289 ఓట్లు 6 వార్డులు, బుద్దారంలో 238 ఓట్లు, 6 వార్డులు, కోటపల్లి మండలం బొప్పారంలో 322 ఓట్లు, 6 వార్డులు, ఎడగట్టలో 367 ఓట్లు, 8 వార్డులు, మందమర్రి మండలం శంకరాంపల్లిలో 367 ఓట్లు 8 వార్డులు, వేమనపల్లి మండలంలోని కల్లెంపల్లిలో 257 ఓట్లు 6 వార్డులు, రాజారంలో 228 ఓట్లు 6 వార్డులు ఉన్నాయి.

సోపానం



కెప్టెన్ లక్ష్మీకాంతారావు రాజ్యసభ సభ్యుడు



వొడితల సతీశ్‌కుమార్, ఎమ్మెల్యే హుస్నాబాద్

సర్పంచ్ నుంచే తండ్రీకొడుకుల ప్రస్థానం

అంచలంచెలుగా ఎదిగిన కెప్టెన్ లక్ష్మీకాంతారావు, వొడితల సతీశ్‌కుమార్

మంత్రి, ఎంపీగా తండ్రి.. ఎమ్మెల్యేగా కుమారుడు

హుజూరాబాద్, నమస్తే తెలంగాణ : రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఆయన కుమారుడు హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ సర్పంచ్ నుంచే తమ రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సింగాపూర్ వీరి స్వగ్రామం. వీరిది మొదటినుంచి రాజకీయ కుటుంబమే. లక్ష్మీకాంతారావు సోదరుడు వొడితల రాజేశ్వర్‌రావు (సింగాపూర్ రాజేశ్వర్‌రావు) ఎమ్మెల్యేగా, రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. పీవీ నరసింహారావు హయాంలో రాజేశ్వర్‌రావు దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు.

సర్పంచ్ నుంచి మంత్రి దాక

వొడితల లక్ష్మీకాంతారావు భారతసైన్యంలో కెప్టెన్‌గా పని చేయడంతో కెప్టెన్ లక్ష్మీకాంతారావుగా ఆయన పేరు స్థిరపడింది. బీఎస్సీ వరకు చదివిన లక్ష్మీకాంతారావు 1965లో ఇండో-పాక్‌యుద్ధంలో పాల్గొని రక్షమెడల్ అందుకున్నారు. 1968లో సైన్యం నుంచి తిరిగివచ్చి గ్రీన్ రెవెల్యూషన్ ఉద్యమంలో పాల్గొన్నారు. ఓ పక్క ప్రజాసేవ చేస్తూనే మరోవైపు వరంగల్ కిట్స్, వరంగల్ పబ్లిక్‌స్కూల్ అనే విద్యాసంస్థలను స్థాపించారు. సోదరుడు రాజేశ్వర్‌రావు నుంచి రాజకీయ లక్షణాలు పునికి పుచ్చుకున్న ఆయన 1983 నుంచి 95 వరకు సింగాపూర్ సర్పంచ్‌గా, ఎంపీటీసీగా ఎన్నికయ్యారు. 2001లో టీఆర్‌ఎస్ ఆవిర్భావ సమయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులై ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించారు. 2004లో హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికై బీసీ సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. 2008లో జరిగిన ఉపఎన్నికల్లోనూ ఆయన విజయకేతనం ఎగురవేశారు. తర్వాత 2016లో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై ప్రస్తుతం అదేపదవిలో కొనసాగుతున్నారు.

తండ్రి బాటలోనే తనయుడు

తండ్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు, పెద్దనాన్న వొడితల రాజేశ్వర్‌రావు రాజకీయ వారసుడిగా వొడితల సతీశ్‌కుమార్ తనదైన శైలిలో రాజకీయంగా ఎదుగుతున్నారు. ఎంటెక్ చదివిన ఆయన 1989లో మహారాష్ట్రలోని రాంటెక్ ఎంపీగా పీవీ నరసింహారావు పోటీచేసిన సమయంలో వొడితెల సతీశ్‌కుమార్ ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టి పీవీ గెలుపులో కీలకపాత్ర పోషించారు. 1995లో సింగాపూర్ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై ఎంతో అభివృద్ధి చేశారు. ఆవిర్భావం నుంచి టీఆర్‌ఎస్‌లోనే ఉంటూ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 2002లో హుజూరాబాద్ టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడిగా, 2005లో తుమ్మనపల్లి సహకార సంఘం చైర్మన్‌గా, 2006, 2011ల్లో వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్‌గా నియమితులై సమర్థంగా పనిచేశారు. 2012లో జరిగిన సింగిల్‌విండో ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గ బాధ్యతలు తీసుకొని అత్యధిక డైరెక్టర్లను గెలిపించడంతో పాటు మూడు చైర్మన్ పదవులను కైవసం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించారు. 2014, 2018 ఎన్నికల్లో హుస్నాబాద్ ఎమ్మెల్యే ఎన్నికయ్యారు.

అటవీ గ్రామాల్లో ఏకగ్రీవాలు!

ఏజెన్సీలో వెల్లివిరుస్తున్న ప్రజాచైతన్యం.. సర్పంచ్, వార్డుల్లో ఏకగ్రీవ ఎన్నికకు ఆసక్తి

విద్యావంతులు, యువతకు స్థానికుల ప్రాధాన్యం.. అదేబాటలో కొత్త గ్రామ పంచాయతీలు

వీ రాజేశ్వర్‌రావు, జయశంకర్ జిల్లా ప్రతినిధి:

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్త పంచాయతీరాజ్ చట్టం పల్లెల్లో నూతన శకానికి నాంది పలికింది. సమగ్ర అభివృద్ధికి బాటలు వేసింది. ఆయా గ్రామాల ప్రజలు తమ ఊరి అభివృద్ధిని కాంక్షిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని ఏకగ్రీవ ఎన్నికలను ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్రంలో అటవీ గ్రామాలు అత్యధికశాతం ఉన్న జిల్లా ల్లో జయశంకర్ భూపాలపల్లి ఒకటి. అటవీ విస్తీర్ణంలో జిల్లాది నంబర్‌వన్ స్థానం. జిల్లాలోని 20 మండలాల్లో 16 మండలాల్లోని గ్రామాలు అటవీప్రాంతంలోనే ఉన్నాయి. జిల్లాలో తొలివిడుత ఎన్నికలు జరిగే 158 పంచాయతీల్లో సర్పంచ్, 1,358 వార్డుస్థానాలకు ఎన్నికల అధికారులు నామినేషన్లు స్వీకరిస్తున్నారు.

చేతులెత్తే పద్ధతితో ఎన్నిక

ఏజెన్సీలోని కన్నాయిగూడెం మండలం ఐలాపూర్ సర్పంచ్ పదవి ఎస్టీ మహిళకు కేటాయించారు. సర్పంచ్ పదవికి పోటీచేసేందుకు ఎస్టీ మహిళలు నలుగురు ముందుకొచ్చారు. గ్రామస్థులు సర్పంచ్, ఎనిమిది వార్డులకు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి ఆదివారం గ్రామసభ నిర్వహించారు. మొత్తం ఓటర్ల సంఖ్య 381 కాగా, స్థానికంగా ఉండేవారు గ్రామసభకు హాజరయ్యారు. సర్పంచ్ పదవిని ఆశిస్తున్న నలుగురు మహిళల్లో ఒకరిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి ఓటర్లు చేతులు ఎత్తి మద్దతు ప్రకటించారు. నలుగురు ఆశావహుల్లో మల్లెల రాజేశ్వరికి 120 మంది, రెండో మహిళకు 96, మూడో మహిళకు 76, నాలుగో మహిళకు 56 మంది అనుకూలంగా చేతులెత్తారు. 120 మంది మద్దతు పొందిన మల్లెల రాజేశ్వరిని సర్పంచ్ పదవికి ఎన్నుకున్నట్టు ప్రకటించారు. ఎనిమిది వార్డులకు సభ్యులను, వీరిలో ఒకరిని ఉపసర్పంచ్ పదవికి సైతం ఇలాగే ఎన్నుకున్నారు. ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలుచేయాలని, ఇందుకు గ్రామస్థులందరూ కట్టుబడి ఉండాలని నిర్ణయించారు. మల్లెల రాజేశ్వరి (బీఎస్సీ) విద్యావంతురాలు కావడం వల్ల ఆమె అభ్యర్థిత్వానికి గ్రామస్థులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఇదే మండలంలోని సర్వాయి సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నిక ఏకగ్రీవానికి స్థానికులు నిర్ణయించారు. ఈ పంచాయతీ పరిధిలో సర్వాయి, చిట్యాల, భూపతిపూర్ గ్రామాలు ఉన్నాయి. ఎస్టీ మహిళకు కేటాయించిన సర్పంచ్ పదవికి రొటేషన్ పద్ధతిన సర్వాయి, చిట్యాల, భూపతిపూర్ గ్రామాల నుంచి అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని నిర్ణయించారు. ఆదివారం సమావేశమై మొదట సర్వాయి నుంచి ఆలెం శారదను ఎన్నుకున్నారు. వార్డుసభ్యుల ఎన్నిక ఏకగ్రీవానికి కూడా తీర్మానించారు. కన్నాయిగూడెం మండలంలోని ముప్పనపల్లి సర్పంచ్‌గా చీదరి మౌనికను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 1996 నుంచి ఇక్కడ ఎన్నిక ఏకగ్రీవం అవుతున్నది. ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి, శివాపురం, ముళ్లకట్ట, అల్లంవారి గణపురం, చెల్పాక పంచాయతీల్లో సర్పంచ్, వార్డుసభ్యుల ఏకగ్రీవ ఎన్నికకు నిర్ణయం తుది దశలో ఉన్నది. పలిమెల మండలంలోని మోదేడు, దమ్మూరు సర్పంచ్, వార్డుసభ్యుల ఏకగ్రీవ ఎన్నికకు నిర్ణయించినట్టు తెలిసింది. వెంకటాపురం మండలంలోని నూగూర్ సర్పంచ్, వార్డుసభ్యుల ఏకగ్రీవానికి గ్రామస్థులు ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం.




కన్నాయిగూడెం మండలం ఐలాపూర్‌లో ఏకగ్రీవం కోసం చేతులెత్తిన గ్రామస్థులు

అదేబాటలో కొత్త పంచాయతీలు

ఇటీవల కొత్తగా ఉనికిలోకి వచ్చిన పంచాయతీల్లోనూ ఏకగ్రీవానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. రేగొండ మండలంలోని దుంపిళ్లపల్లి సర్పంచ్ పదవికి మేరుగు విజయ్‌కుమార్, చెంచుపల్లికి బండి లస్మక్కను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిసింది. మేరుగు విజయ్‌కుమార్ రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల విలువచేసే 16 గుంటల భూమిని గ్రామ అభివృద్ధికి ఇచ్చేందుకు ముందు కొచ్చినట్టు సమాచారం. మండలంలో ని చెన్నాపూర్ అభివృద్ధికి రూ.11 లక్షలు ఇచ్చేందుకు ముందుకొచ్చిన దేవునూరి ప్రణీతను సర్పంచ్ పదవికి ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఉపసర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నిక ఏకగ్రీవానికి కూడా తీర్మానించారు. ఇదే మండలంలోని మరో గ్రామంలో సర్పంచ్ పదవిని ఆశిస్తున్న వ్యాపారి ఒకరు రూ.40 లక్షల విలువచేసే భూమిని పంచాయతీకి విరాళంగా ఇచ్చేందుకు ముందుకురావడంతో ఏకగ్రీవానికి స్థానికులు ప్రయత్నిస్తున్నారు. చిట్యాల మండలంలోని కైలాపూర్ సర్పంచ్ పదవికి చింతల శ్వేతను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని నిర్ణయించారు. సోమవారం గ్రామస్థుల సమక్షంలో శ్వేత నామినేషన్ దాఖలుచేశారు. భూపాలపల్లి మండలంలో ఆముదాలపల్లి సర్పంచ్ పదవికి బౌతు రమాదేవి ఏకగ్రీవానికి నిర్ణయించారు. ఇదే మండలం మరో నాలుగు పంచాయతీల్లో ఏకగ్రీవానికి స్థానికులు పట్టుదలతో ఉన్నారు. టేకుమట్ల మండలం పంగిడిపల్లి సర్పంచ్ పదవి జనరల్ మహిళకు రిజర్వ్ అయింది. ఇక్కడ సర్పంచ్ పదవికి ఢిల్లీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రియాంక మహాజన్ సోమవారం నామినేషన్ దాఖలుచేశారు. పంగిడిపల్లి గ్రామస్థుడు కాసర్ల అరవింద్‌రెడ్డితో ఆమెకు ప్రేమ వివాహం జరిగింది. ప్రస్తుతం ప్రియాంక హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగిగా పనిచేస్తున్నారు.

ఉపసర్పంచన్నా అవుదాం



జాయింట్ చెక్ పవర్‌తో పెరిగిన ప్రాధాన్యం

రిజర్వుడ్ గ్రామాల్లో ఉపసర్పంచ్ పదవికి డిమాండ్

ప్యానెల్‌గా దిగుతున్న వార్డు సభ్యులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : సర్పంచ్ పక్క సీటు.. జాయింట్ చెక్ పవర్.. దీంతో ఉప సర్పంచ్ పదవులకూ డిమాండ్ పెరిగింది. కొన్ని గ్రామాల్లో రిజర్వేషన్ కారణంగా సర్పంచ్ స్థానానికి పోటీ చేయలేని నాయకులు ఉప సర్పంచ్ పదవిపై కన్నేశారు. ఉప సర్పంచ్ పదవి దక్కించుకుని గ్రామంలో చక్రం తిప్పాలని చూస్తున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018లో సర్పంచ్‌తోపాటు ఉప సర్పంచ్‌తో జాయింట్ చెక్‌పవర్ అధికారాలను కల్పించారు. పలు స్టాండింగ్ కమిటీలు కూడా ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్నాయి. గ్రామాభివృద్ధికి నిధులు సక్రమంగా వినియోగించేందుకు ఈ జాయింట్ చెక్‌పవర్ నిబంధన విధించింది. ఇప్పటి వరకు ఉపసర్పంచ్‌కు ఇలాంటి బాధ్యతలేమీ లేవు. కేవలం సర్పంచ్ లేనప్పుడు మాత్రమే గ్రామసభల్లో ఉపసర్పంచ్ ప్రాతినిధ్యం వహించేవారు. ఇకపై పంచాయతీలకు విడుదల చేసే నిధుల వ్యయంపై సర్పంచ్, ఉపసర్పంచ్ కలిసి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఉపసర్పంచ్ అంటే నామమాత్రంగా తీసుకున్న నేతలంతా బాధ్యతలు పెరుగడంతో ఉపసర్పంచ్ పదవైనా సరే అనే ధోరణిలో బరిలోకి నిలుస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో కొన్ని వార్డు స్థానాల్లో తమ టీం అంటూ ప్యానెల్‌గా పోటీచేస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్యానెల్‌గా వార్డు స్థానాలకు పోటీ చేయడం ఇదే ప్రథమమని పరిశీలకులు చెప్తున్నారు. ఎన్నికల ఖర్చు, సదరు వార్డు స్థానాలను గెలిపించుకునే బాధ్యతలను కూడా ఉప సర్పంచ్ పదవిని ఆశిస్తున్న నేతలే తీసుకుంటున్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వ్ అయిన గ్రామాల్లో ఉపసర్పంచ్ పదవులకు డిమాండ్ పెరిగింది. మహిళలకు కేటాయించిన గ్రామాల్లో కూడా ఉపసర్పంచ్‌లుగా గ్రామ, మండలస్థాయి నేతలు పోటీ పడుతున్నారు. ఎందుకంటే మరో పదేండ్ల వరకూ రిజర్వేషన్లు ఇవే ఉండటంతో సర్పంచ్‌గా తమకు అవకాశం రాదని తెలిపోవడంతో ఉపసర్పంచ్ పదవులైనా సరే అంటూ పోటీకి దిగుతున్నారు. ఇప్పటి వరకు కేవలం సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేస్తామన్న నేతలు ఇప్పుడు వార్డుస్థానాలకు నామినేషన్లు దాఖలుచేస్తున్నారు.

తొలి విడుత పంచాయతీకి నేటితో నామినేషన్లు ముగింపు

మొదటిపేజీ తరువాయి...

జాబితాను విడుదల చేస్తారు. అదేరోజు అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు. నామినేషన్లు దాఖలుచేసిన అభ్యర్థులు ఇప్పటికే ఆయా గ్రామాలు, వార్డుల్లో ప్రచారం చేసుకుంటున్నారు. గుర్తులు కేటాయించిన తర్వాత ప్రచారం మరింత వేడెక్కనుంది. ఈ నెల 21న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నారు. ఈ మధ్యలోనే జనవరి 11 నుంచి రెండో విడుత నామినేషన్ల స్వీకరణ, 16 నుంచి మూడో విడుత నామినేషన్ల స్వీకరణ మొదలవుతుంది. తొలి విడుత ఎన్నికలు జరిగే 4,479 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకుగాను రెండోరోజైన మంగళవారం 5413 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండ్రోజుల్లో దాఖలైనవి కలుపుకొంటే 8524 నామినేషన్లు వచ్చాయి. ఇక 39,822 వార్డులకుగాను రెండోరోజు 16,946 నామినేషన్లు వచ్చాయి. వార్డులకు రెండ్రోజుల్లో దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్య 20,902గా ఉన్నది. మంగళవారం సిద్దిపేట జిల్లాలో సర్పంచ్ పదవులకు అత్యధికంగా 404 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డుసభ్యులుగా సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 1874 మంది నామినేషన్లు వేశారు. కనిష్ఠంగా సర్పంచ్ పదవులకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 50 నామినేషన్లు దాఖలుకాగా, వార్డుసభ్యుల పదవులకు కనిష్ఠంగా వనపర్తి జిల్లాలో 141 నామినేషన్లు దాఖలయ్యాయి. బుధవారం చివరిరోజు కావడంతో జోరుగా నామినేషన్లు దాఖలవుతాయని అంచనావేస్తున్నారు.

కొనసాగుతున్న ఏకగ్రీవాలు

రాష్ట్రంలో మొదటి విడుత పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఏకగ్రీవాలు కూడా జోరుగా సాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో పంచాయతీ పాలకవర్గాలను ఏకగ్రీవం చేసుకుంటున్నారు. ఇందులో నూతనంగా ఏర్పాటైన పంచాయతీలు ముందువరుసన ఉంటున్నాయి. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే రూ.10 లక్షల నజరానాతోపాటు అదనంగా పది నుంచి 15 లక్షల వరకు ఇస్తామని వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రకటించడం గ్రామాల్లో చైతన్యం కలిగిస్తున్నది. ఈ క్రమంలోనే మంగళవారం వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మండలం లింగమోరిగూడెం, ఇదే జిల్లా ధర్మసాగర్ మండలంలోని నూతన గ్రామపంచాయతీ కాశీగూడెం పాలకవర్గాలు ఏకగ్రీవమయ్యాయి. నాగర్‌కర్నూలు జిల్లా చారకొండ మండలం కమలాపూర్, లింగాల మండలం పద్మన్నపల్లిలో సర్పంచ్‌లను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

బలవంతంగా ఏకగ్రీవాలు చేస్తే జైలే

ఆరేండ్లపాటు పోటీ చేయకుండా అనర్హత

జిల్లా కలెక్టర్లు విచారణ చేయాలి

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

బలవంతంగా, వేలంపాటలతో గ్రామ పంచాయతీ పాలకవర్గాలను ఏకగ్రీవంచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. దీనిపై అన్ని జిల్లాల కలెక్టర్లు, పంచాయతీ అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నామని, ఎక్కడైనా ఏకగ్రీవం చేసే నేపథ్యంలో బలవంతపెట్టినా, వేలం పాటలు నిర్వహించినా చర్యలు తప్పవన్నారు. ఎన్నికైన సర్పంచ్‌లు ఇలా వేలంపాటతో ఓట్లు కొనుగోలు చేసినట్టు తేలితే వారిపై కూడా చర్యలుంటాయని స్పష్టం చేశారు. బలవంతపు ఏకగ్రీవాలు చేస్తే ఏడాది జైలు శిక్షతోపాటు ఆరేండ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటువేస్తామని హెచ్చరించారు. ఏకగ్రీవ పంచాయతీలపై జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులు స్పష్టమైన విచారణ చేయాలని సూచించారు. కలెక్టర్లు, సాధారణ అబ్జర్వర్లు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. ఎన్నికల్లో ఇబ్బందులు, బలవంతంగా ఓట్లు



కొనుగోలు చేయడం వంటి అంశాలపై జిల్లా కలెక్టర్లు స్పెషల్ సెల్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ స్పెషల్ సెల్ నుంచి ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. రిటర్నింగ్ అధికారులు పూర్తి విచారణ చేసిన తర్వాత కలెక్టర్లకు ఏకగ్రీవ పంచాయతీల వివరాలు ఇవ్వాలని, కలెక్టర్లు వాటిని ప్రకటించాలని ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ స్పష్టంచేశారు.

గిరిజనులు లేకపోయినా ఎస్టీ రిజర్వుడ్!

అమ్రాబాద్ రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలో ఐదు గ్రామ పంచాయతీలు ఎస్టీలకు రిజర్వు అయినా ఎలాంటి ఉపయోగం లేకుండాపోయింది. అమ్రాబాద్ మండలంలో ప్రస్తుతం 20 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో ఐదు పంచాయతీల్లో ప్రశాంత్‌నగర్, లక్మాపూర్, వంగురోనిపల్లి, కుమ్మరోనిపల్లి, కల్మలోనిపల్లి పంచాయతీలు ఎస్టీలకు కేటాయించినా ఇక్కడ ఒక్క గిరిజన కుటుంబం కూడా లేకపోవడం గమనార్హం.



మంగళవారం ప్రగతిభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలుసుకున్న బ్యాడ్మింటన్ ఆటగాళ్లు పారుపల్లి కశ్యప్, గురుసాయి దత్, ఐటీ కార్యదర్శి జయేశ్‌రంజన్

అంధుల ఫుట్‌బాల్ సంఘానికి రూ.50వేల సాయం

భారత ఫుట్‌బాల్ జట్టు ఔదార్యం

అబుదాబి: క్రమశిక్షణ ఉల్లంఘిస్తూ జట్టు సభ్యులు చెల్లించిన చిన్నచిన్న జరిమానాలను ఉత్తమ కార్యానికి ఉపయోగించాలని భారత ఫుట్‌బాల్ జట్టు నిర్ణయించింది. గత కొన్నేండ్లుగా శిక్షణకు ఆలస్యంగా రావడం, నిబంధనలకు విరుద్ధంగా మొబైల్ ఫోన్స్ తీసుకురావడం, టీమ్ జెర్సీ వాడకపోవడం వంటి చిన్న కారణాలకు స్వల్పమొత్తంలో జరిమానాలు వసూలు చేస్తున్నారు. ఈ జరిమానాల నుంచి రూ.50వేలను భారత అంధుల ఫుట్‌బాల్ సంఘానికి విరాళం ఇవ్వనున్నారు. 'ఆట నుంచి సంపాదించిన మొత్తాన్ని తిరిగి కొంత చెల్లించడం ముఖ్యమైనది. అంధులు ఉపయోగించే ఫుట్‌బాల్స్ ను దాదాపు 50 డాలర్లను వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. మేం ఇస్తున్న విరాళం వారికి కొన్ని ఫుట్‌బాల్స్‌ను అందిస్తుంది' అని భారత ఫుట్‌బాల్ జట్టు చీఫ్ కోచ్ స్టీఫెన్ కాన్‌స్టాంటైన్ అన్నాడు. ఫుట్‌బాల్స్ కొనుగోలు చేసేందుకు 50వేలు ఇస్తున్నందుకు భారత ఫుట్‌బాల్ సభ్యులకు అంధుల ఫుట్‌బాల్ సంఘం డైరెక్టర్ సునీల్ జే మాథ్యూ కృతజ్ఞతలు తెలిపాడు.

బీసీసీఐ బంపర్ బొనాంజా

ఒక్కో మ్యాచ్‌కు 15 లక్షల ప్రైజ్‌మనీ



న్యూఢిల్లీ: సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఆస్ట్రేలియా గడ్డపై టెస్ట్ సిరీస్ విజయాన్ని అందుకున్న భారత క్రికెటర్లపై ప్రశంసలకు తోడు కాసుల వర్షం కురుస్తున్నది. 71 ఏండ్ల తర్వాత కంగారూల ఇలాఖాలో చరిత్రాత్మక విజయాన్ని సాధించిన కోహ్లీసేనకు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బీసీసీఐ) బంపర్ బొనంజా ప్రకటించింది. దేశ క్రికెట్ చరిత్రలో మరుపురాని విజయాన్ని ముద్దాడిన టీమ్‌ఇండియా క్రికెటర్ల ప్రదర్శనకు బీసీసీఐ తగిన నజరానా ప్రకటించింది. నాలుగు టెస్ట్‌ల సిరీస్‌లో తుది జట్టుకు ఆడిన ఆటగాళ్లకు ఒక్కొక్కరికి రూ.15 లక్షల రూపాయల ప్రైజ్‌మనీ ఇస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపింది. 'మ్యాచ్ ఫీజుకు సమానంగా ఒక మ్యాచ్‌కు ఒక్కో ఆటగానికి 15 లక్షలు, రిజర్వ్ ప్లేయర్లకు రూ.7.5 లక్షలు, కోచింగ్ సిబ్బందికి రూ.25 లక్షలు ప్రకటించాము. ఇక నాన్‌కోచింగ్ సిబ్బందికి వేతనానికి సమానంగా నజరానా ఇస్తున్నాం' అని బీసీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. నాలుగు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా విరాట్ కోహ్లీ కెప్టెన్సీలోని భారత్..అడిలైడ్‌తో పాటు మెల్‌బోర్న్‌లో విజయం సాధించి సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

బుమ్రాకు విశ్రాంతి..
సిరాజ్‌కు పిలుపు

ఆసీస్, కివీస్ వన్డే సిరీస్‌లకు ఎంపిక .. కివీస్‌తో టీ20 సిరీస్‌లో కౌల్‌కు చోటు



సిరాజ్

సిడ్నీ: రానున్న ప్రపంచకప్ టోర్నీని దృష్టిలో పెట్టుకుని భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నది. స్టార్ బౌలర్లపై నెలకొన్న ఒత్తిడిని తగ్గించే క్రమంలో అందుకు అనుగుణంగా మార్పులు చేస్తున్నది. ఈనెల 12న ఆస్ట్రేలియాతో మొదలయ్యే మూడు వన్డేల సిరీస్‌తో పాటు న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల సిరీస్ నుంచి బుమ్రాకు విశ్రాంతినిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ యార్కర్ స్పెషలిస్టు స్థానంలో దేశవాళీ టోర్నీల్లో నిలకడగా రాణిస్తున్న హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను కొత్తగా తీసుకున్నది. మరోవైపు కివీస్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం సిద్దార్థ్ కౌల్‌ను ఎంపిక చేసింది. తాజాగా ముగిసిన ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్‌లో బుమ్రా 21 వికెట్లతో టాపర్‌గా నిలిచాడు. పేస్ పిచ్‌లను తనకు అనుకూలంగా మలుచుకుంటూ వికెట్ల వేట కొనసాగించాడు. మిగతా పేస్ బౌలర్లతో పోలిస్తే..సిరీస్ మొత్తమ్మీద బుమ్రా అందరికంటే ఎక్కువగా 157.1 ఓవర్లు విసిరాడు. స్పిన్నర్లలో నాథన్ లియాన్(242.1 ఓవర్లు) ముందున్నాడు. ఓవరాల్‌గా అన్ని ఫార్మాట్లు కలిపి గతేడాది బుమ్రా 511.3 ఓవర్లు బౌలింగ్ చేశాడు. రానున్న మేజర్ సిరీస్‌లను దృష్టిలో ఉంచుకుని పని ఒత్తిడి తగ్గించేందుకు బుమ్రాకు విశ్రాంతినిచ్చామని బోర్డు పేర్కొంది. ఈనెల 23 నుంచి కివీస్‌తో ఐదు వన్డేల సిరీస్ మొదలవుతుంది.

వన్డేల్లోకి సిరాజ్:
హైదరాబాదీ స్పీడ్‌స్టర్ మహ్మద్ సిరాజ్..శ్రమకు తగిన ఫలితం దక్కింది. గత కొన్ని నెలలుగా దేశవాళీ టోర్నీల్లో అతను నిలకడగా రాణిస్తూ వస్తున్నాడు. భారత్ తరపున నిదహాస్ ట్రోఫీలో శ్రీలంకపై ఆఖరి టీ20 మ్యాచ్ ఆడిన సిరాజ్ వన్డే అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్నాడు. గత జూలై నుంచి భారత్ ఏ జట్టు తరపున సిరాజ్ మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నాడు. మొత్తం ఎనిమిది మ్యాచ్‌ల్లో 18.04 సగటుతో 47 వికెట్లు తీశాడు. ఆ తర్వాత వెస్టిండీస్ 'ఎ'తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్లతో పాటు ఇంగ్లండ్ లయన్స్‌తో 7 వికెట్లు తీశాడు. ఆగస్టులో బెంగళూరులో దక్షిణాఫ్రికా 'ఏ'తో జరిగిన నాలుగు రోజుల మ్యాచ్‌లో 14 వికెట్లు తీసిన సిరాజ్..ఆస్ట్రేలియా 'ఏ'తో మ్యాచ్‌లో 11 వికెట్లతో (11/136) అదరగొట్టాడు. ఇటీవల జరిగిన న్యూజిలాండ్ పర్యటనలో భారత్ 'ఎ' తరపున మూడు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో ఏడు వికెట్లతో ఆకట్టుకున్నాడు. సొంతగడ్డ హైదరాబాద్‌లో పంజాబ్‌తో ఈ మధ్య జరిగిన రంజీ మ్యాచ్‌లో సిరాజ్ 7 వికెట్లు తీసి సూపర్ ఫామ్ కనబరిచాడు. టోర్నీ ఏదైనా నిలకడగా రాణిస్తూ సెలెక్టర్ల నమ్మకాన్ని చూరగొన్నాడు. ఇదిలా ఉంటే టీ20ల కోసం సిద్దార్థ్ కౌల్‌ను సెలెక్టర్లు ఎంపిక చేశారు.

జట్టు వివరాలు

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌లకు వన్డే జట్టు: కోహ్లీ(కెప్టెన్), రోహిత్, రాహుల్, ధవన్, రాయుడు, కార్తీక్, జాదవ్, ధోనీ, హార్దిక్, కుల్దీప్, చాహల్, జడేజా, భువనేశ్వర్, సిరాజ్, ఖలీల్ అహ్మద్, షమీ.
కివీస్‌తో టీ20 సిరీస్: కోహ్లీ(కెప్టెన్), రోహిత్, రాహుల్, ధవన్, రిషభ్, కార్తీక్, జాదవ్, ధోనీ, హార్దిక్, కృనాల్, కుల్దీప్, చాహల్, భువనేశ్వర్, సిరాజ్, ఖలీల్, సిద్దార్థ్ కౌల్.



ఐపీఎల్ ప్రైజ్ మనీ
లీగ్ విజేత: రూ.20 కోట్లు
రన్నరప్ : రూ.12.5 కోట్లు

ఐపీఎల్ జట్లు
సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్‌కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్, కింగ్స్ ఎలెవన్ పంజాబ్, రాజస్థాన్ రాయల్స్. 2018 డిసెంబర్ నెలలో జరిగిన వేలంలో 60 మంది ఆటగాళ్ల కొనుగోలు కోసం ఫ్రాంచైజీలు రూ.106.80 కోట్లు వెచ్చించాయి.

స్వదేశంలోనే ఐపీఎల్

మార్చి 23 నుంచి ప్రారంభం..
అన్ని వర్గాలతో చర్చించిన తర్వాత షెడ్యూల్ విడుదల
సీవోఏ కమిటీ చైర్మన్ వినోద్ రాయ్

ప్రపంచంలోనే అత్యధికంగా కాసుల వర్షం కురిపించే టీ20 లీగ్..బీసీసీఐ మానస పుత్రికగా ..క్రికెట్ అభిమానులకు టీ20 మజాను పుష్కలంగా అందించే ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)వేదిక ఎక్కడ అన్న విషయం తేలిపోయింది. 2009 ఎన్నికల కారణంగాదక్షిణాఫ్రికాలో.. 2014 ఏడాదిలో కొన్ని ఐపీఎల్ మ్యాచ్‌లు యూఏఈలో నిర్వహించడంతో 12వ సీజన్ కూడా విదేశాలకు తరలిపోనుందన్న పుకార్లు తేలిపోయాయి. మనదేశంలోనే మార్చి 23 నుంచి ఈ ఏడాది ఐపీఎల్‌ను నిర్వహిస్తున్నట్లు సీవోఏ కమిటీ తేల్చిచెప్పింది.. దేశం వెలుపల లీగ్ నిర్వహణతో నష్టం వస్తుందన్న ఫ్రాంచైజీల వాదనకు బీసీసీఐ తలొగ్గినట్లుగా తెలుస్తున్నది..

న్యూఢిల్లీ: ఉత్కంఠ వీడింది. 2019 సీజన్ ఐపీఎల్‌ను మార్చి 23 నుంచి మన దేశంలోనే నిర్వహించనున్నట్లు సుప్రీంకోర్టు నియమిత బీసీసీ పాలక కమిటీ (సీవోఏ) మంగళవారం ప్రకటించింది. మనదేశంలో సాధారణ ఎన్నికలు, ఈ ఏడాది మే 30 నుంచి ఇంగ్లండ్ వేదికగా ప్రపంచకప్ ప్రారంభం కానుండడంతో నియమిత షెడ్యూల్‌ను కాస్త ముందుకు జరిపినట్లు కమిటీ పేర్కొంది. ఐపీఎల్ పూర్తిస్థాయి షెడ్యూల్‌తోపాటు ప్రారంభ, ముగింపు వేడుకలకు వేదికలను నిర్ణయించేందకు సీవోఏ కమిటీ చైర్మన్ వినోద్‌రాయ్, సీవోఏ సభ్యురాలు మహిళల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ సమావేశమయ్యారు. బీసీసీఐ నూతన రాజ్యాంగం ప్రకారం ప్రతి అంతర్జాతీయ టోర్నీకి ముందు ఆటగాళ్లకు కనీసం 15 రోజులు విశ్రాంతి కల్పించాల్సి ఉంది. అందుకే అన్నీ ఆలోచించి షెడ్యూల్‌ను ముందుకు జరిపినట్లు సీవోఏ చైర్మన్ వినోద్ రాయ్ వెల్లడించారు.' ఇప్పటివరకు కొనసాగుతున్న ఐపీఎల్ ప్రధాన వేదికలకు ప్రత్యామ్నాయంగా మరికొన్ని వేదికలు సిద్ధం చేశాం. మ్యాచ్‌లను తరలించాల్సి పరిస్థితి వస్తే ఈ వేదికలు సిద్ధంగా ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థలను సంప్రతించాకే నిర్ణయం తీసుకున్నాం. ఎన్నికల ప్రక్రియ తేదీలను ప్రకటించాక సభలు, ర్యాలీల నిర్వహణతోపాటు పోలింగ్ ప్రక్రియ, ఎన్నికల లెక్కింపు కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ వేదికలను ఎంచుకోవాల్సి వచ్చింది' అని కమిటీ తెలిపింది. 2010 సీజన్ నుంచి ప్రతి ఏడాది ఏప్రిల్ రెండో వారంలో ప్రారంభమై మే నెల చివరివారంలో ఐపీఎల్ ముగుస్తున్న విషయం తెలిసిందే. సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలతోపాటు వన్డే ప్రపంచకప్ మే చివరన ప్రారంభం కానుండడంతో మార్చి 23 నుంచి లీగ్ నిర్వహించాలని నిర్ణయించారు. 'లోక్‌సభ ఎన్నికల తేదీల షెడ్యూల్‌ను బట్టి ఐపీఎల్ ప్రారంభ, ముగింపు వేడుకల తేదీలతోపాటు ఐపీఎల్ పూర్తిస్థాయి షెడ్యూల్‌ను వెలువరిస్తాం. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్నికల అధికారులు, భద్రతా సంస్థలతోపాటు సంబంధిత అన్ని వర్గాలతో చర్చించిన అనంతరమే వేదికల విషయంలో స్పష్టత వస్తుంది. వివిధ దశల్లో జరిగే ఎన్నికల షెడ్యూల్‌కు ఇబ్బంది లేకుండా తేదీలను ఖరారు చేసి త్వరలోనే షెడ్యూల్‌ను విడుదల చేస్తాం' అని సీవోఏ కమిటీ చీఫ్ వినోద్ రాయ్ పేర్కొన్నారు. ఈ మేరకు అన్ని ఐపీఎల్ ఫ్రాంచైజీలకు బీసీసీఐ సమాచారం అందించినట్లు తెలిసింది.

విదేశాలకు రెండుసార్లు ..
సాధారణ ఎన్నికల కారణంగా ఇప్పటివరకు ఐపీఎల్‌ను రెండుసార్లు విదేశాల్లో నిర్వహించారు. 2009 ఐపీఎల్ రెండో సీజన్‌ను పూర్తిగా దక్షిణాఫ్రికాలో నిర్వహించారు. 2014 ఎన్నికల కారణంగా యూఏఈలో కొన్ని ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించిన విషయం విదితమే. మనదేశంలోనే కాదు.. అంతర్జాతీయంగానూ ఐపీఎల్ పొట్టి క్రికెట్‌లో నంబర్‌వన్ లీగ్‌గా ప్రాచుర్యం సంపాదించుకుంది. అత్యంత ధనిక బోర్డుగా బీసీసీఐ నిలిచిందంటే ఐపీఎల్ మాత్రమే కారణమన్నది తెలిసిందే. ఈ ఏడాది ఎన్నికలు జరగనుండడంతో మరోసారి ఐపీఎల్ లీగ్ విదేశాలకు తరలిపోనుందని గత కొన్నిరోజులుగా కథనాలు వెలువడ్డాయి. కాగా.. బీసీసీఐ పాలకుల కమిటీ ప్రకటనతో ఈ ఊహాగానాలకు తెరపడింది.



వినోద్ రాయ్ — డయానా ఎడుల్జీ



పుజార@3

నంబర్ వన్‌లోనే టీమ్ ఇండియా
ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్

దుబాయ్: ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్ల హవా కొనసాగుతున్నది. ఆస్ట్రేలియా గడ్డపై చిరస్మరణీయ విజయంలో కీలకమైన క్రికెటర్లు తాజా ర్యాంకింగ్స్‌లో అదరగొట్టారు. జట్టును ముందుండి నడిపించిన కెప్టెన్ విరాట్ కోహ్లీ 922 పాయింట్లతో బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌లో దిగ్విజయంగా కొనసాగుతున్నాడు. భారత సుదీర్ఘ కలను సాకారం చేయడంలో కీలకమైన చతేశ్వర్ పుజార 881 పాయింట్లతో ఒక ర్యాంక్ మెరుగుపర్చుకుని మూడో ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఆసీస్‌తో నాలుగు టెస్ట్‌ల సిరీస్‌లో మూడు సెంచరీల సహాయంతో పుజార 521 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అవార్డును దక్కించుకున్న సంగతి తెలిసిందే. ప్రపంచస్థాయి ఆసీస్ బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొంటూ ఈ నయావాల్ పరుగుల ప్రవాహాన్ని సృష్టించాడు. మిగతా బ్యాట్స్‌మెన్ విషయానికొస్తే ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా(488) ఆరు ర్యాంక్‌ల మెరుగుతో 57వ ర్యాంక్‌కు చేరుకోగా, ఐదు ర్యాంక్‌లు ఎగబాకి యువ ఓపెనర్ మయాంక్ అగర్వాల్(472) 62వ ర్యాంక్‌లో నిలిచాడు. ఆఖరి రెండు టెస్ట్‌లాడిన ఈ ఇద్దరు తమకు అందివచ్చిన అవకాశాలను చక్కగా సద్వినియోగం చేసుకున్నారు. ముఖ్యంగా కేఎల్ రాహుల్, మురళీ విజయ్ పేలవ ప్రదర్శనతో జట్టుకు భారంగా మారిన నేపథ్యంలో దేశవాళీ క్రికెట్‌లో దుమ్ముదులిపిన మయాంక్ మెల్‌బోర్న్‌లో భారత్ తరపున టెస్ట్ అరంగేట్రం చేశాడు. మరోవైపు గాయం కారణంగా స్టార్ స్పిన్నర్ అశ్విన్ అర్ధంతరంగా వైదొలుగడంతో ఆ స్థానాన్ని జడేజాతో భర్తీచేశారు. బౌలింగ్ విషయానికొస్తే..21 వికెట్లతో జట్టు సిరీస్ విజయంలో కీలకమైన స్పీడ్‌స్టర్ జస్‌ప్రీత్ బుమ్రా(711) 16వ ర్యాంక్‌లో నిలువగా, మహ్మద్ షమీ(660)కి 22వ ర్యాంక్ దక్కింది. సిడ్నీ టెస్ట్‌లో ఐదు వికెట్లతో రాణించిన చైనామన్ కుల్దీప్ యాదవ్(402) ఏడు ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని కెరీర్‌లో అత్యుత్తమంగా 45వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

రిషబ్ రికార్డు ర్యాంక్:
భారత యువ వికెట్‌కీపర్, బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ పరుగుల వేటలోనే కాదు ర్యాంకింగ్స్‌లోనూ సత్తాచాటాడు. పుజార తర్వాత ఆసీస్‌తో సిరీస్‌లో అత్యధిక పరుగులు(350) చేసిన పంత్ ఏకంగా 21 ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని 673 పాయింట్లతో 17వ ర్యాంక్‌లో నిలిచాడు. దీంతో 1973లో భారత మాజీ వికెట్‌కీపర్ ఫారుఖ్ ఇంజనీర్ టెస్ట్‌ల్లో నెలకొల్పిన అత్యుత్తమ ర్యాంక్‌ను పంత్ తాజాగా అందుకున్నాడు. భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలందించిన ఎమ్‌ఎస్ ధోనీ తన టెస్ట్ కెరీర్‌లో అత్యుత్తమంగా 19వ ర్యాంక్‌కే పరిమితమయ్యాడు. ఆసీస్ పర్యటనను 59వ ర్యాంక్‌తో మొదలుపెట్టిన ఈ ఢిల్లీ డాషర్..తొలిసారి తన కెరీర్‌లో టాప్-20 ర్యాంకింగ్స్‌లోకి దూసుకొచ్చాడు. సిరీస్‌లో ఆఖరిదైన సిడ్నీ టెస్ట్‌లో అజేయ సెంచరీ(159)తో జట్టు భారీ స్కోరుకు కారణమయ్యాడు. ఆసీస్ బౌలర్లను ఉతికి ఆరేస్తూ సిడ్నీలో తన పరుగుల దాహాన్ని తీర్చుకున్నాడు.

భారత్ నంబర్‌వన్

ఆస్ట్రేలియాతో నాలుగు టెస్ట్‌ల సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకున్న భారత్ ర్యాంకింగ్స్‌లో ఎలాంటి మార్పులేదు. 116 పాయింట్లతో నంబర్‌వన్ ర్యాంక్‌లోనే కొనసాగుతున్నది. సొంతగడ్డపై భారత్‌కు తొలిసారి సిరీస్ చేజార్చుకున్న ఆసీస్ ఒక పాయింట్ కోల్పోయి 101 పాయింట్లతో ఐదో ర్యాంక్‌లో కొనసాగుతున్నది.

కోహ్లీసేనది గొప్ప బ్యాటింగ్ కూర్పు కాదు



ఇయాన్ చాపెల్

న్యూఢిల్లీ: ఆసీస్ గడ్డపై తొలిసారి టెస్ట్ సిరీస్ సాధించిన టీమ్ ఇండియాపై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ ప్రశంసల వర్షం కురిపించాడు. ప్రస్తుత భారత జట్టు బౌలింగ్, ఫీల్డింగ్‌లలో ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుగా పేర్కొన్నాడు. కాగా, బ్యాటింగ్‌లో మాత్రం కోహ్లీసేన బలహీనంగా ఉందని, ఇంతకుముందు ఇంతకంటే బలమైన బ్యాటింగ్ కూర్పును చూసినట్లు వివరించాడు. 'ప్రస్తుత భారత జట్టు బౌలింగ్, ఫీల్డింగ్ రంగాల్లో బలోపేతంగా ఉంది. ప్రస్తుత బ్యాటింగ్ కూర్పు బలమైనదే అయినా.. ఇంతకంటే బలమైన భారత బ్యాటింగ్ కూర్పును ఇంతకుముందు చూశాను' అని చాపెల్ అన్నాడు. ఆసీస్ గడ్డపై భారత పేస్ బౌలింగ్ త్రయం ఇషాంత్, షమీ, బుమ్రా అద్భుతంగా రాణించారని కితాబిచ్చాడు. 70 ఆసీస్ వికెట్లలో 50 వికెట్లను ఈ ముగ్గురే పడగొట్టడం అద్భుతమన్నాడు. 'ఆసీస్ బౌలర్ల కంటే క్రమశిక్షణతో భారత బౌలర్లు బంతులేశారు. మెరుగైన స్వింగ్ రాబడుతూ సరియైన ప్రాంతాల్లో బంతులను వేసి ఫలితాన్ని రాబట్టారు' అని చాపెల్ అన్నాడు.

సెన్సెక్స్	నిఫ్టీ
35,980	10,802
↗131	↗30

ముడి చమురు (బ్రెంట్) ↗ 58.31 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ(రూ.లలో)	
24 క్యారెట్లు	32,690
22 క్యారెట్లు	32,540
వెండి (కిలో)	39,800

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	67.00	73.70
యూరో	75.70	83.70
బహ్రెయిన్ దినార్	178.60	190.60
కువైట్ దినార్	221.90	234.90
సౌదీ రియాల్	17.60	19.40
యూఏఈ దిర్హామ్	18.20	19.80

చికెన్ ధరలు

	(రూ.లలో)
ఫారం ధర	87.00
రిటైల్ లైవ్	109.00
డ్రెస్డ్	158.00
స్కిన్‌లెస్	180.00

నెక్ (వంద గుడ్లకు)

	(రూ.లలో)
హైదరాబాద్	453-00
రంగారెడ్డి	453-00
మెదక్	453-00
కరీంనగర్	455-00
వరంగల్	455-00
రిటైల్ ప్రైస్	5-15

చివర్లో కొనుగోళ్లు



మధ్యాహ్నం తర్వాత బ్యాంకింగ్ షేర్లలో వచ్చిన కొనుగోళ్ల మద్దతు, అంతర్జాతీయ మార్కెట్ల పాజిటివ్ ట్రెండ్‌తో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు కూడా లాభాలతో ముగిశాయి. చాల సేపు నష్టాల్లో ట్రేడ్ అయిన ప్రధాన సూచీలు బ్యాంకింగ్, ఫార్మా, ఆటో షేర్ల దన్నుతో లాభాలను ఆర్జించగలిగాయి. నిఫ్టీ 30.35 పాయింట్ల లాభంతో 10,802.15 వద్ద ముగియగా, సెన్సెక్స్ 130.77 పాయింట్ల లాభంతో 35,980.93 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు పెరగడంతో రూపాయి మారకం విలువ మరోసారి బలహీన పడింది. దీంతో మార్కెట్లు తొలుత ఒడిదుడుకులతో నష్టాల పాలయ్యాయి. బ్యాంకుల మొండి బకాయిలు తగ్గుముఖం పట్టాయన్న రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ వ్యాఖ్యలు, ప్రభుత్వానికి రూ. 40,000 కోట్ల ఆర్బీఐ స్పెషల్ డివిడెండ్ వంటి పాజిటివ్ వార్తలతో బ్యాంకింగ్ షేర్లు వెలుగులోకి వచ్చాయి. ఇండెక్స్ హెవీ వెయిట్స్ ఐసీఐసీఐ బ్యాంక్ కొత్త గరిష్ఠ స్థాయిని నమోదు చేయగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా మూడు శాతంకు పైగా లాభ పడడంతో ఇండెక్స్ నష్టాలన్నీ పూడ్చుకుపోయాయి. అమెరికా, చైనా వాణిజ్య చర్చలు, ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభం కావడంతో ఇన్వెస్టర్లు చాలా వరకు అప్రమత్త ధోరణిని అవలంభించారు. గత రెండు నెలలుగా సైడ్‌వేస్‌లో ట్రేడవుతున్న మార్కెట్లు ఆర్థిక ఫలితాలు, ఆర్థిక గణాంకాల ఆధారంగా మార్కెట్ నిర్ణయాత్మక దిశను నిర్దేశించుకునే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, బ్యాంకింగ్ రంగానికి వస్తున్న సానుకూల వార్తలతో ప్రభుత్వ రంగ బ్యాంకుల ఇండెక్స్ గరిష్ఠంగా 2.77 శాతం లాభపడింది. ఫార్మా 1.51 శాతం, బ్యాంక్ నిఫ్టీ 0.74 శాతం, ఆటో 0.45 శాతం, ఆర్థికసేవల రంగం 0.38 శాతం చొప్పున లాభపడ్డాయి. మీడియా ఇండెక్స్ 1.24 శాతం నష్టపోగా, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ ఇండెక్స్ అతి స్వల్ప నష్టాలతో దాదాపు ఫ్లాట్‌గా ముగిశాయి. మిడ్‌క్యాప్ 0.13 శాతం నష్టంతోనూ, స్మాల్‌క్యాప్ 0.25 శాతం లాభంతో ముగిసింది. ప్రధాన సూచీలు లాభాల్లో ముగిసినప్పటికీ మార్కెట్ బ్రెడ్త్ నెగటివ్‌గా ఉంది. ఎన్ఎస్ఈలో 908 షేర్లు నష్టాలతో ముగిస్తే, 869 షేర్లు లాభపడ్డాయి. ఎన్ఎస్ఈలో మొత్తం 20 షేర్లు 52 వారాల గరిష్ఠ స్థాయిని నమోదు చేయగా, 67 షేర్లు కొత్త 52 వారాల కనిష్ఠ స్థాయిని నమోదు చేశాయి. నిఫ్టీలోని సన్‌ఫార్మా 4.17 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 3.15 శాతం, ఎస్‌బీఐ 3.15 శాతం , టాటామోటార్స్ 2.62 శాతం చొప్పున లాభపడ్డాయి. కాగా, జీఎంటర్‌టెయిన్‌మెంట్ 2.99 శాతం, యూపీఎల్ 1.67 శాతం, కోటక్ బ్యాంక్ 1.49 శాతం, బీపీసీఎల్ 1.38 శాతం చొప్పున నష్టపోయాయి. ఎఫ్ఐఐలు రూ. 553.78 కోట్ల అమ్మకాలు జరపగా, డీఐఐలు రూ.698.17 కోట్ల కొనుగోళ్లు జరిపారు.

విలీనం వార్తలతో కుదేలు

విలీనం వార్తలతో గృహ్ ఫైనాన్స్, బంధన్ బ్యాంకు షేర్లు భారీ పతనాన్ని చవిచూశాయి. గృహ్ ఫైనాన్స్ షేరు 16.6 శాతం నష్టపోయి రూ. 256 ముగిసింది. ఒకదశలో రూ. 253.05 కనీస స్థాయిని కూడా నమోదు చేసింది. మరో బంధన్‌బ్యాంక్ కూడా ఒకదశలో 6 శాతం పైగా నష్టపోయి చివరికి 4.80 శాతం నష్టంతో 477.05 వద్ద ముగిసింది. ప్రతి 1000 గృహ్ ఫైనాన్స్ షేర్లకు 568 బంధన్ బ్యాంకు షేర్లు ఇచ్చే ప్రతిపాదనతో విలీన ప్రతిపాదనను రెండు కంపెనీల బోర్డులు ఆమోదం తెలిపాయి. ఈ విలీన ప్రతిపాదన ప్రకారం గృహ్ ఫైనాన్స్‌ను రూ. 20,900 కోట్లుగా అంచనా వేశారు. కాగా, దీంతో బంధన బ్యాంక్‌లో ప్రమోటర్ల వాటా 61 శాతానికి తగ్గనున్నది.

రియల్ జోష్

హైదరాబాద్‌లో పెరిగిన ఇండ్ల అమ్మకాలు

2018కిగాను విడుదలైన నివేదికలో వెల్లడించిన నైట్ ఫ్రాంక్ ఇండియా



హైదరాబాద్, జనవరి 8: హైదరాబాద్‌లో ఇండ్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. నిరుడు హౌజింగ్ సేల్స్ వృద్ధిపథంలో దూసుకెళ్లినట్లు ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా తమ తాజా నివేదికలో తెలియజేసింది. హైదరాబాద్‌సహ దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో గతేడాది గృహ విక్రయాలు 6 శాతం పెరిగినట్లు నైట్ ఫ్రాంక్ వెల్లడించింది. నిర్మాణ పరమైన అనుమతులు సులభంగా లభించడంతోపాటు రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్లు ధరలను తగ్గించడం, కొనుగోలుదారులను ఆకర్షించడానికి పరోక్షంగా రాయితీల వంటి వాటిని ఆఫర్ చేయడం ఇందుకు దోహదపడినట్లు సంస్థ ఈ సందర్భంగా అభిప్రాయపడింది. ఢిల్లీ-ఎన్సీఆర్, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, అహ్మదాబాద్‌ల్లో నివాసాల అమ్మకాలు పెరిగాయని, కోల్‌కతా, పుణెల్లో మాత్రం తగ్గాయని పేర్కొన్నది. ఇక అధిక అమ్మకాలతో అమ్ముడుకాని ఇండ్ల సంఖ్య 11 శాతం పడిపోయి దాదాపు 4.7 లక్షల యూనిట్లకు చేరిందని వివరించింది. కాగా, ఇతర సంస్థలతో పోల్చితే నైట్ ఫ్రాంక్ వృద్ధి రేటు 2018కిగాను తక్కువగా ఉండగా, జేఎల్ఎల్ ఇండియా 7 నగరాల్లో 47 శాతం వృద్ధిని, అనరాక్ 16 శాతం పురోగతిని ప్రకటించాయి. మరో సంస్థ ప్రాపర్టీటైగర్ కూడా తొమ్మిది నగరాల్లో ఇండ్ల అమ్మకాల వృద్ధి 25 శాతంగా ఉన్నట్లు చెప్పింది. అయితే ఈ తేడా ఆయా సంస్థలు ఎంచుకున్న నగరాల కారణంగా వచ్చినట్లు తెలుస్తున్నది. ఇకపోతే గతేడాది ఇండ్ల అమ్మకాలు 2,42,328 యూనిట్లుగా ఉన్నట్లు అంచనా. అంతకుముందు ఏడాది 20 17లో 2,28,072 యూనిట్ల అమ్మకాలైయ్యాయి. కాగా, ఏడేండ్ల తర్వాత దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్ తిరిగి పుంజుకున్నదని నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ అన్నారు. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేట్లు తగ్గడం, రియల్టర్లు చౌక గృహాల వైపు అడుగులేస్తుండటం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచిందని చెప్పారు. ఈ క్రమంలోనే బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) సంక్షోభం కూడా కొనుగోళ్లను అడ్డుకోలేకపోయిందని అభిప్రాయపడ్డారు.

ఆఫీస్ స్పేస్‌లో భాగ్యనగరానిదే హవా

ఆఫీస్ లీజింగ్ మార్కెట్‌లో దేశవ్యాప్తంగా భాగ్యనగరానిదే హవా అని నైట్ ఫ్రాంక్ తమ నివేదికలో పేర్కొన్నది. 'ఇండియా రియల్ ఎస్టేట్' అర్ధ వార్షిక నివేదిక పేరుతో మంగళవారం సంస్థ తమ పదో ఎడిషన్‌ను విడుదల చేసింది. రెసిడెన్షియల్, కమర్షియల్ మార్కెట్లలో హైదరాబాద్.. దేశంలోని మిగిలిన ఏ ప్రముఖ నగరాలకు లేనంత క్రేజ్‌ను సంపాదించుకున్నట్లు ఇందులో తెలిపింది. ముఖ్యంగా దేశ, విదేశీ సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడుపాలన్న ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది ద్వితీయార్ధం (జూలై-డిసెంబర్ వ్యవధి)లో హైదరాబాద్ ఆఫీస్ లీజింగ్ మునుపెన్నడూ లేనివిధంగా చారిత్రక స్థాయిలను అందుకున్నట్లు నైట్ ఫ్రాంక్ వెల్లడించింది. కార్యాలయాల కోసం ఈ ఆరు నెలల్లో ఏకంగా 4.3 మిలియన్ చదరపు అడుగుల (ఎంఎస్ఎఫ్) స్థలం లీజులకు కుదిరిందని వివరించింది. సరఫరా, లీజింగ్ కార్యకలాపాల్లో వరుసగా 19 శాతం, 24 శాతం చొప్పున వృద్ధి నమోదైందని చెప్పింది. ఇదే సమయంలో జాతీయ స్థాయిలోనూ గతేడాది మొత్తంగా రికార్డు స్థాయిలో 46.9 ఎంఎస్ఎఫ్ స్థలం ఆఫీస్ లీజింగ్ జరిగిందని పేర్కొన్నది.

> 'సమీప భవిష్యత్తులో దేశంలోని ఇతర నగరాలకు నిర్మాణ రంగంలో హైదరాబాద్ ఓ గొప్ప సవాలే. వృద్ధిరేటు పరంగా హైదరాబాద్‌ను అందుకోవడం అసాధ్యమేనన్నా అతిశయోక్తి కాదు. ఇప్పటికే ఢిల్లీ ఎన్సీఆర్, ముంబై మార్కెట్లకు ధీటుగా లీజింగ్ జరుగుతున్నది. నివాస, వాణిజ్య మార్కెట్లలో జాతీయ స్థాయితో పోల్చితే ఇక్కడి రియల్ ఎస్టేట్.. మదుపరులను విపరీతంగా ఆకట్టుకుంటున్నది'
>
> సామ్సన్ ఆర్థర్
> -నైట్ ఫ్రాంక్ హైదరాబాద్ శాఖ డైరెక్టర్

2018 జూలై-డిసెంబర్‌లో హైదరాబాద్ కమర్షియల్ మార్కెట్ తీరు

- మునుపెన్నడూ లేనివిధంగా 4.3 ఎంఎస్ఎఫ్ లీజింగ్
- మొత్తం ఏడాదిలో 24 శాతం వృద్ధితో 7 ఎంఎస్ఎఫ్‌పైనే లీజింగ్
- ఢిల్లీ-ఎన్సీఆర్, ముంబై వంటి భారీ మార్కెట్లకు చేరువైన భాగ్యనగరం
- కలిసొచ్చిన సులభతర వ్యాపార విధానాలు, పెట్టుబడులకు అపార అవకాశాలు
- ఆకట్టుకునే మౌలిక సదుపాయాల కల్పనతోనూ పరుగు
- మొత్తం లీజుల్లో ఐటీ, ఐటీ అనుబంధ రంగాల వాటానే 44 శాతం
- తయారీ రంగం వాటా 26 శాతం, ఇతర సేవల రంగం వాటా 29 శాతం
- గతంతో పోల్చితే 70 శాతం పెరిగి దాదాపు 2 ఎంఎస్ఎఫ్‌కు చేరిన కొత్త లీజులు
- మొత్తం ఏడాదిలో 19 శాతం వృద్ధి చెంది 4 ఎంఎస్ఎఫ్‌గా నమోదు

2018 జూలై-డిసెంబర్‌లో హైదరాబాద్ రెసిడెన్షియల్ మార్కెట్ తీరు

- రెరా రాకతో నూతన ఉత్సాహం
- గతేడాదితో పోల్చితే 15 శాతం పెరిగి 7,278 యూనిట్ల అమ్మకాలు
- 2018 మొత్తంగా దాదాపు 10 శాతం వృద్ధితో 15,591 యూనిట్ల విక్రయాలు
- రాష్ట్ర విభజన నేపథ్యంలో పెరిగిన రియల్ ఎస్టేట్ డిమాండ్
- ప్రభుత్వ విధానాలు, స్థిరమైన పాలనతో కొనుగోలుదారుల్లో పెరిగిన ఆసక్తి
- నగర శివారు ప్రాంతాల్లో భారీగా అమ్మకాలు
- మధ్యతరగతివారికి అందుబాటులో ధరలు
- 81 శాతం వృద్ధితో అందుబాటులోకి దాదాపు 1,700 కొత్త యూనిట్లు
- మొత్తం ఏడాదిలో 54 శాతం పుంజుకుని 5,404కు చేరిన కొత్త ఇండ్లు
- నూతన నిర్మాణాలు, ప్రాజెక్టుల్లో నగరంలోని పశ్చిమ ప్రాంతం వాటానే 84 శాతం
- కొత్త వాటిలో 43 శాతం చౌక, మధ్యశ్రేణి గృహాలే (ధర రూ.50 లక్షల వరకు)
- ఆసక్తికరంగా రూ.5-7.5 లక్షల ధరల శ్రేణిపై రియల్టర్ల దృష్టి

రిఫైన్డ్ వంటనూనెలపై అపోహలు వద్దు

హైదరాబాద్, జనవరి 8: రిఫైన్డ్ వంటనూనెల వినియోగంపై సోషల్ మీడియా వెల్లువెత్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ఇండియన్ కన్స్యూమర్ ఫెడరేషన్ (ఐసీఎఫ్) తెలిపింది. సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో సంయుక్తంగా వంటనూనెలపై అవగాహన సదస్సును నిర్వహించారు. వినియోగదారులు వేరుశనగ, నువ్వులు, కొబ్బరి, ఆవ, కుసుమ నూనెలలను రిఫైనింగ్ చేయని వాటిని కూడా ఉపయోగించవచ్చుననీ, అయితే అవి ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి పొందినవా లేవా అనే అంశాన్ని పరిశీలించాలని ఎఫ్ఎస్ఎస్ఐ సైంటిఫిక్ ప్యానెల్ చైర్‌పర్సన్ డాక్టర్ ఆర్‌బీఎన్ ప్రసాద్ అన్నారు. మిగతా వంటనూనెల రిఫైనింగ్ వల్ల వాటిలోని కల్మషాలు మాత్రమే వెలికితీయడం జరుగుతుందని, రుచికరంగా, నిల్వ చేసినప్పటకి ఈ గడ్డకట్టుకుపోని విధంగా ఉండేందుకే వాటిని రిఫైనింగ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. మున్సిపల్ మంచినీటితో సహా పాలు కూడా ఏదో రూపంలో రిఫైనింగ్ అయి వస్తున్న వాటినే మనం నిత్య జీవితంలో వినియోగిస్తున్నామనీ, రిఫైన్డ్ వంటనూనెల విషయంలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ న్యూట్రిషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ కల్పగం పోలాస, సాల్వెంట్ ఎక్స్‌టాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీపీ మెహతా తదితరులు పాల్గొన్నారు.

జలాన్ కమిటీ తొలి భేటీ

ఆర్బీఐ నగదు నిల్వల పరిమాణంపై చర్చ ▪ ఏప్రిల్‌లో నివేదికకు అవకాశం



న్యూఢిల్లీ, జనవరి 8: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నగదు నిల్వల పరిమాణంపై ఏర్పాటైన బిమల్ జలాన్ కమిటీ మంగళవారం తొలిసారిగా సమావేశమైంది. ఆర్బీఐ మాజీ గవర్నర్ జలాన్ నేతృత్వంలో ఓ కమిటీని నగదు నిల్వల పరిమాణం పరిశీలనకు ఆర్బీఐ, కేంద్ర ప్రభుత్వం కలిసి నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆర్బీఐ వద్ద నగదు నిల్వలు ఏ స్థాయిలో ఉండాలి.. కేంద్రానికి ఎంతమేర డివిడెండ్ ఇవ్వాలన్న దానిపై ఆరుగురు సభ్యులుగల ఈ కమిటీ తాజాగా భేటీ అయ్యింది. ప్రస్తుతం ఆర్బీఐ వద్ద రూ.9.6 లక్షల కోట్లకు పైగా మిగులు నిల్వలు ఉన్నాయి. అయితే దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం నెలకొన్న విపత్కర పరిణామాల నేపథ్యంలో ఈ నిల్వల్లో రూ.3.3 లక్షల కోట్లు ఇవ్వాలంటూ ఆర్బీఐకి కేంద్రం ప్రతిపాదించిన విషయం తెలిసిందే. దీంతో అప్పటికే ఆర్బీఐకి, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు మధ్య ఉన్న విభేదాలు భగ్గుమనగా, సెక్షన్-7 వంటి అంశాలు ఈ గొడవల్ని తారాస్థాయికి తీసుకెళ్లాయి. ఈ క్రమంలో గవర్నర్ పదవికి ఊర్జిత్ పటేల్ అనూహ్యంగా రాజీనామా చేయగా, ఆయన స్థానంలో శక్తికాంత దాస్‌ను మోదీ సర్కారు వెంటనే నియమించిన సంగతీ విదితమే. కాగా, ఆర్బీఐ నుంచి కేంద్రం మధ్యంతర డివిడెండ్‌ను కోరుతుండటం, రూ.40,000 కోట్లు ఇచ్చే అవకాశాలున్న తరుణంలో జలాన్ కమిటీ భేటీ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఏప్రిల్‌లో ఈ కమిటీ తమ నివేదికను సమర్పించే వీలున్నట్లు తెలుస్తున్నది. ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్‌తోపాటు ఆర్బీఐ సెంట్రల్ బోర్డు సభ్యులు భరత్ దోషి, సుధీర్ మన్కద్, ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ ఎన్ఎస్ విశ్వనాథన్ తదితరులు జలాన్ కమిటీ సభ్యులుగా ఉన్నారు.

నీలేకని నేతృత్వంలో డిజిటల్ ప్యానెల్



డిజిటల్ పేమెంట్స్ బలోపేతానికి నందన్ నీలేకని నేతృత్వంలో ఓ ఉన్నత స్థాయి కమిటీని మంగళవారం ఆర్బీఐ నియమించింది. దేశంలో మరింత భద్రమైన, రక్షణతో కూడిన డిజిటల్ చెల్లింపులకు తగిన సూచనలు, సలహాలను ఈ కమిటీ ఇవ్వనున్నది. ఐదుగురు సభ్యులుగల ఈ కమిటీ.. డిజిటల్ లావాదేవీల పెంపునకు దోహదపడే నిర్ణయాలు, ప్రోత్సాహకాలను ప్రకటించనుందని ఓ ప్రకటనలో ఆర్బీఐ తెలిపింది. తొలిసారి సమావేశమైన దగ్గర్నుంచి 90 రోజుల్లోగా కమిటీ నివేదికను సమర్పించనుందని కూడా చెప్పింది. ప్రస్తుతం ఇన్ఫోసిస్ వ్యవస్థాపక చైర్మన్‌గా ఉన్న నీలేకని.. ఆధార్ రూపకర్త కూడా అన్న విషయం తెలిసిందే. ఈ కమిటిలో ఆర్బీఐ మాజీ డిప్యూటీ గవర్నర్ హెచ్‌ఆర్ ఖాన్, విజయా బ్యాంక్ మాజీ సీఈవో, ఎండీ కిశోర్ సన్సీ, ఐటీ, ఉక్కు మంత్రిత్వ శాఖల మాజీ కార్యదర్శి అరుణా శర్మ, ఐఐఎం అహ్మదాబాద్ సీఐఐఈ సెంటర్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ సంజయ్ జైన్ సభ్యులుగా ఉన్నారు.

ఐఎంఎఫ్ ప్రధాన ఆర్థికవేత్తగా గీత

▪ గౌరవం దక్కిన తొలి మహిళ



వాషింగ్టన్, జనవరి 8: ప్రపంచ స్థాయి సంస్థల్లో భారత సంతతి మహిళామణులు సత్తా చాటుతున్నారు. ఆ రంగం.. ఈ రంగం అనే తేడా లేకుండా అన్ని రంగాల్లో తమ ప్రతిభతో విశ్వ విఖ్యాతి గాంచుతున్నారు. ప్రముఖ ఇండో-అమెరికన్ ఆర్థికవేత్త గీతా గోపీనాథ్.. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ప్రధాన ఆర్థికవేత్తగా నియమితులైయ్యారు. ఐఎంఎఫ్‌లో ఈ హోదాను దక్కించుకున్న తొలి మహిళ గీతా కావడం గమనార్హం. 47 ఏండ్ల గీతా గోపీనాథ్ గత వారం బాధ్యతలు స్వీకరించగా, ఈమె ఐఎంఎఫ్ 11వ ప్రధాన ఆర్థికవేత్తగా సేవలు అందించనున్నారు. మైసూర్‌లో జన్మించిన గీతా.. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నారు. నిరుడు అక్టోబర్ 1న ఐఎంఎఫ్ చీఫ్ ఎకనామిస్ట్‌గా గీతాను ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా గీతాను ఓ అత్యున్నత విద్యా ప్రమాణాలు కలిగిన వ్యక్తిగా, ప్రపంచంలోనే అత్యుత్తమ ఆర్థికవేత్తగా ఐఎంఎఫ్ ఎండీ క్రిస్టిన్ లగార్డే అభివర్ణించడం విశేషం. ఇక ఐఎంఎఫ్‌లో తాజా పదవిని గొప్ప గౌరవంగా పేర్కొన్నారు గీతా. ది హార్వర్డ్ గెజిట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ క్రిస్టిన్ లగార్డేపై ప్రశంసల జల్లు కురిపించారు. ప్రపంచంలోని మహిళలందరికీ ఆమె ఆదర్శమని కీర్తించారు. కాగా, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)పై స్పందిస్తూ టెక్నాలజీ రంగంలోని సంస్థల్లోకే ఎఫ్‌డీఐ అధికంగా వెళ్తున్నదని, ఈ క్రమంలో జాతీయ భద్రత, అంతర్జాతీయ సంపద చోరీ వంటి వాటిపై ఆందోళనలు పెరుగుతున్నాయన్నారు. వడ్డీరేట్లను అమెరికా సాధారణ స్థాయికి తీసుకొస్తున్న నేపథ్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక పరిపుష్టిపైనా ఆందోళనలు నెలకొన్నాయని చెప్పారు. విదేశీ మారకపు రేట్లు, డాలర్ నిల్వలు, విదేశీ రుణాలు వంటివి ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నట్లు తెలిపారు.

ఎన్ఎండీసీ బైబ్యాక్‌కు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓకే

న్యూఢిల్లీ, జనవరి 8: ప్రభుత్వరంగ మైనింగ్ దిగ్గజం ఎన్ఎండీసీ..రూ.1,000 కోట్ల షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. ఈ బైబ్యాక్ ప్రతిపాదనకు త్వరలో జరుగనున్న కంపెనీ బోర్డు సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇప్పటికే తొమ్మిది కంపెనీల బైబ్యాక్ ప్రతిపాదనలకు కేంద్రం పచ్చ జెండా ఊపింది. వీటిలో ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా, ఐవోసీ, ఎన్‌హెచ్‌పీసీ, భెల్, నాల్కో, కొచిన్ షిప్‌యార్డ్, ఎన్ఎల్‌సీ, కేఐవోసీఎల్‌లు ఉన్నాయి. ఈ బైబ్యాక్‌లతో కేంద్ర ప్రభుత్వానికి రూ.9 వేల కోట్ల నిధులు సమకూరనున్నాయి. కాగా, ఎన్ఎండీసీలో కేంద్రం 72.43 శాతం వాటా కలిగివున్నది.

మరోసారి ఇన్ఫీ బైబ్యాక్!

▪ ఈ నెల 11న ప్రకటించే అవకాశం

న్యూఢిల్లీ, జనవరి 8: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సర్వీసుల సంస్థ ఇన్ఫోసిస్ మరోమారు బైబ్యాక్ ప్రకటించేయోచనలో ఉన్నది. దీంతోపాటు ప్రత్యేక డివిడెండ్, వ్యాపార విస్తరణకు భారీ స్థాయిలో నిధుల కేటాయింపుపై ఈ నెల 11న(శుక్రవారం) జరుగనున్న బోర్డు సమావేశంలో చర్చించనున్నట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. అదేరోజు కంపెనీ మూడో త్రైమాసికపు ఆర్థిక ఫలితాలను విడుదల చేయబోతున్నది. సమావేశంలో తీసుకోనున్న నిర్ణయాలను బీఎస్ఈకి అందించనున్నది. కంపెనీ వద్ద మిగులు నిధులు అధికంగా ఉండటంతో గతేడాది ఏప్రిల్‌లోనే రూ.13 వేల కోట్ల వరకు వాటాదారులకు పంచనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదేక్రమంలో జూన్ 2018 త్రైమాసిక ఫలితాలను విడుదల చేసినప్పుడు ప్రకటించిన రూ.10 ప్రత్యేక డివిడెండ్ కోసం రూ.2,600 కోట్ల నిధులను వెచ్చించింది. మిగతా రూ.10,400 కోట్లను ఏ రూపంలో పంచేదానిపై సమాలోచనలు చేసి చివరకు డివిడెండ్‌కు మొగ్గుచూపే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

గ్లోబల్ హెడ్ సుదీప్ సింగ్ రాజీనామా

ఇన్ఫోసిస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. సంస్థను వీడేవారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నారు. ఇప్పటికే పలువురు సీనియర్ అధికారులు సంస్థకు గుడ్‌బై పలుకగా..తాజాగా మరో ఉన్నతాధికారి రాజీనామా చేశారు. సంస్థలో రెండు దశాబ్దాలుగా వివిధ హోదాలో పనిచేసిన ఎనర్జీ, యుటిలిటీ, రిసోర్స్, సర్వీసెస్ యూనిట్ అంతర్జాతీయ హెడ్ సుదీప్ సింగ్ రాజీనామా చేసినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆయన రాజీనామాకు గల కారణాలను సంస్థ వెల్లడించలేదు. ప్రస్తుతం ఈ యూనిట్ 1.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. 100 మిలియన్ డాలర్లుగా ఉన్న ఈ విభాగం ఆయన సారథ్యంలో 750 మిలియన్ డాలర్లకు చేరుకున్నది. గతేడాది అక్టోబర్‌లో గ్లోబల్ హెడ్ కెన్ థంబ్స్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అంతకుముందు కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎండీ రంగనాథ్ కూడా తన పదవికి రాజీనామా చేశారు.

ఫోను మీది..భద్రత మాది

▪ ప్రత్యేక సర్వీసులను ఆరంభించిన సెలెక్ట్



హైదరాబాద్, జనవరి 8: చేతిలోంచి జారిపడిపోయి స్మార్ట్‌ఫోన్ టచ్‌స్క్రీన్ పనిచేయడం లేదా! నీళ్లలో పడిపోయి మొత్తం పాడైందా అయితే చింతించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఇలాంటివారికోసం ప్రముఖ మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ సెలెక్ట్..ఫోను మీది-భద్రత మాది అనే నినాదంతో 'సీ సేఫ్' పేరుతో ప్రత్యేక సేవలను ఆరంభించింది. ఈ సందర్భంగా కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై గురు మాట్లాడుతూ...దేశవ్యాప్తంగా కొత్త మొబైల్ కొనుగోలు చేసి కొన్ని రోజుల్లోనే పాడై తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న వారిని దృష్టిలో పెట్టుకొని ఈ నూతన సేవలను ఆరంభించినట్లు, తద్వారా ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ నూతన సేవల్లోభాగంగా కంపెనీ చెందిన రిటైల్ అవుట్‌లెట్లలో స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసే సమయంలోనే ఏటీఎం మాదిరిగా ఉండే కార్డులను అందించడం జరుగుతున్నది. నాలుగు రకాల్లో లభించనున్న ఈ కార్డుల్లో పీపీ30 గోల్డ్ కార్డుపై నెల రోజుల పాటు ఎల్‌సీడీ స్క్రీన్‌పై గ్యారెంట్ కల్పించింది. ఇందుకోసం రూ.199 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే పీపీ180 పేరుతో అందుబాటులోకి తీసుకొచ్చిన కార్డును తీసుకున్న వారికి వ్యారెంట్‌ని మరో ఏడాది పాటు లభించనున్నది. మొబైల్ భద్రతతోపాటు వ్యారెంట్ పెంచడం, ఎక్స్ఛేంజ్ ఆఫర్, మొబైల్ మరమ్మత్తులు అందిస్తున్నట్లు చెప్పారు. ఆయా కంపెనీలు అందిస్తున్న ఏడాది వ్యారెంటీతోపాటు మరో ఏడాది వ్యారెంట్ సదుపాయం కల్పిస్తున్నది. కార్డుతోపాటు యాప్ ద్వారా ఈ సేవలు పొందవచ్చును. ఒకవేల మొబైల్ పాడైతే యాప్ ద్వారా ఈ సేవలు పొందేందుకు వీలుంటుంది. తద్వారా సర్వీసింగ్ సెంటర్‌ను వెతుక్కోవాల్సిన అవసరం ఉండదని ఆయన వ్యాఖ్యానించారు.

సెలెబీకి ఆర్‌జీఐఏ నిర్వహణ బాధ్యతలు

హైదరాబాద్, జనవరి 8: గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవలు అందించే అతిపెద్ద సంస్థల్లో ఒకటైన సెలెబీ ఏవియేషన్ హోల్డింగ్.. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయ నిర్వహణ బాధ్యతలు దక్కించుకున్నది. ఇందుకోసం నిర్వహించిన బిడ్డింగ్‌లో సెలెబీ అతి తక్కువగా కోడ్ చేసింది. దీంతో వచ్చే పదేండ్లపాటు విమానాశ్రయాన్ని సంస్థ నిర్వహణ బాధ్యతలు నిర్వహించనున్నది. భారత్‌లో ఇప్పటికే బెంగళూరు, కన్నూరు ఎయిర్‌పోర్ట్‌లను నిర్వహిస్తున్న సంస్థకు ఇది మూడో విమానాశ్రయ ప్రాజెక్ట్ కావడం విశేషం. టెక్నాలజీ పరంగా సేవలను మరింత విస్తృత పరుచడానికి ఆర్‌జీఐఏతో కలిసి పనిచేయనున్నట్లు కంపెనీ ఇండియా సీఈవో మురళీ రామచంద్రన్ తెలిపారు. విమాన ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయిలో సేవలు అందించడానికి కృషి చేయనున్నట్లు ప్రకటించిన ఆయన..భద్రత, మెరుగైన సేవలు, ఎయిర్‌పోర్ట్‌లో స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. భారత్‌లో సేవలు ఆరంభించి పదేళ్లు అయిన సందర్భంగా ఈ ఏడాది మరో కీలక మలుపు అని ఆయన వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో వ్యాపార విస్తరణకు 5-6 మిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టేయోచనలో సంస్థ ఉన్నట్లు ఆయన తెలిపారు.

మైన్‌మ్యాక్స్‌ను ఆవిష్కరించిన సియెట్

హైదరాబాద్, జనవరి 8: ప్రత్యేక టైర్ల తయారీ సంస్థ సియెట్..టిప్పర్ ట్రక్కులకు సరిగ్గా సరిపోయే 'మైన్‌మ్యాక్స్' టైర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. టైర్ బ్రేకర్ ప్లై టెక్నాలజీతో రూపొందించిన ఈ టైర్లు ఎక్కువకాలం మన్నిక కలిగివుంటాయి. క్లిష్టమైన రహదారులపై సులువుగా వెళ్లడంతోపాటు.. పంక్చర్ రెసిస్టెన్స్ వీటి విశిష్టత. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ విజయ్ గంభీరే మాట్లాడుతూ..రామగుండం ప్రాంతంలో భారీ ట్రక్కుల వినియోగాన్ని దృష్టిలోపెట్టుకొని ఈ టైర్లను ఇక్కడ విడుదల చేసినట్లు చెప్పారు. ఇప్పటికే ఈ టైర్లను భారత్‌లో గనులు అధికంగా ఉండే బెంగాల్, జార్ఖండ్, ఒడిశాలలో పరీక్షించి చూసినట్లు తెలిపారు.

అప్రకటిత ఆస్తులు రూ.6 వేల కోట్లు

పార్లమెంట్‌కు తెలిపిన కేంద్ర మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా

న్యూఢిల్లీ, జనవరి 8: అప్రకటిత ఆస్తులపై కేంద్ర ప్రభుత్వం సంధించిన అస్త్రం సత్ఫలితాలను ఇస్తున్నది. 2015లో నరేంద్ర మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన విదేశీ నల్లధనం చట్టంతో ఇప్పటి వరకు రూ.6 వేల కోట్లకు పైగా అప్రకటిత ఆస్తులను గుర్తించారు ప్రభుత్వ వర్గాలు. ఈ నూతన చట్టం కింద అక్టోబర్ 31, 2018 వరకు 34 మందికి వ్యతిరేకంగా ప్రాసిక్యూట్ చేయాలని కేసును నమోదు చేసినట్లు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా రాజ్యసభకు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. ఈ చట్టం ప్రకారం స్వల్పకాలంపాటు విదేశాల్లో ఉన్న తమ ఆస్తులను వెల్లడికి అవకాశం కల్పించింది. దీంతో సెప్టెంబర్ 30, 2015 నాటికి విదేశాల్లో ఉన్న రూ.4,100 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు 648 మంది ప్రకటించారు. వీరిపై పన్ను, జరిమానాల రూపంలో రూ.2,470 కోట్లు వసూలు చేసినట్లు ఆయన చెప్పారు. అప్రకటిత విదేశీ ఆస్తులు కలిగివున్నవారిపై ఐటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుండటం వల్లనే ఇది సాధ్యమైంది. కాగా, ప్రభుత్వరంగ బ్యాంకులను కట్టడి చేసే ఉద్దేశంలోభాగంగా ఆర్బీఐకు మరిన్ని ఆధికారాలు ఇచ్చే ఆలోచనేది లేదని శుక్లా స్పష్టంచేశారు.

తగ్గిన ఎంఎస్ఎంఈ మొండి బాకీలు

ముంబై, జనవరి 8: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)ల రుణాల్లో మొండి బకాయిలు గతేడాది సెప్టెంబర్‌తో ముగిసిన ఏడాది కాలంలో 8.5 శాతానికి తగ్గాయి. అంతకుముందు ఏడాది కాలంలో ఎంఎస్ఎంఈల ఎన్‌పీఏలు 8.7 శాతంగా ఉన్నట్లు మంగళవారం ఓ నివేదిక తెలిపింది. ఇదిలావుంటే గతేడాది మార్చితో ముగిసిన గడిచిన ఐదు ఆర్థిక సంవత్సరాల్లో సిండికేట్ బ్యాంక్ ఇచ్చిన వ్యవసాయ రుణాల్లో రూ.10,253 కోట్లు ఎన్‌పీఏలుగా మారినట్లు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద తెలిసింది.

ఈబీసీలకు రిజర్వేషన్లు హర్షణీయం



హైదరాబాద్ నమస్తే తెలంగాణ: ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకొన్న నిర్ణయం స్వాగతించతగిందని రెడ్డి జన సంఘం సలహాదారు కంచర్ల దశరథ్‌రెడ్డి అన్నారు. ఈ నిర్ణయం ఎందరికో ఉపయోగపడుతుందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలి

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన మాదిరిగానే గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో పెట్టి ఆమోదింపచేయాలని లంబాడా సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు ధనరాజ్‌నాయక్ కోరారు. గిరిజనుల మనోభావాలను గౌరవించి, గిరిజనుల ఆత్మగౌరవ పోరాటనికి గుర్తింపు ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం శాసనసభలో ఆమోదించి పంపిన మైనార్టీలకు 12 శాతం, గిరిజనులకు 10 రిజర్వేషన్ల తీర్మానాన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్‌చేశారు. అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లను లంబాడా సంక్షేమ సమితి స్వాగతిస్తున్నట్టు చెప్పారు.



మంగళ వారం బేగంపేటలోని క్యాంపు కార్యాలయంలో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, మన టీవీ సీఈవో శైలేశ్‌రెడ్డి, అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

అటవీ నేరగాళ్లపై కఠినంగా వ్యవహరించండి

వీడియో కాన్ఫరెన్స్‌లో పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా

ప్రత్యేకప్రతినిధి , నమస్తే తెలంగాణ : రాష్ట్రంలోని అటవీనేరగాళ్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని, స్మగ్లర్ల కార్యకలాపాలపై నిఘా పెట్టాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రశాంత్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయం నుంచి రాష్ట్రంలోని అటవీశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అటవీశాఖ ఉన్నతాధికారులు రఘువీర్, పృథ్వీరాజ్, సీఎంఓఎస్డీ ప్రియాంక వర్గీస్, లోకేశ్ జైస్వాల్, ఆర్‌ఎం డోబ్రియాల్, స్వర్గం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పులి వధ కేసులో ఎఫ్‌ఆర్వో సస్పెన్షన్

నిర్మల్ డివిజన్‌లోని ఇచ్చోడలో పెద్దపులి వధ కేసు కీలక మలుపు తిరిగింది. పెద్దపులి చర్మం వొలిచిన వ్యక్తులే దీపావళికి ముందు నీల్గాయ్ (మనుబోతు)ని చంపినట్లు తేలింది. పెద్దపులివధ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న గడునోత్ ప్రకాశ్ ఇంట్లో మనుబోతు మాంసం లభించినా అధికారులు కేసులు నమోదు చేయకపోవడంతో.. ప్రకాశ్ గ్యాంగ్ యథేచ్ఛగా వేట కొనసాగించినట్లు విచారణలో తేలింది. వారు హతమార్చిన పులిచర్మాన్ని 25లక్షల రూపాయలకు బేరం పెట్టినట్లు అధికారులు వెల్లడించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురిపై కఠిన చర్యలనుతీసుకోవాలని ఎఫ్‌డీఓ రాజారమణారెడ్డి సిఫారసు చేశారు. దీంతోఎఫ్‌ఆర్వో మహమ్మద్ హఫీజుద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రతీ వయోజనుడికి ఓటు హక్కు కల్పిస్తాం

- రాజకీయ పక్షాలతో సీఈవో రజత్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి వయోజనుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఎన్నికల కమిషన్ పని చేస్తున్నదని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం సచివాలయంలో అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు తీసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో ప్రథమంగా చేయాల్సింది ఓటరు నమోదు కార్యక్రమమేనని, ఓటరుగా నమోదైతేనే నచ్చిన నాయకుడిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకునే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. రాష్ట్రంలోని 32,573 పోలింగ్ స్టేషన్లకు అదనంగా అసెంబ్లీ ఎన్నికల్లో 2,030 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశామని, ప్రస్తుతం రాష్ట్రంలో 34,603 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని పేర్కొన్నారు. తొలగింపునకు గురైనవారుంటే మళ్లీ నమోదు చేసుకోవాలని సూచించినట్లు తెలిపారు. గతంలో సుమారు 30 లక్షల ఓట్లను ఎన్నికల నియమనిబంధనల మేరకు తొలగించామని చెప్పారు. వారంతా నిజమైన ఓటర్లయితే ఇప్పుడు జరుగుతున్న నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కొత్తగా నమోదు చేసుకోవాలంటే ఫారం-6ను పూరించాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకుని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓటువేయాలని సూచించినట్లు చెప్పారు. సమావేశంలో టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, గట్టు రాంచంద్రరావు, కాంగ్రెస్ నేత మర్రి శశిధర్‌రెడ్డి, బీజేపీ నుంచి ఎమ్మెల్సీ రాంచంద్రరావు, వెంకటరమణి తదితర నేతలు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో సచివాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశమైన సీఈవో రజత్‌కుమార్

తొలగించిన ఓటర్లను మళ్లీ చేర్చాలి

- సీఈవోకు టీఆర్‌ఎస్ విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఓటర్ల జాబితా నుంచి తొలిగించిన ఓటర్లను మళ్లీ చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని టీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం సీఈవో రజత్‌కుమార్‌ను కోరింది. మంగళవారం సచివాలయంలో సీఈవోను కలిసి పార్టీ ప్రతినిధులు ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, గట్టు రాంచంద్రరావు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఒక ఇంట్లో ఒకరికి ఓటు ఉంటే మరొకరికి ఉండదు. ఓటరు కార్డు ఉన్నా జాబితాలో పేరుండదు, వీటిపై దృష్టిపెట్టాలని కోరినట్టు తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఓటింగ్ శాతం తగ్గడానికి కారణాలను విశ్లేషించాలని సూచించామని చెప్పారు. ఓట్ల తొలిగింపుపై బీఎల్వోలను బాధ్యులుగా చేయాలని, వచ్చే ఎన్నికలకు అన్ని సమస్యలను సరిచేసి జాబితాను విడుదల చేయాలని కోరామని పేర్కొన్నారు.

ముఖం బాగోలేదని అద్దం పగులగొట్టినట్లుంది

- కాంగ్రెస్ తీరుపై గట్టు రాంచంద్రరావు ఎద్దేవా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ తీరుపై టీఆర్‌ఎస్ నేత గట్టు రాంచంద్రరావు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ముఖం బాగోలేదని అద్దం పగులగొట్టినట్లుగా కాంగ్రెస్ వ్యవహరిస్తున్నదని ఎద్దేవా చేశారు. సీఈవో ముందు కాంగ్రెస్ నేతలు ఎవరినీ మాట్లాడనీయకుండా అడ్డుతగులుతున్నారని తెలిపారు. పేదలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా గణనీయంగా ఓట్లు తొలిగించారని, దీంతో టీఆర్‌ఎస్‌కు మెజార్టీ తగ్గిందన్నారు. కాంగ్రెస్ నేతలు పూటకోమాట మాట్లాడుతూ పరువుతీసుకుంటున్నారని విమర్శించారు.

ఎన్నికల సిబ్బందికి గౌరవ వేతనం ఇవ్వండి

- అందరి సహకారంతో ప్రశాంతంగా అసెంబ్లీ ఎన్నికలు
- ఈసీ రజత్‌కుమార్‌తో సమావేశమైన టీజీవో యూనియన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు విజయవంతంగా, ప్రశాంతంగా ముగిశాయని, ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరి కృషితోనే ఇది సాధ్యమైందని టీజీవో వ్యవస్థాపక అధ్యక్షుడు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, టీజీవో అధ్యక్షురాలు వీ మమత పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల విధులు నిర్వర్తించిన సిబ్బందికి ప్రత్యేక వేతనం ఇవ్వాలని కోరారు. మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో సీఈవో రజత్‌కుమార్‌తో టీజీవో నేతలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికలను ప్రశాంతంగా ముగించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్, మమత మాట్లాడుతూ ఒక్కచోట కూడా రీపోలింగ్, గొడవలకు ఆస్కారంలేకుండా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించామన్నారు. ఆర్వోలు, ఏఆర్వోలతోపాటు సిబ్బందికి ఒక నెల వేతనాన్ని గౌరవ వేతనంగా ఇవ్వాలని కోరారు. ఎన్నికల సిబ్బందికి ఎన్నికల బడ్జెట్ నుంచి ప్రోత్సాహకం అందించాలన్నారు. కార్యక్రమంలో టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రవీందర్‌కుమార్, లీగల్ అడ్వయిజర్ కృష్ణమూర్తి, రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు మోహన్ నారాయణ పాల్గొన్నారు.



అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకు రజత్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, టీజీవో అధ్యక్షురాలు మమత

పదిహేనే లాస్ట్

ఖర్చులు నివేదించకుంటే డిఫాల్టర్లే

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులూ మేలుకోండి

ఎన్నికల ఖర్చులు ఈసీకి నివేదించేందుకు ఈ నెల 15వరకు గడువు

లేకుంటే మూడేండ్లపాటు ఎన్నికల్లో పోటీకి అనర్హులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థుల్లారా మేలుకోండి.. ఎన్నికల సమయంలో చేసిన ఖర్చుల లెక్కలను ఎన్నికల కమిషన్‌కు నివేదించండి.. లేకుంటే రాజకీయ భవిష్యత్తే ఆగమవుతుంది. డిఫాల్టర్లుగా మిగిలిపోయి వచ్చే మూడేండ్లపాటు ఎన్నికలు ఏవైనా పోటీకి అనర్హులవుతారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులందరూ విధిగా తాము ప్రచారంలో చేసిన ఖర్చుల వివరాలను సంబంధిత ఎన్నికల అధికారులకు నివేదించాల్సి ఉన్నది. ఈనెల 15వ తేదీలోగా ఎన్నికల్లో పోటీచేసిన రాజకీయ పార్టీలతో సహా ప్రతి అభ్యర్థి ప్రచారంలో చేసిన ఖర్చును లెక్కలేసి సమర్పించాలని ఈసీ గడువు విధించింది. ఈసీ నిర్దేశించిన రూ.28 లక్షలలోపు ఖర్చు చేశామని అభ్యర్థులు నిర్లక్ష్యంవహిస్తే ఇక అంతే సంగతులు. వచ్చే మూడేండ్లపాటు డిఫాల్టర్లుగా మిగిలిపోతారు. డిఫాల్టర్లుగా ఖరారైన తేదీ నుంచి మూడేండ్లపాటు దేశంలో వచ్చే ఏ ఎన్నికలో కూడా పోటీచేయడానికి అవకాశం ఉండదు. ఖర్చులు సమర్పించని అభ్యర్థులపై ఈసీ పూర్తిస్థాయి విచారణజరిపి మరో ఏడాదిలో ఎన్నికలు వస్తాయనే సమయంలో వారిని డిఫాల్టర్లుగా ప్రకటిస్తుంది. దీంతో అప్పీల్‌కు కూడా వెళ్లలేని గడ్డ పరిస్థితి ఎదురవుతుంది. వెళ్లినా అంత త్వరగా దీనిపై నిర్ణయం వెలువడే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంటుంది కాబట్టి అంత త్వరగా తేలదు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 1,821 మంది పోటీచేశారు. వీరిలో ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీల నుంచి పోటీచేసిన అభ్యర్థుల్లో సగం మంది ఖర్చుల నివేదికలను స్థానిక జిల్లా ఎన్నికల అధికారులకు అందించినట్టు సమాచారం.

2014లో 47 మంది డిఫాల్టర్లు

2014 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థుల్లో 47 మంది స్వతంత్రులను ఈసీ డిఫాల్టర్లుగా ప్రకటించింది. ప్రచారం సందర్భంగా చేసిన ఖర్చులను ఎన్నికలు ముగిసిన 30 రోజుల్లో ఈసీకి లెక్కలు సమర్పించాల్సి ఉన్నది. ఈ 47 మంది నిర్లక్ష్యంగా వదిలేయంతో వారిపై వేటుపడింది. ఇందులో నిజామాబాద్ జిల్లా నుంచి టీడీపీ నేత దొడ్డల రామకృష్ణ, మహబూబ్‌నగర్ నుంచి రమేశ్ బండారీ తమకు మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ఎన్నికల కమిషన్(సీఈసీ)కు అప్పీల్ చేసుకున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ఈ ఇరువురిపై సీఈసీ డిఫాల్టర్ల జాబితానుంచి మినహాయించింది. ఆర్పీ యాక్ట్ సెక్షన్ 11 ప్రకారంగా అప్పీల్‌కు వెళ్లడంవల్ల వారికి మినహాయింపు లభించింది. కొన్ని అత్యవసర పరిస్థితుల్లో డిఫాల్టర్లుగా మారిన వారికి ఎన్నికల కమిషన్ చట్టంలో పునఃపరిశీలనకు అవకాశం ఉన్నది. అయితే డిఫాల్టర్లుగా మారిన అభ్యర్థులు సీఈసీకి అప్పీల్ చేసుకొని సరైన సాక్ష్యాధారాలు చూపించాల్సి ఉంటుంది. అభ్యర్థి అనారోగ్యానికి గురికావడం, నిరక్షరాస్యుడు కావడం, సకాలంలో ఖర్చులు సమార్పించాలని తెలియకపోవడం వంటి కేసులపై కొంత ఊరటనిచ్చేందుకు చట్టంలో అవకాశం ఉన్నది.



తహసీల్దార్ల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తివారీ తదితరులు

రెవెన్యూశాఖలో తహసీల్దార్ల పాత్ర కీలకం

- తహసీల్దార్ల సంఘం డైరీని ఆవిష్కరించిన స్పెషల్ సీఎస్ రాజేశ్వర్‌తివారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెవెన్యూశాఖలో తహసీల్దార్ల పాత్ర కీలకమైనదని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారీ తెలిపారు. మంగళవారం సచివాలయంలో తెలంగాణ తహసీల్దార్ల సంఘం డైరీని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాల అమలుతోపాటు ప్రజలకు సేవలు అందించడంలో తహసీల్దార్లు ప్రధాన భూమికను పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులకు, సిబ్బందికి, ఉన్నతస్థాయి అధికారులకు వారధిగా తహసీల్దార్లు ఉన్నారని, మరింత బాధ్యతతో పనిచేసి మంచిపేరు తేవాలని తివారీ సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ తహసీల్దార్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డి, అధ్యక్షుడు కే గౌతంకుమార్‌తోపాటు సంఘం కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూతనివ్వాలి

- 19న శిల్పకళావేదికలో దివ్యాంగ చిన్నారుల డ్యాన్స్‌ఫెస్ట్
- రాష్ట్ర సాంస్కృతిక, టూరిజంశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం



డ్యాన్స్‌ఫెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న టూరిజంశాఖ కార్యదర్శిబుర్రా వెంకటేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమాజంలో వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులకు ఆర్థికంగా చేయూతనందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర సాంస్కృతిక, టూరిజంశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం పేర్కొన్నారు. మంగళవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వారికి చేయూతనందించే ఉద్దేశంతో భగవాన్ మహావీర్ వికలాంగ సహాయతాసమితి ఆధ్వర్యంలో 19న శిల్పకళావేదికలో దివ్యాంగ చిన్నారులతో డ్యాన్స్‌ఫెస్ట్ పేరుతో నృత్య ప్రదర్శన చేపట్టనున్నట్టు తెలిపారు. కాళ్లు, చేతులు లేనివారికి కృత్రిమ అవయవాలను అందించాలనే సంకల్పంతో ప్రముఖ నృత్యకారిణి సుధాచంద్రన్ నేతృత్వంలో 40 మంది దివ్యాంగులు నృత్య ప్రదర్శనలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. డ్యాన్స్‌ఫెస్ట్‌కు హాజరై చేయూతనివ్వాలని కోరారు. సమావేశంలో మహావీర్ వికలాంగుల సహాయతా సమితి ప్రతినిధులు పీసీ ప్రకాశ్, ఇందర్ చాంద్‌జైన్, శైలేందర్ సింఘ్వి తదితరులు పాల్గొన్నారు

ఈబీసీ బిల్లుకు కాంగ్రెస్ మద్దతు:మల్లు రవి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్రం ప్రవేశపెట్టిన ఈబీసీ రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ మద్దతు తెలుపుతున్నదని మాజీ ఎంపీ మల్లు రవి తెలిపారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడం రాజకీయ జిమ్మిక్కే అయినప్పటికీ, రాజ్యాంగ సవరణకు కాంగ్రెస్ సహకరిస్తుందని చెప్పారు.

డైరెక్ట్ వీఆర్‌ఏలకు పే స్కేల్ వర్తింపజేయాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామ రెవెన్యూ సహాయకులుగా నేరుగా నియామకమైన వారికి పే స్కేల్ వర్తింపజేయాలని డైరెక్ట్ రిక్రూట్‌మమెంట్ వీఆర్‌ఏల సంఘం పీఆర్సీ చైర్మన్ బిశ్వాల్‌ను కోరింది. మంగళవారం సంఘం అధ్యక్షుడు వింజమూరి ఈశ్వర్, వ్యవస్థాపక అధ్యక్షుడు రమేశ్ బహదూర్, కార్యదర్శి జిన్నారం వెంకటేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు అంబాల శ్రీధర్‌గౌడ్, బాపుదేవ్, సాంస్కృతిక కార్యదర్శి రవి తదితరులతో కూడిన బృందం బిశ్వాల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది.

శ్రీచైతన్య స్కూల్‌లో విద్యార్థి ఆత్మహత్య!

- ఏపీలోని కృష్ణాజిల్లా కంచికచర్లలో దారుణం

అమరావతి: ఏపీలోని కృష్ణా జిల్లా కంచికచర్లలో ఉన్న శ్రీ చైతన్య స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మంగళవారం శ్రీలం నాగర్జునరెడ్డి అనే విద్యార్థి స్కూలు భవనం పైనుంచి కిందపడి అక్కడికక్కడే ప్రాణాలువిడిచాడు. జాతీయ రహదారిపై నిర్వహిస్తున్న 5కే రన్‌ను చూసేందుకు పలువురు విద్యార్థులు స్కూలు భవనంపైకి ఎక్కారని, నాగార్జునరెడ్డి ప్రమాదవశాత్తు కిందపడ్డాడని స్కూలు యాజమాన్యం పేర్కొన్నది. అయితే ప్రిన్సిపల్ అవమానించడం వల్లే తమ కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లిదండ్రులు ఆరోపించారు. విద్యార్థి మృతదేహంతో కుటుంబసభ్యులు, విద్యార్థి సంఘాలు సుమారు రెండు గంటలపాటు ఆందోళన చేశారు. ఈ ఘటనపై కృష్ణా జిల్లా కలెక్టర్ బీ లక్ష్మీకాంతం విచారణకు ఆదేశించారు. స్కూలును సీజ్ చేశారు.

ఏపీలోనూ సమగ్ర భూసర్వే చేపట్టాలి: శివాజీ



ఖైరతాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోనూ తెలంగాణ తరహాలో సమగ్ర భూసర్వే నిర్వహించాలని సినీనటుడు శివాజీ కోరారు. మంగళవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీలో చుక్కల భూమి లెక్కలు తేల్చాలని కోరారు. ఉమ్మడి ఏపీలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నదని, 12 లక్షల ఎకరాల చుక్కల భూమిఉంటే, హక్కులు పొందేందుకు సుమారు 5 లక్షల మంది ఆర్జీ పెట్టుకున్నారన్నారు. భూములను అనుభవిస్తున్న రైతుల వద్ద ఎలాంటి పత్రాలు ఉండవని, ప్రభుత్వమే లెక్కలు తేల్చాలన్నారు.తెలంగాణ ప్రభుత్వం సమగ్ర భూ సర్వేతో ఏపీ కంటే ఒక అడుగుముందుందని పేర్కొన్నారు. చంద్రబాబు చుక్కల భూమి వివరాలను తేల్చాలని ఆదేశించినా రెవెన్యూ అధికారులు బేఖాతరు చేస్తున్నారన్నారు. నెలరోజుల్లో లెక్కలు తేల్చకుంటే ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతానని తెలిపారు.

మహిళా రక్షణకు జాతీయస్థాయిలో ఉద్యమం

చాణక్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ ▪ పోస్టర్‌ను విడుదల చేసిన మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారాలపై జాతీయ స్థాయిలో ఉద్యమం చేస్తున్నట్లు చాణక్య ఫౌండేషన్ ప్రకటించింది. తెలంగాణ ప్రాంతానికి చెందిన డీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీ కేంద్రంగా పోరాటం చేస్తున్నది. ఢిల్లీలోని నిర్భయ ఘటన, ఇతర ఘటనల నేపథ్యంలో ఫౌండేషన్ చేసిన ఉద్యమానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. అమృత్‌సర్ నుంచి అండమాన్ వరకు, అసోం నుంచి హదీపూర్ వరకు మహిళల రక్షణ ఉద్యమం చేపట్టినట్టు తెలిపారు.ఫౌండేషన్ పోస్టర్‌ను మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ మంగళవారం విడుదల చేసిన సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. చాణక్య ఫౌండేషన్ ద్వారా దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, కాలేజీలు, వివిధ రాష్ట్రాల అసెంబ్లీల్లో అవగాహన సదస్సులు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. మహిళలు, విద్యార్థులు, వృత్తి, ఉద్యోగాల్లో ఉన్నవారు విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేలా కరాటేను అనుసరిస్తూ తమనుతాము రక్షించుకునేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. జాతీయస్థాయిలో పట్టణాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నామని పేర్కొన్నారు. చాణక్య ఫౌండేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.



చాణక్య ఫౌండేషన్ పోస్టర్‌ను విడుదల చేసిన మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ

కులమతాలకతీతంగా ఈబీసీ రిజర్వేషన్లు

బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కులాలు, మతాలకు అతీతంగా ఈబీసీ రిజర్వేషన్లు అన్ని వర్తిస్తాయని..కులం సర్టిఫికెట్ లేనివారికి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అనే తేడా లేకుండా అందరికీ అవకాశాలు పెరుగుతాయని బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలందరికీ ఈబీసీ రిజర్వేషన్ల ద్వారా క్రీమీలేయర్ పరిమితిలో అవకాశాలు మెరు గుపడతాయని పేర్కొన్నారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలు దేశంలో 70 శాతం, తెలంగాణలో 85-89శాతం ఉన్నారని చెప్పారు. సామాజికంగా, చారిత్రకంగా గౌరవం పొందుతున్న కులాలు 20-25శాతం మాత్ర మేనని, వీరిలో పేదలు ఈబీసీ రిజర్వేషన్ల ద్వారా కొంత లబ్ధిపొందే అవకాశమున్నదని చెప్పారు. జనరల్ క్యాటగిరీలో ఈబీసీ రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సామాజికవర్గాల వారందరికీ వర్తిస్తాయని పేర్కొన్నారు. బీసీ (ఇ) గ్రూపునకు పెంచిన రిజర్వేషన్లను కూడా కేంద్ర ఆమోదించడం ద్వారా సామాజిక సామరస్యం వెల్లివిరుస్తుందన్నారు. దీంతో అగ్రకుల రిజర్వేషన్ ఉద్యమాలకు ముగింపని అభిప్రాయపడ్డారు. 25శాతం ఈబీసీ క్రీమీలేయర్ పరిధిలోకి తెస్తేనే గ్రామీణ,పట్టణ పేదలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

'గ్లోబల్' ఘటనలు పునరావృతం కాకూడదు

దవాఖానల యాజమాన్యాలకు పలు సూచనలు చేసిన పోలీస్‌శాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గతేడాది డిసెంబర్ 18న గ్లోబల్ హాస్పిటల్‌లో ఒక రోగి మృతిచెందడంతో కోపోద్రిక్తులైన బంధువులు వీరంగం సృష్టించిన విషయం తెలిసిందే. దవాఖానలోని ఫర్నీచర్ ధ్వంసం చేయడంతోపాటు పోలీసులపైనా ఎదురుదాడికి దిగి అలజడి సృష్టించారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ ఉన్నతాధికారులు దవాఖానల యాజమాన్యాలు, డాక్టర్ల అసోసియేషన్ సభ్యులతో ఇటీవల ఒక సమీక్ష నిర్వహించారు. రోగితోపాటు అవసరం మేరకే పరిమిత సంఖ్యలో అటెండర్లను అనుమతించాలి. దవాఖాన పరిసరాల్లో ప్రైవేటు సెక్యూరిటీ, సీసీటీవీ కెమెరాలు అన్ని పరిసరాలు కవరయ్యేలా విధిగా ఏర్పాటుచేసుకోవాలి. అనుకోని ఘటనలు జరిగినప్పుడు, రోగుల బంధువులతో వాగ్వాదం జరిగే అవకాశం ఉన్న సందర్భాల్లో పోలీసులకు ముందుస్తు సమాచారం ఇవ్వడంతో పరిస్థితి చేయిదాటకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పోలీసులు సూచించారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌ను అనర్హుడిగా ప్రకటించాలి

- ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ డిమాండ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను అనర్హుడిగా ప్రకటించాలని ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌కుమార్ డిమాండ్‌చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మైనార్టీ వర్గానికి చెందిన ప్రొటెం స్పీకర్ ఎదుట అసెంబ్లీ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయబోనన్న రాజాసింగ్ వ్యాఖ్యలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తున్నదని చెప్పారు. రాజాసింగ్‌పై 43 కేసులున్నాయని, వీటిని త్వరగా విచారించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఏపీ పోలీసులు సహకరించడంలేదు: ఎన్‌ఐఏ

అమరావతి: ఏపీలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై కోడికత్తితో హత్యాయత్నం చేసిన కేసును దర్యాప్తు చేసేందుకు వచ్చిన ఎన్‌ఐఏ బృందానికి ఏపీ పోలీసులు సహకరించడం లేదు. హైకోర్టు ఆదేశాల మేరకు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) అధికారులు సోమవారం విశాఖపట్నానికి చేరుకున్నారు. కేసు దర్యాప్తులో ఏపీ పోలీసులు సహకరించడం లేదని, పూర్తి వివరాలు అందించడం లేదని ఎన్‌ఐఏ అధికారులు మంగళవారం ఎన్‌ఐఏ కోర్టును ఆశ్రయించారు. హత్యాయత్నం కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లను ఇప్పించాలని, ఈ కేసును విజయవాడ కోర్టుకు బదలాయించాలని కోరారు.

టీడీపీలోకి ఆదిశేషగిరిరావు?



అమరావతి: వైసీపీ నాయకుడు జీ ఆదిశేషగిరిరావు మంగళవారం రాజీనామా చేశారు. ఆయన టీడీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన తెనాలి ఎమ్మెల్యే టికెట్ ఆశించగా, విజయవాడ ఎంపీగా పోటీచేయాలని జగన్ సూచించడంతో వైసీపీని వీడాలనుకుననట్టు సమాచారం.

బుద్ధా వెంకన్నకు షాక్.. వైసీపీలో చేరిన సోదరుడు

టీడీపీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్నకు గట్టిషాక్ తగిలింది. ఆయన సోదరుడు బుద్ధా నాగేశ్వరరావు వైసీపీలో చేరారు. ఆయన మంగళవారం వైఎస్ జగన్‌ను కలిసి వైసీపీ కండువా కప్పుకున్నారు. జగన్ అధికారంలోకి వస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందని నాగేశ్వరరావు చెప్పారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
బుధవారం 9 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

పాదాల పగుళ్లు మాయం!



వర్షాకాలంలో పాదాలు పగుళ్లు మామూలే. పగుళ్లను తొలిగించడానికి మందులు, మాత్రలు వాడుతుంటారు. వాటి వాడకం అంత మంచిది కాదని చెబుతున్నారు బ్యూటీ నిపుణులు.

- బ్యూటీపార్లర్‌లో లభించే కాస్మెటిక్ వాష్ తీసుకోవాలి. ఆవనూనె వేడిచేసి అందులో కొన్ని మిరియాలు, వాష్ వేసి బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు రాసుకోవాలి. రోజూ ఇలా చేస్తే పాదాలు మృదువుగా మారుతాయి.
- ఉల్లిగడ్డను చిన్న ముక్కలుగా కోసి రసాన్ని తీయాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు రాయాలి. ఆరిన తర్వాత ఐదు నిమిషాల పాటు మర్దన చేయాలి. 15 నిమిషాల తర్వాత నీటితో శుభ్రపరుచాలి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తే పాదాల పగుళ్లు పోతాయి.
- పెరుగు, నిమ్మరసాన్ని బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు, చేతులకు రాయాలి. 15 తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం కాంతివంతంగా, మృదువుగా తయారవుతుంది.
- స్నానం చేసిన తర్వాత పాదాలకు కొబ్బరినూనె రాయాలి. ఇలా చేస్తే పాదాల పగుళ్లు పోయి మృదువుగా మారుతాయి.
- నువ్వులనూనె, పసుపు కలిపి పేస్ట్‌లా చేయాలి. ఈ మిశ్రమాన్ని నిద్రపోయే ముందు పాదాలకు రాయాలి. ఉదయం లేవగానే నీటితో కడుక్కోవాలి. రోజూ ఇలా చేస్తే పాదాలు పగుళ్లు రావు.

అంగన్‌వాడీల ఆదర్శం!

అంగన్‌వాడీలో ఏముంటుంది? ఆ టీచర్లేం చేస్తారు? చిన్న పిల్లలకు గుడ్డు ఇస్తారు. రవ్వ పెడతారు. గర్భిణులకు పోషకాహారం ఇస్తారు. బాలింతలకు భోజనం పెడతారు! అంతేనా? వాటికి మించి ఉంది. గుడ్డుతో పాటు పిల్లలకు రవ్వంత ఆప్యాయత వడ్డిస్తారు. గర్భిణులకు పోషకాహారంతో పాటు పోషణ గురించి అవగాహన కల్పిస్తారు! బాలింతలకు ఆప్యాయతతో పాటు.. ఆలనా పాలనపై పాఠాలు బోధిస్తారు. మాతా.. శిశు సంక్షేమానికి వారధిగా పనిచేస్తారు. అందుకే వారికి జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తుంది. వారే వీరు!

జాతీయ స్థాయిలో ఉత్తమ అంగన్‌వాడీలను గుర్తించి 2017-18 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం పురస్కారం అందజేసింది . వారిలో తెలంగాణ ఆణిముత్యాలు కూడా ఉన్నారు. అంగన్‌వాడీలకు మంచి వేతనాలు ఇస్తూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సరైన గుర్తింపునివ్వగా.. తాజాగా జాతీయస్థాయిలో పురస్కారం అందజేయడంతో వారికి మరింత గౌరవం పెరిగింది. జీవితానికి పునాదిలాంటి అంగన్‌వాడీ కేంద్రాలను పటిష్టం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మన అంగన్‌వాడీలు.

శభాష్ సుశీల!





ఖమ్మంజిల్లా ఏన్కూరు మండల కేంద్రంలోని ఏన్కూరు-2 అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్నారు సుశీల. 1991లో అంగన్‌వాడీ టీచర్‌గా ఇల్లెందు ప్రాజెక్టు పరిధిలోని తిమ్మారావుపేట అంగన్‌వాడీకేంద్రంలో పనిచేసిన ఆమె ప్రాజెక్టుల బైఫరికేషన్‌లో ఇల్లెందు ప్రాజెక్టు కామేపల్లి ప్రాజెక్టుగా రూపాంతరం చెందింది. కామేపల్లి ప్రాజెక్టు పరిధిలోని ఏన్కూరులో 1999 నుంచి 2018 వరకు అంగన్‌వాడీ టీచర్‌గా కొనసాగించే క్రమంలో ఆమె సేవలను గుర్తించిన అధికారులు ఆమెను జాతీయ స్థాయి అంగన్‌వాడీ బెస్ట్ వర్కర్‌గా ప్రతిపాదనలు పంపారు. 12 మంది గర్భిణీలు, 16 మంది బాలింతలు, ఆరు నెలల నుంచి మూడేండ్ల వరకు 44 మంది, మూడేండ్ల నుంచి ఆరేండ్ల వరకు 40 మందితో పాటు రోజూ 19 మంది పిల్లలు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్‌కు హాజరవుతున్నారు. ఆటపాటలతో పాటు గర్భిణీ, బాలింతలకు పోషకాహారం అందించడంలో ప్రాజెక్టు పరిధిలోనే అంగన్‌వాడీ కేంద్రంలో మంచిపేరు తెచ్చుకుంది.

భర్త ప్రోత్సాహం

ఖమ్మం జిల్లా చింతకాని మండలం పొద్దుటూరు గ్రామం ఆమె స్వస్థలం. అత్తగారి ఇల్లు ఏన్కూరు. సుశీల భర్త అమరనేని కృష్ణయ్య. భర్త ప్రోత్సాహంతో అంగన్‌వాడీ టీచర్‌గా విధుల్లో చేరి గుర్తింపు తెచ్చుకున్నారామె. ప్రతీ శనివారం ఎన్‌హెచ్‌టీఎస్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించారు. అంతే కాకుండా రోజూ గర్భిణీలకు ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు క్విజ్ పోటీలను నిర్వహించి వారిలో ఉత్సాహన్ని పెంచారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిరోజూ సుమారు 50 మందికి తగ్గకుండా సుఖప్రసవాలు అయ్యేలా రిజిష్టర్‌లో నమోదు చేశారు. కోడిగుడ్డు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేసి తల్లుల మెప్పు పొందారు. పౌష్టికాహారం తయారు చేసుకునే అంశంపై కూడా తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం లో వర్క్‌సాప్ నిర్వహించి ఇతర అంగన్‌వాడీ కేంద్రాలకు ఆదర్శంగా నిలిచారు. పిల్లలతో పాటలు పాడించి రేడియో ప్రోగ్రాములు కూడా వినిపించి తల్లులకు ఆరోగ్య సూత్రాలు చెప్తూ ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు సుశీల.

సేవకు తగ్గ ప్రతిఫలం:
ప్రతి గర్భిణీ, బాలింతా, పిల్లలకు ఆరోగ్యలక్ష్మి ద్వారా పోషకాహారాన్ని అందించాను. పిల్లలు, తల్లులకు వారం వారం ఇమ్యునైజేషన్ టీకాలు ఇప్పించి గర్భిణుల ఆరోగ్యానికి బాసటగా నిలిచాం. శిశు సంక్షేమ శాఖ ప్రవేశపెట్టిన 14 రిజిష్టర్లను సమర్థవంతంగా రాసి ఆన్‌లైన్ ద్వారా ప్రతి సమాచారాన్నీ అప్‌లోడ్ చేశాం. సేవకు తగిన ప్రతిఫలం దక్కిందనుకుంటున్నాను.
- బండ్ల సుశీల



మేనకాగాంధీ చేతుల మీదుగా ఉత్తమ అంగన్‌వాడీ టీచర్ అవార్డు అందుకుంటున్న సుశీల

కంభంపాటి శ్రీనివాసరావు
ఏన్కూరు, ఖమ్మం

వారెవ్వా విజయలక్ష్మీ!





ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న సుశీల

అంగన్‌వాడీ టీచర్‌గా మహిళా శిశు సంరక్షణకు అందించిన సేవలు సామాజిక సేవలు అందించినందుకుగాను జాతీయ స్థాయిలో ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా ఎంపికై ఢిల్లీలో కేంద్ర మహిళ శిశుసంక్షేమ శాఖ మంత్రి మేనకా గాంధీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు విజయలక్ష్మి. ఆమెది వికారాబాద్ జిల్లా సిద్దులూర్ గ్రామం. 1997లో డిగ్రీ పూర్తి చేసి అంగన్‌వాడీ టీచర్‌గా విధుల్లో చేరారు ఆమె. అప్పటి నుంచి అంగన్‌వాడీ టీచర్‌గా శిశు స్థాయిలో చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. జనాభ నియంత్రణలో విస్తృతంగా పనిచేసి అధిక సంఖ్యలో మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించిన రికార్డు కూడా సొంతం చేసుకున్నారు. బాల్య వివాహాలను నిలిపి వేయడంలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. బోరుబావుల్లో పిల్లలను పడకుండా ఉండేందుకు చైతన్యంతో ఓపెన్‌గా ఉన్న బోరు బావులను మూసేసేందుకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. ఇప్పటివరకు 42 బోరు బావులను మూసేసి భద్రతగా నిలిచారు. తల్లిదండ్రులు లేని పిల్లలను చేరదీసి పాఠశాల, కళాశాల చదువులకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నారు. ఈమె సేవలకుగాను 2017 ఆగస్టులో అప్పటి మంత్రి మహేందర్‌రెడ్డి చేతులు మీదుగా ఉత్తమ అంగన్‌వాడీ టీచర్ అవార్డు లభించింది.


పెండ్లి తర్వాత విద్యాభ్యాసం

సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన విజయలక్ష్మీ 7వ తరగతి వరకు చదువుకోగానే పెండ్లి చేశారు తల్లిదండ్రులు. కానీ తన చదువుకు ఆటంకం కలుగకుండా చూసుకున్నారామె. పెండ్లయిన తర్వాత డిగ్రీవరకు చదువుకొని చదువు పట్ల ఉన్న జిజ్ఞాసను చాటుకున్నారు. 1997లో సిద్దులూర్‌లో అత్తగారి ఊర్లో అంన్‌వాడీ టీచర్‌గా బాధ్యతలు చేపట్టి సమాజ సేవలో భాగమయ్యారు. గ్రామంలో108 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించి రికార్డు సాధించారు. ఆరు బాల్యవివాహాలను నిలిపివేయించడంలో పరోక్షంగా కీలకపాత్ర పోషించారు. అనాథ పిల్లలకు దుప్పట్లు.. బట్టలు పంపిణీ చేస్తూ సహాయ సహకారాలు అందిస్తున్నారు. భర్త చనిపోయి 13 సంవత్సరాలు కావస్తున్నా ఏమాత్రం కుంగిపోకుండా ధైర్యంతో పిల్లలను పోషిస్తున్నారు. అంగన్‌వాడీలో 21 సంవత్సరాలుగా సేవలు అందిస్తూ ముందుకువెళుతున్నారు.

సంతోషంగా ఉంది:
అంగన్‌వాడీ టీచర్‌గా చిన్నారులకు సేవ చేయడం ఎంతో ఆనందాన్నిస్తుంది. నా సేవల్ని గుర్తించి జాతీయ స్థాయి అవార్డు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. దీంతో నా బాధ్యతలు మరింత పెరిగాయి. చిన్నారులకు సేవచేస్తూనే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవాబంధుగా ఉండేందుకు కృషి చేస్తా.
విజయలక్ష్మీ

వైద్యనాథ్ జూలకంటి
వికారాబాద్

సిరిముగ్గు



21 చుక్కలు
మధ్యచుక్క
11 వచ్చేవరకు



కె. సునీత
వనస్థలిపురం
హైదరాబాద్

ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:

సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9, కృష్ణాపురం,
బంజారాహిల్స్, రోడ్ నం - 10,
హైదరాబాద్ - 500034.
zindagi.nt@gmail.com

నమస్తే తెలంగాణ
యువ
[హైదరాబాద్]
బుధవారం 9 జనవరి 2019

పొగడ్తలూ ప్రమాదమే..

ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో రోజూ పోస్టులు పెడుతుంటాం. కొందరు అదే పనిగా పోస్టులు పెట్టి కామెంట్లు, లైకుల కోసం ఎదురు చూస్తుంటారు. వాళ్ల ఫొటో పోస్ట్ చేసి లైకులు, కామెంట్ల టార్గెట్ పెట్టుకుంటారు. వాటికి వచ్చే స్పందనను బట్టి మురిసి పోతుంటారు. అయితే రోజూ చేసే పోస్టుల్లో వచ్చే కామెంట్లు ముఖ్యంగా పొగడ్తలు యూత్‌పై ఎలాంటి ప్రభావం చూపుతాయో తెలుసా?



సోషల్ మీడియాలో పోస్టు చేసిన వాళ్ల ఫొటోకి వెటకారంగా స్పందిస్తే బాధపడుతారని పొగడటం చాలా మందికి అలవాటై ఉంటుంది. దగ్గరి ఫ్రెండో, బంధువో, ఆత్మీయుడో ఎవరి పోస్టుల్లో అయినా పొగడ్తలు సాధారణం. అమ్మాయిల పోస్టుల్లో అయితే అబ్బాయిల పొగడ్తల పర్వం చెప్పనక్కర్లేదు. అయితే ఇలాంటి పొగడ్తలు మానసికంగా ప్రమాదం కల్గిస్తాయని స్కూల్ ఆఫ్ సైకాలజీ సైన్స్ ఆఫ్ ఆస్ట్రేలియా యూనివర్శిటీ సర్వేలో తేలిందట. ఆ యూనివర్శిటీ ప్రొఫెసర్ నిక్ హస్లాం చెప్పిందేంటంటే.. సాధారణంగా పొగడ్తలు మనిషి మానిసిక పరిస్థితిని మెరుగుపరుస్తాయి. చేస్తున్న పని మీద ఆసక్తిని, పట్టుదలను పెంచుతాయి. అయితే సోషల్ మీడియాలో పొగడ్తల గురించి ఆ యూనివర్శిటీ చేసిన సర్వే ప్రకారం.. అతి పొగడ్తల వల్ల తెలియకుండా అవతలి వ్యక్తి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందట. ఒకరు ఫొటో పోస్టు చేస్తే అది ఎలా ఉన్నా 'మీరు అందంగా ఉన్నారు' అని పొగిడితే అది మానసికంగా ప్రభావం చూపుతుందట. మీ పొగడ్తను గుర్తు చేసుకొని మరింత అందంగా తయారవడానికి అవతలి వ్యక్తి మెళికలు తిరుగుతారంట. తర్వాత పోస్ట్ చేసే ఫొటో మరింత అందంగా వచ్చి, ఇంకా పొగడ్తలను ఆశిస్తారట. ఇలా సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే వారు మానసిక ప్రశాంతతకు దూరమయ్యే ప్రమాదం ఉందని హస్లాం తన సర్వే ద్వారా తెలిపాడు. కాబట్టి ఇకపై సోషల్ మీడియాలో పొగడాలంటే కాస్త ఆలోచించి పొగడండి.



అప్పటి వరకు నగర జీవితాన్ని అనుభవించి.. అత్తగారింటికి వెళ్లాక కష్టాలు ఎదురైతే ఎలా ఉంటుంది? కష్టాల్లో ఉన్నప్పుడు పుట్టిన ఆలోచన తనలాంటి ఎంతోమందికి ఉపశమనం కలిగిస్తుంది. అదే 'ఇంటింటికి మరుగుదొడ్డి' ఆలోచన..



కష్టాలకు ఎదురొడ్డి.. ఇంటింటికి మరుగుదొడ్డి

ఇంటింటికీ మరుగుదొడ్లు నిర్మిస్తామని హామీలు ఇస్తుంటారు. అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నా వందల సంఖ్యలో గ్రామాలు అలాగే ఉన్నాయి. అప్పుడప్పుడు అలాంటి గ్రామాలు వార్తల్లోకెక్కుతున్నాయి. ఇప్పుడు నితోర గ్రామం కూడా అలాగే చర్చనీయాంశం అయింది. ఇరవై రెండేళ్ల కోమల్ హడల పెండ్లి తర్వాత ఢిల్లీ నుంచి అత్తగారి ఊరు ఘజియాబాద్ పక్కన నితోర గ్రామానికి వెళ్లింది. అప్పటి వరకు నగరంలో ఉన్న ఆమెకు అక్కడ మరుగుదొడ్లు లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఉదయం లేవగానే కాలకృత్యాల కోసం మహిళలందరూ అడవులకు వెళ్లడం ఆలోచింపజేసింది. రక్షణ లేని ఈ సమాజంలో మరుగుదొడ్లు కూడా లేకపోవడం కరెక్ట్ కాదని అనుకున్నది. ప్రతి రోజూ ఉదయం పురుషులను దాటుకుంటూ మరుగుదొడ్లకు పోవాలంటే ఇబ్బందిగా తనలాగే అందరికీ ఉంటుందని గమనించింది. ఈ విషయాన్ని ఇంట్లో భర్తకు, తోటి కోడళ్లకు చెప్పి చర్చించింది. ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. ఎంతో కొంత సహాయ సహకారాలు అందిస్తే గ్రామంలో ఇంటింటికి మరుగుదొడ్డి కట్టిస్తానని బాధ్యతగా తీసుకున్నది. నితోర గ్రామంలోని 250 ఇండ్లకు మరుగుదొడ్లను కట్టించింది. ఆమె ఆలోచనతో బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దింది. ఈ ఒక్క అంశాన్నే కాదు.. గ్రామంలో ఉన్న అభివృద్ధి అంశాలను కూడా లేవనెత్తి చర్చిస్తున్నది. పర్యావరణాన్ని రక్షిస్తూ ప్రకృతిని కాపాడుతూ స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నది. అక్కడి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిగ్రాని సమితిలో సభ్యురాలిగా ఉన్నది. నార్వే ప్రధానమంత్రి ఎర్నా సోల్బెర్గ్ యూనిసెఫ్ కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామాన్ని సందర్శించింది. అప్పుడు కోమల్ ప్రస్తావన వచ్చింది. అందరూ ఆమె గురించి మాట్లాడడం మొదలుపెట్టారు. ఊరి మార్పు కోసం ప్రయత్నం మొదలుపెట్టి విజయవంతం అయిన ఆమె సేవలకు ప్రశంసలు లభించాయి.

మనోడు సృష్టించిన దునియా స్టార్



సృజనాత్మకత అంటే..
ఓ కొత్తదనాన్ని కోరుకోవడం..
ఓ నవీన అంశానికి జీవం పోయడం..
ఓ నూతన విషయాన్ని ఆవిష్కరించడం.
మరి ఇక్కడ సృజనాత్మకత అంశం ఏమిటి అంటే..?
ఒక సామాజిక మాధ్యమాన్ని సృష్టించడం..
దాని పేరు 'దునియా స్టార్'
మన తెలంగాణ యువకుడు
సృష్టించిన సరికొత్త సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇది.



ప్రపంచవ్యాప్తంగా అత్యంతవేగంగా విస్తరిస్తున్న టెక్నాలజీలో చాలా అంశాలు సామాజిక మాధ్యమాల ద్వారా బయటికి వస్తున్నాయి. ఇంటర్నెట్ ప్రపంచంలో వివిధ దేశాలకు సంబంధించిన చాలా యాప్‌లు, సైట్‌లు ఉన్నాయి. మన దేశానికి, మన రాష్ట్రానికి, మన ప్రాంతానికి చెందినది, సంబంధించినది ఏదీ లేదు. మన అనేది కూడా ఒకటి ఉండాలన్న ఆలోచనతో దునియా స్టార్‌ను సృష్టించాడు సతీష్. దీంతో ఇంటర్నెట్ ప్రపంచంలో ప్రత్యేకతలు చాటుకున్నాడు. ఉన్నత చదువు చదివి దానికి తగ్గ ఉద్యోగం రాక ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఏదైతేనేం చేయాలన్న తపన ఉండడంతో ఉద్యోగం చేసుకుంటూనే వినూత్నంగా ఆలోచించి దొరికిన కొద్ది సమయంలో అధ్యయనం చేయడం ప్రారంభించాడు. అలా పుట్టుకొచ్చిందే కొత్త సోషల్ నెట్‌వర్కింగ్ సైట్.. దునియా స్టార్.

మనకు తెలిసిన సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్.. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్.. ఇవే. మనకు తెలియని సైట్లు ఇంకా చాలా ఉన్నాయి. కొన్ని వందల యాప్స్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్నాయి. సోషల్‌మీడియాలో నెట్‌వర్కింగ్ సైట్ ప్రారంభించాలన్న ఆలోచన, అది అన్నింటికన్నా వేగంగా భిన్నంగా ఉండాలని ఆలోచించాడు సతీష్. ఉద్యమం జరుగాలన్నా, ప్రభావితం చేయాలన్నా సోషల్‌మీడియా ఇప్పుడు కీలకంగా పనిచేస్తున్నది. ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న అంశాల్లో సోషల్‌మీడియా ముఖ్య వరుసలో నిలుస్తున్నది. కొన్ని దేశాల్లో విప్లవాలకు దారి తీస్తే.. కొన్ని ప్రాంతాల్లో సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నది. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను కూల్చడానికి, ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిగా నిలువడానికి, క్షణాల్లో సమాచారం తెలుసుకోవడానికి సామాజిక మాధ్యమాలు ఎంతగానో పనిచేస్తున్నాయి. అలాంటి సామాజిక మాధ్యమాన్ని తయారు చేశాడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్ గ్రామానికి చెందిన సతీష్. అతడు రూపొందించిన యాప్ పేరే దునియా స్టార్.

కొత్త ఆవిష్కరణకు బీజం పోసి సామాజిక మాధ్యమాన్ని తయారు చేశాడు సతీష్. ఫేస్‌బుక్‌లాంటి ఒక సైట్‌ని రూపొందించి దానికి 'దునియా స్టార్' అని పేరు పెట్టాడు. ఇప్పుడిది ముంబై, బెంగళూరులోని పారిశ్రామికవేత్తలను ఆకర్షించింది. అయితే సతీష్ ఇది రూపొందించడానికి చాలా కష్టపడ్డాడు. అతను చదివింది ఎంటెక్, ఎల్ఐసీలో అడ్వయిజర్ చైర్మన్ క్లబ్ మెంబర్‌గా పనిచేస్తున్నాడు. దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన సతీష్ దునియా స్టార్‌ని మల్టీ నేషనల్ కంపెనీగా తీర్చదిద్దాలనుకుంటున్నాడు. సొంతంగా ఐటీ సంస్థను స్థాపించాలన్న లక్ష్యంతో, ఆశయంతో ముందుకెళ్తున్నాడు.

ప్రారంభించిన కొత్తలో దూరప్రాంతాల్లోని స్నేహితులను, బంధువులను, పరిచయస్తులను కలుపడానికి ఉపయోగపడ్డ సోషల్‌మీడియా ఇప్పుడు వ్యాపారాలు, వృత్తులు, మార్కెటింగ్ వంటి పనులు చేసుకోవడానికి సహకరిస్తున్నాయి. ఇలాంటి అనేక అంశాలను దృష్టిలో ఉంచుకొని దునియా స్టార్‌ని తయారు చేశాడు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 13 వేల మందికి పైగా వినియోగదారులున్నాయి. వీరి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. దునియా స్టార్ వాడే వారిలో ఎక్కువమంది వృత్తివిద్యా కోర్సులు అభ్యసిస్తున్న వాళ్లే ఉన్నారు. అమెరికా వంటి దేశాల్లో విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు దీన్ని వాడుతుండడం విశేషం.

ఫేస్‌బుక్‌లో లేని ప్రత్యేక ఫీచర్లు ఇందులో ఉన్నాయి. ఆన్‌లైన్ స్టడీ మెటీరియల్ కోసం నిరంతరం సైట్లను వెతికి, వాటిని స్నేహితులకు షేర్ చేయడానికి వీలుగా వర్డ్, పీడీఎఫ్ల వంటి అన్ని ఫార్మాట్ ఫైల్స్ ఇందులో పంపవచ్చు. డెస్కటాప్, ఆండ్రాయిడ్ వెర్షన్‌లలో ఇది అందుబాటులో ఉన్నది. వినియోగదారుల డాటాను సమర్థవంతంగా పరిరక్షించేందుకు పటిష్టమైన సెక్యూరిటీ ఫీచర్లు ఇందులో ఉన్నాయి. యువతకు ఉపయోగపడే చాలా ఫీచర్లు దొరుకుతాయి. ఫోరం, మ్యూజిక్, బ్లాగ్ వీడియోస్, గ్రూప్స్, పేజీలు, మెసెంజర్ వంటివి కూడా ఇందులో పొందుపరిచాడు. దునియా స్టార్ సైట్‌లో మార్కెట్ ప్లేస్ ద్వారా వస్తువుల అమ్మకాలు, కొనుగోలు కూడా చేయవచ్చు. ఈ ఫీచర్లు ఒక క్లాసిఫైడ్ సెక్షన్‌గా ఉపయోగపడుతాయి. ఇలాంటి సెక్షన్లు కొన్ని వందలున్నాయి.

DUNIYA STAR
Connecting The World...

అజహర్ షేక్

మొదటిసారి ఓ యువతి..




దేశ చరిత్రలో మొదటిసారి అమ్మాయి పరేడ్‌లో కెప్టెన్‌గా బాధ్యతలు పోషించనున్నది. 71 ఆర్మీ పరేడ్‌లో ఆ చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానున్నది. ఇది దేశ ప్రగతికి చిహ్నం. రేపటి తరానికి ఆదర్శం.



యువతులు ఏం చేస్తారు? అన్న మాట నుంచి.. యువతులు ఏమైనా చేస్తారు. ఏదైనా సాధిస్తారు అన్న స్థాయికి ఎదిగింది నేటితరం. ఇది చాలదా దేశ ప్రగతికి. ఆటో నడపడం మొదలు అంతరిక్షానికి వెళ్లేవరకు అన్నిరంగాల్లో వారుంటున్నారు. అన్నింట్లో అడుగుపెట్టి విజయం సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పుడు మరో అరుదైన ఘట్టానికి తెర తీయనున్నారు. దేశ చరిత్రలో ఇదొక మార్పుగా భావించవచ్చు. భారతీయ సాయుధ దళాల్లో మార్పు మొదలయింది. గతంలో మహిళల మీద చూపిన చిన్నచూపు ఇప్పుడు తగ్గింది. జనవరి 15న జరుగనున్న 71వ ఆర్మీ పరేడ్‌లో మహిళా ఆఫీసర్ నాయకత్వం వహించనున్నది. లెఫ్టినెంట్ భావన కస్తూరి ఈ రికార్డును బద్దలు కొట్టబోతున్నది. 144మంది పాల్గొనబోతున్న ఈ పరేడ్‌లో 33 మంది పురుషులు వాహనాలతో సాహసాలు చేయనున్నారు. ఈ సాహస బృందం జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కూడా పరేడ్ చేయనున్నది.

నోమోఫోబియా.. క్యా కియా?!



వస్తువుల్ని వాడుకోవాలి.. మనుషుల్ని ప్రేమించాలని చెప్పే మనుషులే ఆ వస్తువుల పట్ల బానిసలుగా మారుతున్నారు. మనిషి తయారు చేసిన వస్తువులను ప్రేమించి.. ప్రేమించాల్సిన మనిషిని వదిలేస్తున్నారు. ఇదంతా ఎందుకనుకుంటున్నారా?

మనిషి రూపొందించిన అంశాల పట్ల మనిషే బానిసగా మారుతున్నాడు. నోమోఫోబియా బారినపడుతున్నాడు. కొత్తగా ఈ నోమోఫోబియా ఏంటనుకుంటున్నారా? నోమోఫోబియా అంటే.. మొబైల్ ఫోన్‌ను ఉపయోగించలేమేమో అనే ఆందోళన పడడం. దీన్ని స్మార్ట్‌ఫోన్ సెపరేషన్ యాంగ్జైటీ అని కూడా పిలుస్తారు. దీన్ని వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా కేంబ్రిడ్జి డిక్షనరీ పేర్కొన్నది. ఈ మధ్యకాలంలో స్మార్ట్‌ఫోన్‌లకు ప్రజలు చాలా వ్యసనమయ్యారు. ఇక యువత విషయం అయితే చెప్పనక్కర్లేదు. టెక్నాలజీని మనం కంట్రోల్ చేస్తున్నామా? టెక్నాలజీ మనల్ని కంట్రోల్ చేస్తున్నదా అన్నంతంగా వాడేస్తున్నాం. ముఖ్యంగా యువత భోజనం చేసేటప్పుడు, కుటుంబంతో కబుర్లు చెప్పేటపుపడు కూడా ఫోన్ వదలడం లేదు. అనవసర సమయాల్లో కూడా వాటిని ఉపయోగించడం ఇలాంటి నష్టాలను దారి తీస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా నోమోఫోబియా వల్ల సమయం వృథా అవడమే కాకుండా అనుబంధాలు కూడా దూరమవుతున్నాయి. అయితే ఈ ఫోబియా తగ్గడానికి కొన్ని అంశాలున్నాయి. వాటిని పాటిస్తే కొంతమేరకు తగ్గించవచ్చు. ఫోన్‌కి టైమింగ్స్ సెట్ చేసుకొని ఆ సమయంలోనే దాన్ని వాడితే బాగుంటుంది. అత్యవసర కాల్స్ తప్ప టైమ్‌పాస్ కాల్స్‌కి దూరంగా ఉంటూ మాటిమాటికీ చెక్ చేసుకోకుండా ఉంటే మంచిది. రాత్రి పూట మంచం మీద, దిండు పక్కన కాకుండా కొంత దూరంలో, వేరే గదిలో కానీ పెట్టడం ఉత్తమం. ఛార్జింగ్ లేకపోవడం, ఫోన్‌లో బ్యాలెన్స్ తక్కువగా ఉన్నప్పుడు, ఫోన్ అందుబాటులో లేనప్పుడు విపరీతమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇదంతా నోమోఫోబియానే. దీని నుంచి బయటపడితే బాగుంటుంది. లేకపోతే ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుంది. నోమోఫోబియా మీద ఇప్పటి వరకు చేసిన సర్వేలన్నింటిలోనూ ఎక్కువశాతం అది 18-30 సంవత్సరాల వయసుగల వారికే ఉందని తేలింది.

సుడోకు

డైలీ సుడోకు 31 సమాధానం

8	1	4	2	3	7	5	9	6
2	7	5	9	8	6	3	4	1
6	9	3	1	4	5	7	2	8
9	8	2	3	7	4	6	1	5
5	3	1	6	9	8	4	7	2
7	4	6	5	1	2	8	3	9
1	2	8	4	5	3	9	6	7
3	6	7	8	2	9	1	5	4
4	5	9	7	6	1	2	8	3

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -32


	4			9				
	7			1	8	9		
	9				6	1		
						3		
5	2	6	8					4
		4	6				5	8
3				4				2
	6							
1			2		5			

ట్వీట్



కేరళలోని కోజన్‌చెర అడవుల్లో ఉన్నాను. ఈ దట్టమైన అడవుల్లో హాతి మేరే సాతి సినిమా షూటింగ్ చేస్తున్నాం.

రానా దగ్గుబాటి
@RanaDaggubati



రానాను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
5,569,799

కామన్‌మ్యాన్ వాయిస్

పేదరికం అనేది పోతే జనాలు బాగుపడుతారు. కొందరు నాయకులకు మాత్రం పూట గడవడం కూడా కష్టమే. అందుకే 'పేదరికాన్ని' కాపాడుతున్నారు.
-Allala Srinivasreddy

ఊరిని ప్రేమించేవాడు సర్పంచ్‌గా గెలిస్తే ఊరు మొత్తం బాగుపడతది. చరిత్రలో నిలిచిపోతారు. డబ్బుని తన మనుషులను మాత్రమే ప్రేమించేవాడు గెలిస్తే వాళ్ల వాళ్లు బాగుపడతారు. కానీ చరిత్ర హీనులవుతారు.
-Raju Athikam

ఉన్న కులాలన్నీ ఒక్కటి చేసి అందులో పేదవాళ్లకి మాత్రమే రిజర్వేషన్లు కలిగించవచ్చనే బుద్ధి మాత్రం ఎవరికీ లేదు. రాదు అనుకుంటా..
-Harish Kuvvakula

వైరల్ వీడియో



ఫన్ అండ్ ఫ్రస్టేషన్.. ఎఫ్2గా వస్తున్న సినిమా ట్రైలర్ యూట్యూబ్‌లో విడుదలయింది. వెంకటేష్, వరుణ్ తేజ్‌లు చేస్తున్న మల్టీస్టారర్ మూవీ ఇది.

F2 Trailer - Venkatesh, Varun Tej, Tamannaah, Mehreen Pirzada | Anil Ravipudi, Dil Raju
Total views : **2,271,752+**
Published on Jan 7, 2019



హత్తుకొనే లవోట్!

బాధ కలిగినప్పుడు, ఒంటరిగా ఉన్నప్పుడు ఒక తోడు ఉండాలనిపిస్తుంది. కానీ మనిషికి మనిషి తోడు ఉండడం అనేది ఈ కాలంలో జరుగని పనే అయింది. అందుకే ఆ లోటును భర్తీ చేయడానికి ఓ రోబో వచ్చేస్తున్నది.

చారెడంత కళ్లేసుకొని.. చిన్ని చేతులు, తలపై ఓ కెమెరాతో వస్తున్నదీ చిట్టి రోబో. దీనిపేరు లవోట్. లవ్ ప్లస్ రోబోట్‌ని కలిపి ముద్దుగా దీనికి ఆ నామకరణం చేశారు. ప్రేమను పంచేందుకు.. మీ ఒంటరితనాన్ని దూరం చేసేందుకు ఈ రోబోని కనిపెట్టారు. 16 అంగుళాల పొడవుతో ఉండే ఈ రోబో మొత్తానికి వెయ్యిమందిని గుర్తుపెట్టుకోగలదు. వంద ముఖాలను గుర్తించగలదు. మీరు బాధలో ఉంటే వచ్చి గట్టిగా హగ్ చేసుకుంటుంది. మిమ్మల్ని ఓదారుస్తుంది. ఇంకో విషయం.. ఇది మాట్లాడగలదు. కాకపోతే అది స్పష్టంగా మాత్రం ఉండదట. కింద ఉండే చక్రాలు గదులు తిరుగడానికి సహాయపడుతాయి. 16 గ్రాఫికల్ లేయర్స్‌తో వీటి కళ్లతో అందరినీ గమనించగలదు. 50 హై టెక్ సెన్సార్‌తో ఉండే ఈ లవోట్‌కి వై-ఫై కనెక్షన్ కూడా అవసరం లేదు. కేవలం ఒకసారి సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తే చాలు. ఇంట్లో రెండు లేదా మూడు లవోట్స్ ఉంటే వాటికి సంబంధించిన విధులను కూడా అవే నిర్వర్తించుకోగలవు. వాటితో అప్పుడు మీకెలాంటి ఇబ్బంది కూడా తలెత్తదు. ఇప్పుడు జపాన్‌లో దొరికే ఈ లవోట్.. 2020 కల్లా యూఎస్, ఇతర దేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు దీన్ని తయారు చేసే కంపెనీ చెబుతున్నది. అదే కనుక జరిగితే ఒంటరితనానికి తోడుగా ఒక ప్రేమను పంచే రోబో దొరికినట్టే!

ఎన్నో ఆవిష్కరణలు. మరెన్నో అద్భుతాలు.. గాలిలో ఎగిరే టెక్నాలజీ, కోరుకున్న వస్తువులను గాలిలో ఇంటికి తెచ్చే టెక్నాలజీ, డ్రైవర్ అవసరం లేకుండానే నడిచే వాహనాలు, ఖరీదైన కార్లు, బైకులు, టీవీలు, మొబైల్స్ ఒకటి కాదు.. రెండు కాదు.. ఎన్నో ఆవిష్కరణల ప్రదర్శనశాల సీఈఎస్ 2019. ఎన్నో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు పోటీపడి తయారుచేసిన సాంకేతిక అద్భుతాల జాతర విశేషాలు ఈవారం సంకేతలో..

ఆవిష్కరణల జాతర!



సీఈఎస్ 2019

అమెరికాలోని లాస్‌వెగాస్‌లో ప్రపంచ ఎలక్ట్రానిక్ జాతర ప్రారంభమైంది. ప్రఖ్యాత కంపెనీలన్నీ ఎదురుచూసే కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్ షో 2019 (టెక్‌ఫెయిర్) ఈ నెల 8న అట్టహాసంగా మొదలైంది. ఈ నెల 11 వరకు కొనసాగనున్న సీఈఎస్ 2019లో అధునాతన టెక్నాలజీతో రూపొందించిన పలు ఎలక్ట్రానిక్ వస్తువులు ప్రదర్శనకు ఉంచారు. ఆకట్టుకునే ఫీచర్లు, అబ్బురపరిచే ఎలక్ట్రానిక్ వస్తువులు, 5జీ టెక్నాలజీతో తయారుచేసిన పలు గాడ్జెట్లు, అధునాతన ఫీచర్లతో రూపొందించిన పలు టెక్ ఉత్పత్తులను ఈ ప్రదర్శనలో ఉంచుతారు.

1 మడతబెట్టే టీవీ..



ఎల్‌జీ కంపెనీ తయారుచేసిన 65 అంగుళాల టీవీ ఈ షోలో మార్కెట్‌కు పరిచయం కానుంది. 65 అంగుళాల డిస్‌ప్లే, 4కే సిగ్నేచర్ ఓఎల్‌ఈడీ తెరతో ఈ టీవీని రూపొందించారు. గూగుల్ అసిస్టెంట్, అమెజాన్ అలెక్సా వర్చువల్ అసిస్టెంట్, యాపిల్ ఎయిర్‌ప్లే వంటి ఫీచర్ సపోర్టుతో పాటు డాల్బీ అట్మాస్ ఫీచర్ కూడా ఉంది. దీంతో పాటే 88 అంగుళాల 8కే హెచ్‌డీ టీవీ కూడా సీఈఎస్ 2019లోనే మార్కెట్లోకి విడుదల చేయనున్నారు.

2 స్మార్ట్ సూట్‌కేస్



చూడడానికి మామూలుగానే కనిపిస్తున్నా ఈ సూట్‌కేస్ చాలా ప్రత్యేకమైనది. పట్టుకోవాల్సిన అవసరం లేకుండానే మనతో పాటు నడుస్తుంది. కింద అమర్చిన వీల్స్ ఆధారంగా మనల్ని ఫాలో అవుతుంది. దీన్ని ఎవరూ దొంగిలించలేరు కూడా. ఫింగర్‌ప్రింట్ సెన్సార్ లాక్‌సిస్టమ్ దీనికి అమర్చడంతో మనం తప్ప ఎవరూ ఈ సూట్‌కేస్ తెరువలేరు.

3 అండర్‌వాటర్ డ్రోన్



మామూలుగా అయితే కెమెరాల మీద నీటిచుక్క కూడా పడనివ్వం. వర్షంలో కెమెరా బయటకు తీయాల్సి వస్తే అన్నీ జాగ్రత్తలు తీసుకుంటాం. కానీ.. ఈ కెమెరా అలా కాదు. నీటిలోపల కూడా రికార్డు చేయగలదు. మిటో కంపెనీ తయారుచేసిన ఈ అండర్‌వాటర్ డ్రోన్ 4కే కెమెరా ఈ సీఈఎస్ 2019లో విడుదల చేస్తున్నారు.

4 స్మార్ట్‌బీట్



పిల్లలు ఉన్నచోట ఉండరు. కనురెప్ప కొట్టినంత సమయంలోనే ఏదో ఒక చిలిపి పని చేసేస్తారు. కొన్నిసార్లు ఆ చిలిపి పనులే వాళ్ల పాలిట ప్రమాదలవుతుంటాయి. తల్లిదండ్రులు, ఇంట్లో పెద్దవాళ్లు ప్రతీ క్షణం వారిని చూస్తూ అప్రమత్తంగా ఉండాలంటే ఎంతైనా కష్టమే. అందుకే టెక్నాలజీ వారికి ఓ బహుమతి ఇచ్చింది. అదే.. స్మార్ట్‌బీట్. పిల్లల కదలికలను గమనిస్తూ వారిని కంటికి రెప్పలా కాపాడే పరికరం ఇది. వారి కదలికలు, శ్వాసతీరు గమనిస్తూ ఏమాత్రం తేడాగా అనిపించినా తల్లిదండ్రులకు మెసేజ్ ద్వారా అప్‌డేట్ చేసి అప్రమత్తం చేస్తుంది.

5 బట్టలు మడతబెట్టే పరికరం



బట్టలు ఉతకడం ఒకింత పనైతే, వాటిని ముడతలు లేకుండా మడతపెట్టడం ఒక ప్రహసనం. సీఈఎస్ 2019 మీ బట్టలను చక్కగా ఐరన్ చేసి మడతపెట్టే పరికరాన్ని పరిచయం చేస్తోంది. మరికొద్ది రోజుల్లో 'ఫోల్డిమేట్' పేరుతో ఈ పరికరం ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లోకి రానుంది.

6 స్లీపింగ్ రోబోట్



రోజువారి పనిలో పడి కంటికి సరిగ్గా నిద్రలేకుండా ఒత్తిడికి గురవుతున్నవారు చాలామంది ఉన్నారు. వారికి ఈ సీఈఎస్ సుఖమైన నిద్రను అందించే రోబోను పరిచయం చేస్తున్నది. దీన్ని పక్కన పెట్టుకొని పడుకుంటే హాయిగా జోలపాడుతూ సుఖంగా నిద్రపోయేందుకు సహకరిస్తుంది.

7 స్మార్ట్ హెల్మెట్



అతివేగంతో బైక్ నడిపి ప్రమాదాల బారినపడే రైడర్లకు ఈ స్మార్ట్ హెల్మెట్ సీఈఎస్ 2019 అందిస్తున్న ఓ వరం. ప్రమాదాలు జరుగకుండా అలర్ట్ చేయగలదు. ఒకవేళ ప్రమాదం జరిగితే వెంటనే మన ఫోన్ కాంటాక్ట్స్‌లో నెంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా సందేశాన్ని పంపించగలదు.

8 హార్లీడేవిడ్‌సన్



బైక్ రైడర్లకు, రైడింగ్ ప్రియులకు ఇది శుభవార్త. హార్లీడేవిడ్‌సన్ సీఈఎస్ 2019లో సరికొత్త టెక్నాలజీతో ఓ కొత్త బైక్‌ను పరిచయం చేస్తున్నది. లైవ్‌వైర్ ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్ పేరుతో మూడు సెకన్లలో అరవై కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు. గేర్‌షిఫ్టింగ్ అడగకుండానే నిర్ణీత వేగాన్ని చేరుకోగల టెక్నాలజీ ఈ బైక్ ప్రత్యేకత. పానసోనిక్ అటోమోటివ్స్‌తో సహకారంతో ఈ బైక్ రూపొందించింది.

సీఈఎస్ 2019 విశేషాలు



- యాభయేండ్లుగా ఈ సీఈఎస్ ప్రతీ ఏడు ఆవిష్కర్తలకు వేదికగా ఈ గ్లోబల్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నది.
- ఈ ఎగ్జిబిషన్‌లో 4500 కంపెనీలు పాల్గొంటున్నాయి.
- ప్రదర్శన జరిగే నాలుగు రోజుల్లో 250 సెమినార్లు జరుగుతాయి. ఈ సెమినార్లలో రాబోయే తరం టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లలో మార్పులు, టెక్నాలజీ డెలివరీ సిస్టమ్, టెక్ అప్‌డేట్స్ గురించి చర్చిస్తారు.
- 150 దేశాలు ఈ ఎలక్ట్రానిక్ ప్రదర్శనలో పాల్గొంటాయి.
- దాదాపు లక్షా 80వేల మంది ఈ ఎలక్ట్రానిక్ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటారు.
- నాలుగు రోజుల ప్రదర్శన ద్వారా 398 బిలియన్ డాలర్ల మార్కెట్ జరుగనుందని నిర్వాహకుల అంచనా.
- 31 కేటగిరీల్లో ఆవిష్కరణలు, ప్రదర్శనలు జరుగుతాయి.
- లాస్‌వెగాస్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో 3.2 మిలియన్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ప్రదర్శన జరుగుతున్నది.

ఇంతే కాదు.. యాపిల్ తన నెక్ట్స్ జనరేషన్ ఐఫోన్‌ని ఎక్స్1 రెండర్స్ మొబైల్‌ని విడుదల చేయడానికి సన్నాహాలు చేసుకున్నది. హెచ్‌టీసీ రెండు వీఆర్ హెడ్‌సెట్‌లను ఐ ట్రాకింగ్ టెక్నాలజీతో పరిచయం చేస్తున్నది. కొన్ని వేల కంపెనీలు లక్షల సంఖ్యలో భవిష్యత్తును కండ్లకు చూపే టెక్నాలజీ గాడ్జెట్లను ఈ సీఈఎస్ 2019లో ప్రదర్శిస్తున్నారు.

ప్రవీణ్‌కుమార్ సుంకరి

నయామాల్

హానర్ 10లైట్



హానర్ మొబైల్ కంపెనీ సరికొత్త అప్‌డేట్స్‌తో కొత్త మొబైల్‌ని మార్కెట్లోకి విడుదల చేసింది. హానర్ 10లైట్ పేరుతో మార్కెట్లోకి వచ్చిన ఆ మొబైల్ ఫీచర్లు ఇలా ఉన్నాయి.

ఓఎస్	: ఆండ్రాయిడ్ పీ 9.0
డిస్‌ప్లే	: 6.21 అంగుళాలు
రిజల్యూషన్	:1080x2340 పిక్సల్స్
ర్యామ్	: 4/6 జీబీ
ఇంటర్నల్ స్టోరేజీ	: 64/182 జీబీ
రియర్ కెమెరా	: 13+2 మెగాపిక్సెల్స్
సెల్ఫీ కెమెరా	: 24 మెగాపిక్సెల్స్
బ్యాటరీ సామర్థ్యం	: నాన్ రిమూవబుల్, 3400 ఎంఏహెచ్
అందుబాటులో ఉన్న కలర్స్	: తెలుపు, నలుపు, ఎరుపు

తొలి రోబో బార్




చాలామంది న్యూఇయర్‌కి బార్‌కో, పబ్‌కో వెళ్లే ఉంటారు. కస్టమర్లతో కిటకిటలాడినప్పుడు మనమిచ్చిన ఆర్డర్ ఏ గంటకో వచ్చి చిరాకు పుట్టవచ్చు. కానీ అక్కడ క్షణాల్లో మీ ముందు కాక్‌టెయిల్ వచ్చేస్తుంది. అదెలాగంటే ఇది మొత్తం చదువండి.

క్లాసిక్ మార్టిని, పవర్‌ఫుల్ టకీలా వంటి కాక్‌టెయిల్ చేయాలంటే కొంత సమయం పడుతుంది. మిగతా మిక్సింగ్‌లకు వచ్చేసరికి మరింత సమయం పట్టవచ్చు. బార్‌లకు వెళ్లినప్పుడు బార్ టెండర్లు చేసేలోపు మనకు తాగాలన్నా ఆశ కూడా చచ్చిపోతుంది. ఎందుకంటే.. బార్‌లో మనతో పాటు ఎంతోమంది ఆర్డర్ ఇచ్చి ఉంటారు. వాళ్లందరికీ డ్రింక్ సర్వ్ చేయాలంటే మాటలు కాదు. కానీ మన ఆశ చావకుండా, కోరిన కాక్‌టెయిల్ మన ముందుకు రావాలంటే కాస్త లాస్‌వేగాస్ దాకా వెళ్లి రావాల్సిందే! అక్కడ 'ద టిప్సి రోబో' బార్ ఉంది. ఇదే ప్రపంచంలోని మొట్టమొదటి రోబో బార్‌గా ప్రసిద్ధికెక్కింది. ఇక్కడ ఉన్న రెండు రోబోలు క్షణం తీరిక లేకుండా కాక్‌టెయిల్ మిక్సింగ్‌లతోనే గడిపేస్తాయి. కస్టమర్లు కంప్యూటర్ ద్వారా ఆర్డర్ చేస్తే కావాల్సిన కాక్‌టెయిల్‌ని టేబుల్ ముందుంచుతాయి. ఆ డ్రింక్స్ తీసుకొచ్చేవి కూడా రోబోలే! సుమారు గంటకు 120 డ్రింక్స్‌ను అందించేస్తుంది. అంటే.. 60 నుంచి 90 సెకన్లలో ఒక డ్రింక్‌ని తయారు చేయడానికి ఈ రోబోలు సమయం తీసుకుంటాయి.

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం —

ఎన్‌పీసీఐఎల్‌లో స్టయిఫండరీ ట్రెయినీలు

కాక్రపార గుజరాత్ సైట్‌లోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్) ఖాళీగా ఉన్న స్టయిఫండరీ ట్రెయినీ/సైంటిఫిక్ అసిస్టెంట్ తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.



- మొత్తం ఖాళీలు : 162

పోస్టులవారీగా ఖాళీలు

- స్టయిఫండరీ ట్రెయినీ/సైంటిఫిక్ అసిస్టెంట్ (ఇంజినీరింగ్ డిప్లొమా)-51 ఖాళీలు
- **విభాగాలు- ఖాళీలు:** మెకానికల్-26, ఎలక్ట్రికల్-17, ఎలక్ట్రానిక్స్-5, కెమికల్-3
- **అర్హత:** సంబంధిత ఇంజినీరింగ్ సబ్జెక్టుల్లో ప్రథమశ్రేణిలో మూడేండ్ల డిప్లొమా ఉత్తీర్ణత.
- స్టయిఫండరీ ట్రెయినీ/సైంటిఫిక్ అసిస్టెంట్ (సైన్స్ గ్రాడ్యుయేట్లు)-6 ఖాళీలు (కెమిస్ట్రీ)
- **అర్హత:** కెమిస్ట్రీతోపాటు ఫిజిక్స్/ మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్‌తో బీఎస్సీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత లేదా బీఎస్సీ(ఎంపీసీ)లో ఉత్తీర్ణత. ఇంటర్ స్థాయిలో మ్యాథమెటిక్స్ చదివి ఉండాలి.
- సైంటిఫిక్ అసిస్టెంట్ బీ (సివిల్ ఇంజినీరింగ్ డిప్లొమా)-7 ఖాళీలు
- **అర్హత:** సివిల్ ఇంజినీరింగ్‌లో కనీసం 60 శాతం మార్కులతో మూడేండ్ల డిప్లొమా ఉత్తీర్ణత.
- స్టయిఫండరీ ట్రెయినీ/ టెక్నీషియన్ (ప్లాంట్ ఆపరేటర్)-51 ఖాళీలు
- **అర్హత:** సైన్స్ సబ్జెక్టులతో హెచ్ఎస్సీ (10+2) లేదా ఇంటర్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్ఎస్సీ స్థాయిలో ఇంగ్లిష్ సబ్జెక్టును చదివి ఉండాలి.
- స్టయిఫండరీ ట్రెయినీ/ టెక్నీషియన్ (మెయింటైనర్)-47 ఖాళీలు
- **విభాగాలు:** ఫిట్టర్-17, ఎలక్ట్రీషియన్-6, ఎలక్ట్రానిక్స్ మెకానిక్-10, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్-7, వెల్డర్-3 మెషినిస్ట్-3, డీజిల్ మెకానిక్-1
- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో సైన్స్, మ్యాథమెటిక్స్/ఇంగ్లిష్ సబ్జెక్టులతో పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడుల్లో రెండేండ్ల ఐటీఐ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2019 జనవరి 31 నాటికి సైంటిఫిక్ అసిస్టెంట్ బీ (సివిల్) పోస్టులకు 18-30 ఏండ్లు, స్టయిఫండరీ ట్రెయినీ/సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టులకు 18-25 ఏండ్లు, మిగతా పోస్టులకు 18-24 ఏండ్ల మధ్య ఉండాలి.
- **గమనిక:** సంస్థ నిబంధనల ప్రకారం శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి. అంటే కనీసం 160 సెం. మీ ఎత్తు, 45.50 కేజీల బరువు ఉండాలి.
- **స్టయిఫండ్ :** కేటగిరీ-1 పోస్టులకు రూ. 16000/- (మొదటి ఏడాది), 18,000 (రెండో ఏడాది), కేటగిరీ-2 పోస్టులకు రూ. 10,500/-(మొదటి ఏడాది) రూ. 12,500/-(రెండో ఏడాది) ట్రెయినింగ్ పీరియడ్‌లో చెల్లిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తయిన తర్వాత సైంటిఫిక్ అసిస్టెంట్‌కు రూ.35, 400/-, టెక్నీషియన్‌కు రూ. 21,700/- నెలకు జీతం చెల్లిస్తారు. అదనంగా డీఏ, సీడీఏ, సీఈఏ, మెడికల్ తదితర సౌకర్యాలు కల్పిస్తారు.
- **ప్రొబేషనరీ పీరియడ్:** రెండేండ్లు
- **ఎంపిక:** కేటగిరీ1 పోస్టులకు రాతపరీక్ష+ ఇంటర్వ్యూ, మిగతా పోస్టులకు ప్రిలిమినరీ, అడ్వాన్స్ టెస్ట్, స్కిల్‌టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** www.npcilcareers.co.in


హెచ్‌సీఎల్‌లో డాక్టర్లు

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్‌లోని మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ విభాగంలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- **పోస్టు పేరు:** మెడికల్ డాక్టర్-11 ఖాళీలు
- **అర్హత:** ఎంబీబీఎస్, పీజీ డిప్లొమా లేదా పీజీ డిగ్రీ/ఎంఎస్/ఎండీ/డీఎన్‌బీలో ఉత్తీర్ణత.
- **పేస్కేల్:** ఈ1 కేటగిరి పోస్టులకు రూ.40,000-1,40,000, ఈ2 కేటగిరి పోస్టులకు రూ. 60,000-1,80,000/-
- **ఎంపిక:** ఇంటర్వ్యూ, **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 11,18, 25
- **వెబ్‌సైట్:** www.hindustancopper.com

ఐవోసీఎల్‌లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్)కు చెందిన మథుర రిఫైనరీలో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ (నాన్ ఎగ్జిక్యూటివ్) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.



- జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్-42 ఖాళీలు (కెమికల్-14, పవర్ & యుటిలిటీ-2, ఎలక్ట్రికల్-8, మెకానికల్-10, ఇన్‌స్ట్రుమెంటేషన్-8)
- **అర్హత:** సంబంధిత ఇంజినీరింగ్ విభాగం/బ్రాంచీల్లో మూడేండ్ల డిప్లొమా లేదా బీఎస్సీ (ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ/ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ), పదోతరగతి+ఐటీఐ (ఫిట్టర్)తోపాటు బాయిలర్ కాంపిటెన్సీ సర్టిఫికెట్ ఉండాలి లేదా బీఎస్సీ (పీసీఎం)తోపాటు బాయిలర్ ట్రేడ్‌లో అప్రెంటిస్‌షిప్ ట్రెయినింగ్ చేసి ఉండాలి. సంబంధిత రంగంలో ఏడాదిపాటు అనుభవం ఉండాలి.
- వయస్సు 18 నుంచి 26 ఏండ్ల మధ్య ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 150/-, ఎస్సీ/ఎస్టీ/పీహెచ్‌సీ, ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **పేస్కేల్:** రూ.11,900-32,000/-
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఫిజికల్ టెస్ట్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జనవరి 28
- **రాతపరీక్ష తేదీ:** ఫిబ్రవరి 10
- **వెబ్‌సైట్:** www.iocrefrecruit.in

నాన్ టీచింగ్ ఖాళీలు

న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- నాన్ టీచింగ్ పోస్టులు
- **మొత్తం ఖాళీలు:**73 (పర్సనల్ అసిస్టెంట్-2, స్టెనోగ్రాఫర్-7, జూనియర్ అసిస్టెంట్ & టైపిస్ట్-44, ఆఫీస్ అటెండెంట్-20)
- **అర్హతలు:** పదోతరగతి/ఐటీఐ, ఇంటర్‌లో ఉత్తీర్ణత. టైపింగ్/షార్ట్‌హ్యాండ్ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- **వయస్సు:** 35 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్‌టెస్ట్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో, **చివరితేది :** ఫిబ్రవరి 4
- **వెబ్‌సైట్:**www.jnu.ac.in

ఫ్యాకల్టీ పోస్టులు

పుణెలోని ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- ప్రొఫెసర్/అసోసియేట్ ప్రొఫెసర్
- **విభాగాలు:** హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్టుల్లో పీజీతోపాటు పీహెచ్‌డీ ఉండాలి. బోధన/టీచింగ్ రంగంలో అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** www.iiserpune.ac.in

నమస్తే తెలంగాణ

చిత్రం

[హైదరాబాద్]

బుధవారం 9 జనవరి 2019



రామ్‌చరణ్

తెలుగు చిత్రసీమలోని అగ్ర కథానాయకుల్లో రామ్‌చరణ్ ప్రయాణం వినూత్నంగా సాగుతున్నది. ఇమేజ్ ఛట్రాల్లో బందీకాకుండా, కమర్షియల్ సూత్రాలకు అతీతంగా ప్రతి సినిమాలో తనని తాను కొత్తగా ఆవిష్కరించుకోవాలని తపిస్తున్నారాయన. 'రంగస్థలం' ఆయనలోని పరిపూర్ణ నటుడిని ఆవిష్కరించింది. అటువంటి చిరస్మరణీయ విజయం తర్వాత రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'వినయ విధేయ రామ'. బోయపాటి శ్రీను దర్శకుడు. ఈ నెల 11న విడుదలకానుంది. ఈ సందర్భంగా మంగళ వారం హైదరాబాద్‌లో రామ్‌చరణ్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి...

ఆ లెక్కలు చెప్పడం అవసరమా!

'వినయ విధేయరామ' నేపథ్యమేమిటి?

• నలుగురు అన్నదమ్ముల కథ ఇది. వారి జీవన గమనంలో ఎదురైన సంఘటనల సమాహారంగా దర్శకుడు బోయపాటి శ్రీను ఈ సినిమాను తెరకెక్కించారు. ఆయన శైలిలో అన్ని హంగుల కలబోతగా ఈ సినిమా ఉంటుంది.

ఇలాంటి కమర్షియల్ సినిమాకు సాఫ్ట్ టైటిల్ వినగానే ఏమనిపించింది?

• బోయపాటి శ్రీను సినిమాల్లో 'జయజానకి నాయక' టైటిల్ నన్ను బాగా ఆకట్టుకున్నది. కథకు తగినట్లుగా అలాంటి పాయెటిక్ టైటిల్ ఈ సినిమాకు కుదిరింది. సంక్రాంతికి ఇదే కరెక్ట్ పేరు అనిపించింది.

ఇందులో మీ పాత్ర చిత్రణ ఎలా ఉంటుంది.?

• ప్రతి ఇంట్లో ఇలాంటి ఓ కొడుకు ఉంటే బాగుండుననే ఆలోచనను అందరిలో కలిగించేలా బోయపాటి శ్రీను నా పాత్రను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ సినిమాలో నేను అయోధ్య రాముడిలా మంచి లక్షణాలున్న యువకుడిగా కనిపిస్తాను. వినయం, విధేయతలతో నడచుకునే అతడిలో ఉండే మరో కోణం ఏమిటన్నది ఈ సినిమాలో ఆసక్తికరంగా ఉంటుంది.

'రంగస్థలం' తర్వాత ఇలాంటి యాక్షన్ సినిమాను ఎంచుకోవడానికి కారణమేమిటి?

• నటుడిగా ఒకే పంథాకు పరిమితం కాకుండా అన్ని జోనర్ సినిమాలు చేయాలన్నది నా సిద్ధాంతం. 1980, 90 దశకాల్లో నాన్నగారు విభిన్న తరహా కథాంశాలతో సినిమాలు చేశారు. ఆయన మాదిరిగా సెన్సిబుల్ సినిమాలు చేయాలనుంది. మంచి కథ, కథనాలతో పాటు ప్రతిభావంతులైన దర్శకులతో పనిచేయడానికి ఇష్టపడతాను. బోయపాటిలో ఉన్న క్లారిటీ, కన్విక్షన్ నన్ను ఆకట్టుకున్నాయి. అందుకే ఈ సినిమా చేశాను.

బోయపాటి శ్రీను సినిమాల్లో హింస ఎక్కువగా ఉంటుంది. ఇందులో అలాంటి సన్నివేశాలు కనిపిస్తాయా?

• 'భద్ర' నుంచి 'జయజానకి నాయక' వరకు యాక్షన్ హంగులతో పాటు ప్రేమ, కుటుంబ బంధాలు, భావోద్వేగాల మేళవింపుతో బోయపాటి శ్రీను సినిమాలు చేశారు. అయితే యాక్షన్ సన్నివేశాలే ఆయనకో బ్రాండ్ ఇమేజ్‌ను తెచ్చిపెట్టాయి. అదే ఆయన బలం. అవి లేకుండా నేను ఆయన సినిమా ఊహించలేను పోరాట ఘట్టాలు, హింసను ఈ కథలో సమతూకంగానే చూపించారు.

'రంగస్థలం'తో ఈ సినిమాను పోల్చడం ఒత్తిడిగా భావిస్తున్నారా?

• పోలికలు అనేవి సహజం. ప్రతి సినిమాకు ఆ ఒత్తిడి ఉంటుంది. అది ఎక్కువగా తీసుకుంటే అందరూ దర్శకులతో సరిగా పనిచేయలేము. సంక్రాంతి పండుగకు కుటుంబమంతా కలిసి చూసే మంచి సినిమా ఇది. 'రంగస్థలం' చిత్రానికి పూర్తి భిన్నంగా ఉంటుంది.

సినిమాల వసూళ్లు ప్రకటించడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని గతంలో అన్నారు? కారణమేమిటి

• 'రంగస్థలం'తో పాటు గత వేసవిలో విడుదలైన 'భరత్ అనే నేను', 'నా పేరు సూర్య' సినిమాల కలెక్షన్స్ ప్రకటించడం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. అవి వెల్లడించడం అవసరమా అనిపించింది. అందరం మంచి సినిమాలు చేశాం. అన్నీ చక్కటి వసూళ్లను సాధించాయి. పోటీ అనేది కథలు, పాత్రలు, నటనలో ఉండాలి. అంతేకానీ కలెక్షన్స్ విషయంలో ఉండటం సరికాదనిపించింది. కలెక్షన్స్ పేరుతో అభిమానులు కొట్టుకోవడం నచ్చలేదు. అందుకే నా సినిమాలకు సంబంధించి వసూళ్లు ప్రకటించాల్సిన అవసరం లేదని నిర్మాతల్ని కోరాను.

ప్రస్తుతం అగ్ర కథానాయకుల మధ్య సాన్నిహిత్యం పెరిగింది? మహేష్‌బాబు, తారక్‌తో మీరు సన్నిహితంగా కనిపిస్తున్నారు?

• తారక్ నాకు మంచి మిత్రుడు. మహేష్‌బాబు ఈ మధ్య మంచి స్నేహితుడయ్యాడు. అయితే సోషల్‌మీడియా వచ్చిన తర్వాతే మా మధ్య ఉన్న అనుబంధం గురించి బయటి ప్రపంచానికి తెలిసింది. ఇలా అందరిని కలుపుకువెళ్లే మనస్తత్వం నాన్న నుంచి నాకు అలవడింది. అదే నేను ఫాలో అవుతున్నాను.

'సైరా' సినిమా షూటింగ్ విషయంలో పలు రకాల వార్తలు వినిపిస్తున్నాయి?

• మరో రెండు నెలల్లో 'సైరా' చిత్రీకరణ పూర్తవుతుంది. ప్రస్తుతం ఓ పాటను చిత్రీకరిస్తున్నాం. ముందుగా వేసవిలో సినిమాను విడుదల చేయాలనుకున్నాం. కానీ కుదిరేలా లేదు. దసరాకు ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని అనుకుంటున్నాం. ఈ సినిమా విషయంలో రీషూట్‌లు ఏమీ జరగడం లేదు. అంత డబ్బు మా వద్ద లేదు (నవ్వుతూ).

'రంగస్థలం' పెద్ద విజయాన్ని సాధిస్తుందని, హీరోగా మీకు గొప్ప పేరు తీసుకొస్తుందని ముందే ఊహించారా?

• 'రంగస్థలం' లాంటి సినిమాలు ప్లాన్ చేస్తే జరగవు. ఓ రోజు సుకుమార్, నేను సరదాగా భోజనం చేస్తున్న సమయంలో ఈ సినిమాకు అంకురార్పణ పడింది. మంచి కథ ఉంటే కలిసి సినిమా చేద్దామని సుకుమార్‌తో చెప్పగానే రెండు రోజుల్లోనే రంగస్థలం కథతో నా దగ్గరకు వచ్చారు. చాలా సింపుల్‌గా ఆ సినిమా ప్రయాణం మొదలైంది.


• నాన్నగారి సినిమాల కోసమే నిర్మాతగా మారాను. బయటివాళ్లతో సినిమాలు చేసే ఆలోచనలేదు. నా సినిమాలకు కూడా నిర్మాతగా వ్యవహరించను. నాన్నకు నేను ఇచ్చిన పారితోషికం తెలుగు ఇండస్ట్రీలో ఏ నిర్మాత ఇచ్చి ఉండడని అనుకుంటున్నాను(నవ్వుతూ).

• రాజమౌళి 'ఆర్ఆర్ఆర్' కథతో నా దగ్గరకు వచ్చినప్పుడు షాకయ్యాను. ఏం మాట్లాడాలో తెలియలేదు. కొద్ది క్షణాల వరకు సైలెంట్‌గా ఉండిపోయాను. ఇలాంటి ఆలోచన కూడా వస్తుందా అనిపించింది.రాజమౌళి మా కాంబినేషన్‌కు పరిపూర్ణంగా న్యాయం చేస్తారని అనుకుంటున్నాను. ఆ బాధ్యత ఆయనపైనే ఎక్కువగా ఉంది. తారక్‌తో పాటు నా అభిమానులను సంతృప్తి పరుస్తూ సినిమాను తీస్తారనే నమ్మకం ఉంది. తారక్‌తో ఉన్న అనుబంధం వల్ల అతడితో నటించడం సులభమైంది. తొలి షెడ్యూల్‌లో ఇద్దరి కాంబినేషన్‌లో పదిహేను రోజుల పాటు దర్శకుడు రాజమౌళి కీలక ఘట్టాలను చిత్రీకరించారు. సంక్రాంతి తర్వాత రెండో షెడ్యూల్ ప్రారంభం కానుంది.



రాజ్ కందుకూరి తనయుడి చిత్రం

'పెళ్లిచూపులు' చిత్రంతో నిర్మాతగా మంచి గుర్తింపును సొంతం చేసుకున్నారు రాజ్ కందుకూరి. ఆయన తనయుడు శివ కందుకూరిని హీరోగా పరిచయం చేస్తూ ధర్మపథ క్రియేషన్స్ పతాకంపై డి.సురేష్‌బాబు, మధుర శ్రీధర్ రెడ్డి సమర్పణలో నిర్మిస్తున్న తాజా చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ చిత్రం ద్వారా శేష సింధు రావును దర్శకురాలిగా పరిచయం చేస్తున్నారు. తమిళ చిత్రం '96' ఫేమ్ వర్ష బొల్లమ్మ కథానాయికగా నటిస్తున్నది.



వర్ష, శివ

రోమీ భాటియా పాత్రలో..

గత కొంత కాలంగా ప్రేమలో మునిగితేలిన బాలీవుడ్ జంట రణ్‌వీర్‌సింగ్, దీపికాపదుకునే ఈ మధ్య డెస్టినేషన్ వెడ్డింగ్‌తో ఒక్కటైన విషయం తెలిసిందే. ఈ జంట త్వరలో తెరపైన కూడా భార్యాభర్తలుగా కనిపించనున్నారని తెలిసింది. క్రికెట్ లెజెండ్ కపిల్‌దేవ్ జీవితకథని వెండితెరపై దృశ్యమానం చేస్తూ '83' పేరుతో ఓ బయోపిక్ త్వరలో సెట్స్‌పైకి రానున్నది. కబీర్‌ఖాన్ దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రంలో కపిల్‌దేవ్ పాత్రలో రణ్‌వీర్‌సింగ్ నటించబోతున్నారు. కపిల్ భార్య రోమీ భాటియాగా దీపికా పదుకునే కనిపించనుందని తెలిసింది. ఈ పాత్రకు దీపిక అయితేనే బాగుంటుందని దర్శకుడు కబీర్‌ఖాన్‌తో పాటు చిత్ర బృందం భావిస్తున్నట్లు బాలీవుడ్ చిత్ర వర్గాల సమాచారం. సంజయ్‌లీలా భన్సాలీ రూపొందించిన రామ్‌లీలా, బాజీరావ్ మస్తానీ, పద్మావతి వంటి చిత్రాల్లో రణవీర్, దీపిక కలిసి నటించిన విషయం తెలిసిందే.



దీపికా పదుకునే